తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 07.05.2025 | సంపుటి :11 సంచిక : 288 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370



ప్రకటనల కోసం సంప్రదించండి

98483 28698











## ఓబుళాపురం మైనింగ్ కేసులో

# 'గాలి'తో సహా ఐదుగురికి జైలు

### ఏడేళ్ల పాటు జైలు శిక్ష ఖరారు

- వీడీ రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేళ్లు కారాగారం
- తుది తీర్పు వెలువరించిన సీబీఐ కోర్టు
- సబితను నిర్దోషిగా ప్రకటించిన ధర్మాసనం
- 12ఏళ్ల క్రితం కన్నీళ్లతో కోర్టు మెట్లెక్కా
- కోర్టు తీర్పుపై మాజీ మంత్రి హర్షం

హైదరాబాద్(జనంసాక్షి):ఓబుళాపురంమైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు వెలువరించింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనులశాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష ఖరారు చేసింది. అలాగే, దోషులకు రూ. 10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకు రూ. 2 లక్షలు జరిమానా విధించింది. ఈ కేసులో అప్పటి గనులశాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డికి ఉపశమనం లభించింది. ఆమెతో పాటు అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంను సీబీఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.ఈ కేసులో వీడీ రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేళ్లు జైలు శిక్ష

మిగతా 2లో..

## నేడు దేశవ్యాప్తంగా

# మాక్‌డ్రిల్

### అన్ని రాష్ట్రాల్లోని 244 జిల్లాల్లో నిర్వహణ





- విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్‌లు, జనావాస ప్రాంతాల్లో శిక్షణ
- భద్రతా సన్నద్ధతపై,అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన తీరుపై పౌరులకు అవగాహన
- శత్రు దాడి జరిగినప్పుడు తమను తాము రక్షించుకోవడంపైనా శిక్షణ

న్యూఢిల్లీ(జనంసాక్షి): నగరవ్యాప్తంగా బుధవారం'ఆపరేషన్ అభ్యాస్' పేరుతో డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా నగరమంతా సైనర్ల మోత మోగనుంది. సైరన్ వినిపించగానే బహిరంగ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. సాయంత్రం 4.15 గంటలకు

మిగతా 2లో..

బుధవారం మాక్‌డ్రిల్స్ నిర్వహించే ప్రాంతాలను 3 కేటగిరీలుగా విభజించారు. మొదటి కేటగిరీలో ఢిల్లీ, ముంబయి, సూరత్, వడోదర, కక్రాపూర్, తారాపూర్, తాల్చేర్, కోట, రావత్, చెన్నై, కల్పక్కం, నరోరా జిల్లాలు ఉన్నాయి. రెండో జాబితాలో హైదరాబాద్, విశాఖపట్నం సహా 201 జిల్లాలు ఉన్నాయి. మూడో జాబితాలో 45 జిల్లాలు ఉన్నాయి. ఇక పాకిస్థాన్‌తో సరిహద్దు ఉన్న రాష్ట్రాలు గుజరాత్, పంజాబ్, హరియాణా, జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక సూచనలు జారీ చేసింది కేంద్ర ప్రభుత్వం

# ఆర్టీసీలో సమ్మె వాయిదా

### ముగ్గురు ఐఎఎస్‌లతో కమిటీ • మంత్రి పొన్నంతో చర్చల అనంతరం జేఏసీ ప్రకటన




హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలోఆర్టీసిసమ్మె వాయిదా పడింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జరిపిన చర్చలు సఫలం కావడంతో ఆర్టీసి కార్మిక సంఘాల నేతలు సమ్మెను వాయిదా వేస్తున్నట్లు- ప్రకటించారు. రేపటి నుంచి రాష్ట్రంలో సమ్మె చేయనున్నట్లు- కార్మిక సంఘాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు పిలుపునివ్వడంతో మంగళవారం తమ సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తో కార్మిక సంఘాల నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లారు. పలు సమస్యలపై చర్చించారు. అనంతరం మంత్రి

మిగతా 2లో..



# ఉద్యోగులను చులకన చేస్తారా?

### సీఎం అనుభవ రాహిత్యం బయటపడుతోంది

- కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోంది
- కేసీఆర్‌ను దూషిస్తే ఊరుకునేదిలేదు
- ఉద్యోగులను చులకన చేయడం దారుణం
- రేవంత్ దుర్మార్గపు ఆలోచనను అర్థం చేసుకోవాలి : కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణరాజకీయవేడి మరోసారి పెరిగింది. సిఎం రేవంత్ వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. వ్యక్తిగత దూషణలు, విమర్శలు వచ్చినా సహించామని, కానీ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నేతలపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు తట్టుకోలేక ఈ ప్రెస్‌మీట్ ఏర్పాటు- చేయాల్సి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ సాధనలో విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నాయకులు పార్టీల కతీతంగా పాల్గొన్నా వాస్తవాన్ని గుర్తుచేస్తూ, అలాంటి నేతలపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు బాధాకరంగా ఉన్నాయని అన్నారు.

మిగతా 2లో..

# సీఎం ఉన్నదే చెప్పారు



### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముక్కుసూటి మనిషి
### అప్పలు, అరాచకాలు ప్రజలకు తెలియాల్సి ఉంది
### మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

- ఉద్యోగుల రిటైర్మెంట్ ఎందుకు పెంచారో తెలియదా?
- కాళేశ్వరానికి లక్షకోట్లు ఎందుకు పెట్టారో తెలియదా?
- గత ప్రభుత్వం నిర్వాకంపైనే సీఎం మాట్లాడారని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డిముక్కు సూటి మనిషి అని.. గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల ఇబ్బంది పడుతున్నామని గుర్తు చేశారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలు ,అప్పులు, అరాచకాలు ప్రజలకు తెలియాల్సి ఉందని అందుకు సిఎం అలా మాట్లాడి ఉంటారని అన్నారు. మీడియాతో మంత్రి చీట్‌చాట్ నిర్వహించారు. బీజేపీ వాళ్లు దిగి పోండి అంటున్నారు.. బీజేపీ కేంద్రంలో పాలన చేతకాకపోతే దిగమను. పెహల్గం వైఫల్యంకి దిగిపో అనాలా.. బీజేపీ ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా..? మోడీ విదేశాలకు పోతే.. లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని ఒకరిద్దరు బెదిరించినట్టు- మాట్లాడారు .. దానికి హార్ట్ అయ్యి ఉంటారన్నారు.

మిగతా 2లో..

### అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశారు 2లో

కేసీఆర్ నిర్వాకం వల్ల నెలకు రూ.6వేల కోట్లు వడ్డీ కడుతున్నాం

బీఆర్ఎస్ అభివృద్ధి గాలి బుడగే..

నాటి ఆర్టీసీ సమ్మెతో ఎంతోమంది చనిపోయారు

కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క, చామల ఫైర్

## మోదీ నిర్లక్ష్యం వల్లే

# ఉగ్రదాడి

- ముందే సమాచారమున్నా ఎందుకు భద్రత కల్పించలేదు..?
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):పహల్గాం ఉగ్రదాడి వ్యవహారానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. పహల్గాంలో మరింత భద్రత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. 'సంవిధాన్ బచావో' పేరుతో రాంచీ వేదికగా నిర్వహించిన సభలో ఖర్గే ఈ విధంగా స్పందించారు.''దేశంలో పరిస్థితుల గురించి మీ అందరికీ తెలుసు. పహల్గాం ఉగ్రదాడి ఘటనకు సంబంధించి నిఘా వైఫల్యం ఉందని ప్రభుత్వం అంగీకరించింది. ఇంటెలిజెన్స్‌ను పటిష్ఠ పరచుకుంటామని వాళ్లే చెప్పారు. దాడికి మూడు రోజుల ముందే నిఘా సమాచారం ఉందని నాకు తెలిసింది.

మిగతా 2లో..

## పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబానికి

# రాహుల్ పరామర్శ

వార్త 2లో



## తెలంగాణ కులగణనను అనుసరించండి

### మోడీకి మలికార్జున ఖర్గే సుదీర్ఘ లేఖ

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశవ్యాప్తంగా కులగణన జరపడానికి అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరపాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోడీ ప్రభుత్వాన్ని కోరారు. అందరి అభిప్రాయాలతో ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ మేరకు ఆయన మోడీకి లేఖ రాశారు. దేశంలో మొట్టమొదటిసారిగా కులగణను తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ తెలంగాణ కులగణన నమూనాను

మిగతా 2లో..

### మినీ అంగన్వాడీ టీచర్లకు పదోన్నతి..

పెరిగిన వేతనాలు

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

కుల ఆధారిత రిజర్వేషన్లు

### రైలు బోగీల్లాంటివి

అందులో ప్రవేశించిన వ్యక్తులు ఇతరులను లోపలికి రానివ్వరు

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

రోడ్డు ప్రమాద బాధితులకు

### నగదు రహిత చికిత్స

రూ.1.5 లక్షల వరకు అందజేత

నేటి నుంచే అమల్లోకి..

కేంద్రం ఉత్తర్వులు

వివరాలు 2 లో

# మాస్కోపై డ్రోన్‌లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్

### నగరవ్యాప్తంగా విమానాశ్రయాల మూసివేత


మాస్కో(జనంసాక్షి):యుద్ధం ముగించేందుకు ఓవైపు అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ రష్యా- ఉక్రెయిన్ పరస్పర దాడులు కొనసాగిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా భారీస్థాయిలో విరుచుకుపడడంతో..కీవ్ పెద్ద ఎత్తున ప్రతీకార దాడులు చేస్తోంది. తాజాగా ఉక్రెయిన్ 100కు పైగా డ్రోన్లతో మాస్కోలోని డజనుకు పైగా ప్రాంతాలపై విరుచుకుపడింది. అయితే పలు డ్రోన్లను తాము సమర్థవంతంగా కూల్చేసినట్లు రష్యా పేర్కొంది. డ్రోన్ దాడుల కారణంగా మాస్కోకు సమీపంలోని 4 విమానాశ్రయాలను

మిగతా 2లో..



# సమర సన్నాహాలు

### పాక్ సరిహద్దులో 'వాయుసేన' భారీ విన్యాసాలు
### సరిహద్దు గ్రామాల్లో శరవేగంగా బంకర్ల నిర్మాణాలు



- బాంబులు ప్రభావం చూపనంత బలంగా నిర్మాణం
- ప్రతీ బంకర్‌లో అన్ని రకాల వసతులు.. రెండు గదులు, టాయిలెట్, భోజన ప్రాంతం
- ఒక్కో బంకర్‌లో 50 మంది కూర్చునే వీలు
- పంజాబ్‌లో ఉగ్ర కుట్ర భగ్నం
- కశ్మీర్‌లో మిలిటెంట్ల వేటలో భారీగా ఆయుధాలు స్వాధీనం.. గ్రనేడ్లు కలిగివున్న ఇద్దరి అరెస్ట్

జైపూర్(జనంసాక్షి):భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ సూచన మేరకు సంక్షోభ సమయంలో పౌరులు వ్యవహరించాల్సిన తీరుపై దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్స్ చేపట్టనున్నారు. ఇదే సమయంలో భారత వాయుసేన కూడా రాజస్థాన్‌లోని అంతర్జాతీయ సరిహద్దులో భారీస్థా యిలో విన్యాసాలు చేసేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి పైలట్లకు ఇచ్చే సమాచారాన్ని వాయుసేన జారీ చేసింది.భారత్-పాకిస్థాన్ సరిహద్దులో భారత వాయుసేన బుధవారం మాక్ డ్రిల్స్ మొదలుపెట్టనుంది. ఇందులో రఫేల్, మిరాజ్ 2000, సుఖోయ్-30 వంటి అన్ని రకాల యుద్ధవిమానాలు పాల్గొనన్నుట్లు వాయు సేన అధికారులు వెల్లడించారు. దాదాపు ఐదున్నర గంటలపాటు ఇవి కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో సరిహద్దు ఎయిర్‌పోర్టుల్లో విమానాల రాకపోకలు పూర్తిగా నిలిపివేయనున్నారు.

మిగతా 2లో..



# మన జలాలు.. మన హక్కు


- వాటిని దేశ ప్రయోజనాలకే వినియోగిస్తాం
- సింధూ నదీ జలాల ఒప్పందం నిలిపివేతపై తొలిసారి స్పందించిన ప్రధాని మోదీ

ఉగ్రవ్యతిరేకపోరులో భారత్‌కు అండగా ఉంటాం.. అమెరికా హామీ

భారత్‌కు మా పూర్తి మద్దతు.. వారికి అండగా ఉంటాం వార్త 2లో

ప్రధాని మోదీకి ఖతార్ పాలకుడి ఫోన్ .. మోదీతో డోభాల్ భేటీ

# దేనికైనా రెడీ



- మేం శాంతినే కోరుకుంటున్నాం
- చర్చలు జరుపుతామంటే ముందుకు వస్తాం
- కాదనుకుంటే యుద్ధానికైనా సిద్ధమే
- మరోసారి నోరు పారేసుకున్న బిలావల్
- నాలుగైదు రోజుల్లో భారత్ పాక్‌పై దాడి చేస్తుంది
- పాక్ దౌత్యవేత్త సంచలన ట్వీట్

వార్త 2లో

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
07.05.2025



సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన స్విట్జర్లాండ్ రాయబారి మాయా తిస్సాఫీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సరస్వతి పుష్కరాలకు రావాలని మంత్రి కొండా సురేఖ ఆహ్వానించారు. చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ విష్ణునాథ్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.



# ఉద్యోగులను చులకన చేస్తారా

రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న తీరు ఆయన పాలనాపరమైన అనుభవ లేకపోయినదాని సూచనగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలను మోసం చేసే అబద్ధాలుగా తేలిపోయాయని, తాము ఎప్పటి నుంచో ఢిల్లీ పార్టీలను నమ్మరాదని చెబుతున్నామని, రేవంత్ రెడ్డి మాటలు దివాలా కోరి వానిలా ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ అధికారం ఉన్నప్పటికీ, పలు హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేటీ–ఆర్ ప్రకారం, ఉద్యమ సమయంలో ఉద్యోగ సంఘాలు, ముఖ్యంగా కపక్షలు కీలకంగా కదం తొక్కాయి. వారి పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడ్డ వెంటనే ఉద్యమ నేతలకు గౌరవంగా ఉన్నత జీతాలు కల్పించామన్నారు. రేవంత్ రెడ్డి ఉద్యమంలో భాగం కాలేదని, ఉద్యమ ద్రోహిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పు మొత్తం 4.15 లక్షల కోట్లకే పరిమితమని, ప్రభుత్వం నుండి విరమించిన సమయంలో ఆదాయం నెలకు 18 వేల కోట్లు– ఉందని వివరించారు. ఇప్పుడూ అదే ఆదాయం వస్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించలేకపోతోందని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు శ్వేతపత్రాలు విడుదల చేస్తూ అప్పు లెక్కల్ని గందరగోళంగా మార్చుతున్నారని, ఒకసారి 6 లక్షల కోట్లు–, తర్వాత 8.29 లక్షల కోట్లు– అన్నారు అంటూ లెక్కల్లో అస్పష్టత ఉన్నదని చెప్పారు. రైతుబంధు, విద్యుత్ సరఫరా, నీటి కొరత వంటి అంశాల్లో కేసీఆర్ హయాంలో స్థిరత ఉందని, ఇప్పుడు అన్ని రంగాల్లో సంక్షోభం నెలకొంది. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేశారని విమర్శలు గుప్పించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి, ఇప్పుడు వారినే ప్రజల ముందుకు విలన్లుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని కేటీ–ఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టిన కేసీఆర్ పాలన తరువాత ఇప్పుడు విపరీత పరిస్థితులు నెలకొన్నాయని, ప్రజలు ఈ పరిస్థితిని గమనిస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# సీఎం ఉన్నదే చెప్పారు

హెలికాప్టర్ ప్రభుత్వం అద్దెకు తీసుకుందని.. మంత్రులు జిల్లాలు తిరిగితే... కార్ల కంటే హెలికాప్టర్ ఖర్చు తక్కువన్నారు. ఇప్పుడున్న హెలికాప్టర్ గత ప్రభుత్వం హయంలోనే అద్దెకు తీసుకున్నారని,వాళ్లు తిరగకుండా రెంట్ కట్టారని చెప్పారు... తాము వాడుతున్నట్లు– వెల్లడించారు. సీఎం ఆవేదనతో మాట్లాడటానికి గల కారణాన్ని మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. ప్రజా సంక్షేమం కోసం ఆలోచించి సీఎం మాట్లాడారు. చిన్నాభిన్నం చేసిన ఆర్థిక విధానం చూసి ఆవేదనతో మాట్లాడారు. నేను ఇచ్చిన మాట ప్రకారం అన్ని పనులు చేయాలి ... డబ్బులు లేవనే ఆవేదన సీఎంలో ఉంది. బీఆర్ఎస్ వాళ్లకు పేగు బంధం ఉంటే... జీతాలే సరిగా వేయలేదు. వాళ్లకు ప్రేమ ఉన్నట్టా..? మేం రాగానే డీఏ ఇచ్చాం. వాళ్ళలాగా మేము వదిలేయలేదు. కార్పొరేషన్ పేరుతో తెచ్చిన అప్పులు కూడా ప్రభుత్వమే కడుతుంది. కేటీఆర్.. ప్రభుత్వం చేసిన అప్పుల గురించే మాట్లాడుతున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. తెలంగాణలో రాజకీయాలు ప్రస్తుతం ఆర్థిక పరిస్థితులు, అందాల పోటీలపై మంత్రి శ్రీధర్ బాబు చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చలకు దారితీస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన విషయాలను ఉన్నది ఉన్నట్టుగా చెప్తారని, అందువల్ల ఆయనపై అనవసరమైన ఆరోపణలు చేయడం సరైంది కాదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ ఆర్థిక తప్పిదాలను సరిచేస్తున్నామని సీఎం చెప్పడం, రాష్ట్రానికి అవసరమైన మార్పులు తీసుకురావడంలో ఆయన తీవ్రంగా కృషి చేస్తున్నారని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వంపై మంత్రి శ్రీధర్ బాబు విమర్శలు చేస్తూ, ఈ పార్టీకి పాలించే అర్హత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఏ వ్యవస్థను కూడా హ్యాండిల్ చేయని బీజేపీకి పాలించే అర్హత ఎక్కడిదన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాల్సి వస్తుందని బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉద్యోగుల పదవి విరమణ వయస్సు పెంచారని గుర్తు చేశారు. మాకు ప్రభుత్వాన్ని నడిపే సత్తా ఉందో లేదో ప్రజలకి తెలుసని ఆయన అన్నారు. ఇది, ప్రభుత్వానికి ఉన్న బాధ్యతలను, ఉద్యోగుల సంక్షేమాన్ని గుర్తు చేస్తుందన్నారు. అందాల పోటీల గురించి మాట్లాడుతూ ఇవి అందానికి సంబంధించినవి కాదన్నారు.

# అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశారు

**హైదరాబాద్(జనంసాక్షి):**గత ప్రభుత్వం కొన్ని వర్గాలకే కొమ్ముకాసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని మంత్రి సీతక్క విమర్శించారు. కేసీఆర్ అప్పు.. తెలంగాణ భవిష్యత్తుకు ముప్పుగా దాపురించిందన్నారు. కేసీఆర్ నిర్వాకం వల్ల నెలకు 6 వేల కోట్ల ప్రజాధనాన్ని అప్పుల చెల్లింపుల కోసం మళ్లించాల్సి వస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి సీతక్క , ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వీరు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై అనవసర వ్యాఖ్యలతో కేటీఆర్ తన అసహనాన్ని ప్రదర్శిస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. సత్తా ఉన్న నాయకుడు కేసీఆర్ అయితే.. పత్తా లేకుండా ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. సత్తా ఉంటే అసెంబ్లీకి వచ్చి సత్తా నిరూపించుకోవాలని హితవుపలికారు. ఉద్యోగుల పోరాటాన్ని వాడుకున్న చరిత్ర బీఆర్ఎస్‌దని అంటూ మండిపడ్డారు. 40 మంది ఆర్టీసీ కార్మికుల ఉసురు తీసింది మీరు కాదా? అని ప్రశ్నించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ నాయకుల ఇంటి తలుపులు పగుల గొట్టింది ఎవరు కేటీఆర్ అని నిలదీశారు. ఎందరో ఉద్యమకారులను అవమానపరిచి బయటకు పంపిన చరిత్ర గులాబీ పార్టీదని మండిపడ్డారు. అప్పులు, అమ్మకాలు తప్ప బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఒక గాలి బుడగ అని ఎన్నికల్లో ప్రజలే తేల్చారన్నారు. బీఆర్ఎస్ అప్పుల మూలంగా ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. అయినా ఎక్కడా సంక్షేమానికి లోటు లేకుండా చూస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కేటీఆర్‌కు మైండ్ దొబ్బిందని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి కూడా మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల గురించి సీఎం మాట్లాడారని.. కేటీఆర్‌కు మెడ, కాళ్ల నొప్పులు దెబ్బకే పోయాయంటూ ఎద్దేవా చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. సమ్మె చేయొద్దు.. రాష్ట్రం బాగు చేసుకుందాం అని సీఎం చెప్పారని.. గతంలో 52 రోజులు సమ్మె చేస్తే.. కేసీఆర్ ఒక్క రోజు బయటికి రాలేదని గుర్తు చేశారు. సమ్మె చేస్తున్న వారిని నానా బూతులు ఆ నాడు తిట్టిందని తెలిపారు. రేవంత్ లా సౌమ్యంగా ఎప్పుడు చెప్పలేదన్నారు. ఆ రోజుల్లో సమ్మె చేస్తే ఉద్యోగ సంఘాల్లో శ్రీనివాస్ గౌడ్‌ను ఎమ్మెల్యే చేశారన్నారు. ఉద్యోగ సంఘం నేతలను మాట్లాడకుండా చేశారని మండిపడ్డారు. మిగులు రాష్ట్రాన్ని ఇస్తే 8 లక్షల కోట్ల అప్పులు చేశారన్నారు. వాస్తవ పరిస్థితులు చెప్పే ప్రయత్నం సీఎం చేశారని చెప్పుకొచ్చారు. ఎన్నడూ కేటీఆర్ ఊరికే లేరని.. ప్రతీరోజు తప్పుడు ప్రచారమే చేశారని ఫైర్ అయ్యారు.

# నేడు దేశవ్యాప్తంగా మాక్‌డ్రిల్

నగరంలోని నాలుగు చోట్ల (సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్‌బాగ్ డీఆర్‌డీవో, మౌలాలి ఎన్‌ఎఫ్‌సీలో) మాక్ డ్రిల్ నిర్వహిస్తారు. పోలీసులు, ఫైర్, ఎస్డీఆర్‌ఎఫ్, వైద్య, రెవెన్యూ, స్థానిక అధికారులు ఆయా ప్రాంతాలకు చేరుకుంటారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ఈ మాక్ డ్రిల్‌లో 12 సివిల్‌డిఫెన్స్ సర్వీసులు పాల్గొననున్నాయి. సాయంత్రం 4 గంటలకు నాలుగు ప్రాంతాల్లో ఎయిర్ రైడ్ డ్రిల్ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా నగరమంతా సైరన్లు మోగించనున్నారు. అన్ని కూడళ్లలో రెండు నిమిషాల పాటు సైరన్లు మోగనున్నాయి. సైరన్ రాగానే ఎలక్ట్రికల్ పరికరాలు, లైట్లు, స్టవ్‌లు ఆపాలని అధికారులు సూచించారు.కాగా జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి తర్వాత భారత ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరగగా... పాకిస్తాన్ విషయంలో భారత సర్కార్ పలు కఠిన చర్యలకు ఉపక్రమించింది. అయితే అదే సమయంలో దేశంలో పౌరులపై కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. సమర్థవంతమైన పౌర రక్షణ కోసం భద్రత సన్నద్ధతకు సంబంధించి మాక్ డ్రిల్స్ నిర్వహించాలని అనేక రాష్ట్రాలను కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ఆదేశించింది. బుధవారం మాక్ డ్రిల్స్ నిర్వహించాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. ఇందులో భాగంగా భద్రతా సన్నద్ధతపై పౌరులకు అవగాహన కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో తెలపాలని పేర్కొంది.సమర్థవం తమైన పౌర సంసిద్ధతను నిర్ధా రించే లక్ష్యంతో ఈ మాక్ డ్రిల్స్ ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌తో సహా అనేక రాష్ట్రాల్లో నిర్వహించనున్నారు. మాక్ డ్రిల్ సమయంలో తీసుకోవలసిన చర్యలలో వైమానిక దాడి హెచ్చరిక సైరన్‌లను అమలు చేయడం, శత్రు దాడి జరిగిన పుడు తమను తాము రక్షించుకోవడానికి పౌర రక్షణ అంశాలపై పౌరులకు శిక్షణ ఇవ్వడం వంటివి ఉన్నాయని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, కేంద్రపాలిత ప్రాంతాల నిర్వాహకులకు పంపిన సమాచారంలో కేంద్ర హెూం శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా మొత్తం 244 జిల్లాల్లో ఈ మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. పలు అంశాలను ప్రాతిపదికగా చేసుకుని ఈ జిల్లాలను మూడు కేటగిరీలుగా వర్గీకరించారు. ఢిల్లీ, ముంబై, ఉరన్, సూరత్, వడోదర, కక్రాపూర్, తారాపూర్, తాల్చేర్, కోట, రావత్ భటా, చెన్నై, కల్పక్కం, నరోరా... మొత్తంగా 13 జిల్లాలు కేటగిరీ–1 కిందకు వస్తాయి. ఇక కేటగిరీ–2 జాబితాలో201 జిల్లాలు ఉన్నాయి. మూడో కేటగిరీలో 45 జిల్లాలున్నాయి. ఈ జాబితాలో తెలుగు రాష్ట్రాలలోని హైదరాబాద్, విశాఖపట్నం కూడా ఉన్నాయి. వీటిని కేటగిరీ–2 జాబితాలో చేర్చారు.ఇక, ఈ మాక్ డ్రిల్స్‌ను విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్‌లు, ఇతర జనసమర్థ ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. వైమానిక దాడి హెచ్చరిక సైరన్ మోగినప్పుడు ఎలా స్పందించాలి, విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇళ్లలో ఉంచుకోవాల్సిన అత్యవసర వస్తువుల గురించి ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. భారత వైమానిక దళంతో హాట్‌లైన్, రేడియో–కమ్యూనికేషన్ లింక్‌లను అమలు చేయడం... కంట్రోల్ రూమ్‌లు, షాడో కంట్రోల్ రూమ్‌ల కార్యాచరణను పరీక్షించాలని కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ఆదేశించింది. తెలంగాణలో హైదరాబాద్ నగరంలోని ఓఆర్‌ఆర్ పరిధిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తారు. మొత్తం 12 పౌర రక్షణ సేవలు ఈ డ్రిల్‌ను చేపడతాయి. సాయంత్రం 4.15 గంటలకు నగరంలోని నాలుగు చోట్ల మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఆ జాబితాలో సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్‌బాగ్ డీఆర్‌డీవో, మౌలాలి ఎన్‌ఎఫ్‌సీ ఉన్నాయి.

# పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబానికి రాహుల్ పరామర్శ

**హరియాణా(జనంసాక్షి):**పహల్గాం ఉగ్రదాడిలో కన్నుమూసిన నేవీ లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కుటుంబాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పరామర్శించారు. హరియాణాలోని నర్వాల్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..భారత్ వైపు మళ్లీ ఎవరూ కన్నెత్తి చూడని విధంగా పహల్గాం దోషులను శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం విషయంలో కేంద్రానికి ప్రతిపక్షం తరఫున పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.హరియాణాకు చెందిన వినయ్–హిమాన్షి వివాహం ఏప్రిల్ 16న జరిగింది. 19న విందు నిర్వహించారు. అనంతరం భార్యను తీసుకొని జమ్మూకశ్మీర్‌కు హనీమూన్‌కు వెళ్లారు. తొలుత హనీమూన్ కోసం యూరప్ వెళ్లాలని నిర్ణయించుకున్న ఈ నవ జంట.. తమ వీసాలు రిజెక్ట్ కావడంతో జమ్మూకశ్మీర్‌కు వచ్చింది. ఉగ్రదాడితో ఆమె కలలన్నీ కల్లలయ్యాయి. పెళ్లై వారం కూడా గడవక ముందే.. తన కళ్ల ముందే జీవచ్ఛవంలా మారిన భర్తను చూసి హతాశురాలైంది. అంత్యక్రియల సమయంలో భర్తకు సెల్యూట్ చేస్తూ ఆమె రోదించిన తీరు ప్రతిఒక్కరిని బాధించింది.మరోవైపు పహల్గాం దాడి నేపథ్యంలో ఒక వర్గం వారిని టార్గెట్ చేసేలా వ్యాఖ్యలు చేయొద్దంటూ నర్వాల్ సతీమణి హిమాన్షి విజ్ఞప్తి చేయడంతో సోషల్ మీడియాలో పలువురు ఆమెను ట్రోల్ చేశారు. వారి చర్యలను మహిళా కమిషన్ తీవ్రంగా ఖండించింది. మహిళ గౌరవాన్ని కాపాడే దిశగా చర్యలు తీసుకునేందుకు తాము కట్టుబడి ఉన్నామని పేర్కొంది.

# ఓబుళాపురం మైనింగ్ కేసులో 'గాలి'తో సహా ఐదుగురికి జైలు

విధిం చింది. భూగర్భ గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్నందున అవినీతి నిరోధక చట్టం కింద ఆయనకు అదనపు శిక్షను ఖరారు చేసింది. ప్రభుత్వ అధికారిగా ఉంటూ అక్రమాలకు పాల్పడినందున మొత్తంగా 11 ఏళ్ల పాటు అతడికి జైలు శిక్ష పడింది. ఈ కేసులో ఏ2గా ఉన్న కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. గాలి జనార్దన్ రెడ్డితో సహా నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం గాలి జనార్దన్ రెడ్డి కర్ణాటకలోని గంగావతి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఓబులాపురం మైనింగ్ కేసులో ఆయనకు ఏడేళ్ల జైలు శిక్ష ఖరారు కావడంతో ఆయనపై అనర్హత వేటు పడే అవకాశం ఉంది. 'కల్యాణ రాజ్య ప్రగతి పక్ష' అనే పొలిటికల్ పార్టీని స్థాపించి 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో గాలి జనార్దన్ రెడ్డి గంగావతి నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత మళ్లీ బీజేపీలో చేరిపోయారు. అయితే.. సీబీఐ కోర్టు వెలువరించిన తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో సవాల్ చేసే అవకాశం కూడా ఉంది. ఇకపోతే ఓఎంసీ కేసులో గాలి జనార్దన్ రెడ్డి ఇప్పటికే కొంత కాలం జైలు జీవితం గడిపిన సంగతి తెలిసిందే. ఓబులాపురం మైనింగ్ కేసులో విచారణ దాదాపు 13 ఏళ్లకు పైగానే సాగింది. 3,,400 డాక్యుమెంట్లను పరిశీలించి, 219 మంది సాక్ష్యులను విచారించి.. కర్ణాటక ఫారెస్ట్ ల్యాండ్స్‌లో గాలి బ్రదర్స్ మైనింగ్ తవ్వకాల వల్ల 884.13 కోట్ల రూపాయలను రాష్ట్రం నష్టపోయిందనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి సీబీఐ కోర్టు తుది తీర్పు వెల్లడించడం గమనార్హం. 2007 జూన్ 18న ఓఎంసీకి లీజులు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్దేశపూర్వకంగానే 'క్యాప్టివ్' అనే పదాన్ని తొలగించారని, తద్వారా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై 2009లో డిసెంబర్ 7న తొలిసారి సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత తెలంగాణ హైకోర్టులో స్టే రావడం, మళ్లీ డివిజన్ బెంచ్ స్టే ఎత్తివేయడం.. ఇలా పలు రకాల పిటిషన్లు వేయడంతో దాదాపు 15 ఏళ్ల పాటు విచారణ కొనసాగింది. ఐదేళ్లు దర్యాప్తునకే సమయం పట్టింది. 2009 నుంచి 2014 వరకు సీబీఐ నాలుగు ఛార్జిషీట్‌లను దాఖలు చేసింది. ఓఎంసీ వ్యవహారంలో 2011లో ఛార్జిషీట్‌ను తొలిసారి వేయగా.. 2014లో తుది ఛార్జిషీట్ తర్వాత సుదీర్ఘంగా విచారణ జరిగింది. 219 మంది సాక్షులను విచారించింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు సాక్ష్యాలు, ఆధారాలను సీబీఐ సేకరించింది. అనంతపురంలోని ఓబుళాపురంలో గనుల కేటాయింపు, తవ్వకాలకు సంబంధించి అత్యాధునిక పరికరాలతో సీబీఐ ఆధారాలు సేకరించింది. అక్రమంగా తవ్వకాలు, రవాణా, ఎగుమతులు, విక్రయాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు– సీబీఐ గుర్తించింది. ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై పూర్తి ఆధారాలు, సాక్ష్యాల సేకరణతో 2014లో తుది ఛార్జిషీట్ దాఖలైంది. విదేశాలకు అక్రమంగా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేశారని, అక్రమ బినామీ లావాదేవీలు జరిగినట్లు– గుర్తించామని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఈ కేసు విచారణలో మొత్తంగా 3337 డాక్యుమెంట్లను పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన 68 హెక్టార్లలో కాకుండా పెద్ద ఎత్తున మైనింగ్ చేపట్టినట్లు సీబీఐ గుర్తించింది. ఈ కేసులో విచారణ దశలోనే ఏ5 లింగారెడ్డి మృతి చెందగా.. ఏ6 శ్రీలక్ష్మిని 2022లో ఈ కేసు నుంచి తెలంగాణ హైకోర్టు డిశ్చార్జి చేసింది. మొత్తంగా ఈ కేసునుంచి మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఊరట దక్కడంతో ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

పన్నెండున్నరేళ్ల క్రితం కన్నీళ్లతో కోర్టు మెట్లెక్కా:సబిత

ఓబుళాపురం మైనింగ్ కేసులో తనను సీబీఐ కోర్టు నిర్దోషిగా ప్రకటించడంపై మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తనను నిర్దోషిగా ప్రకటించిన న్యాయ వ్యవస్థకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కేసు విషయంలో పన్నెండున్నరేళ్ల క్రితం కన్నీళ్లతో కోర్టు మెట్లు ఎక్కానని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. ఎన్ని అపవాదులు వచ్చినా తన నియోజకవర్గ ప్రజలు మాత్రం తనకు అండగా నిలిచారన్నారు. ఈ తీర్పు అనంతరం ఆమె కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ఏ తప్పూ చేయకపోయినా ఈ కేసులో నన్ను చేర్చడంపై బాధ పడ్డాను. న్యాయ వ్యవస్థ ద్వారా తనకు న్యాయం జరుగుతుందని నమ్మాను. ఈరోజు అదే జరిగింది. కానీ, ఇన్నేళ్లుగా నేను పడిన అవమానాలు, ప్రతిపక్షంలో ఉన్నవారు నన్ను అవినీతిపరురాలినని, జైలుకు పోతానని మాటలు అంటుంటే ఎంతో బాధపడ్డాను. అలా ప్రచారం చేసినా నా జిల్లా ప్రజలు, నియోజకవర్గం ప్రజలు నాపై సంపూర్ణంగా విశ్వాసం ఉంచారు. ఎవరెన్ని మాట్లాడినా నమ్మకుండా నన్ను గెలిపిస్తూ వచ్చారు. ఇన్నేళ్లుగా నాతో పాటు ఉండి ధైర్యం చెప్పిన అందరికీ కృతజ్ఞతలని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపిన ఓబులాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఏ2గా ఉన్న కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది.

# మినీ అంగన్వాడీ టీచర్లకు పదోన్నతి..

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో మినీ అంగన్వాడీ టీచర్లకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. 3,989 మినీ అంగన్వాడీ టీచర్లకు అంగన్వాడీలుగా పదోన్నతి కల్పించింది.అంగన్వాడీ టీచర్లలాగే మినీ అంగన్వాడీలకు వేతనాలను వర్తింపజేయనున్నారు. ఏప్రిల్ నుంచి మినీ అంగన్వాడీ టీచర్లకూ రూ.13,650 చొప్పున వేతనం ఇవ్వనున్నారు. మినీ అంగన్వాడీ టీచర్లకు ఇప్పటి వరకు నెలకు రూ.7,800 జీతం ఇచ్చేవారు.ఉపాధి హామీ సిబ్బందికి 4 నెలల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రూ.62 కోట్లు విడుదలచేసింది. దీంతో 3,200 ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలకు వేతనాలు అందనున్నాయి.

# 'సమర' సన్నాహాలు

మరోవైపు శత్రుదేశం దాడులు చేస్తే సురక్షితంగా ప్రాణాలు కాపాడుకోవడంపై అవగాహన కల్పించేందుకు సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా దాదాపు 300 ప్రాంతాలను ఎంపిక చేశారు. వైమానిక దాడులు, బాంబు దాడులు జరిగితే ఎలా రక్షించుకోవాలో ప్రజలు, విద్యార్థులకు తెలియజేయనున్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర మార్గదర్శకాలను అనుసరించి ఈ డ్రిల్స్ చేపడతారు.

సరిహద్దు గ్రామాల్లో శరవేగంగా బంకర్ల నిర్మాణాలు

బాంబులు ప్రభావం చూపనంత బలంగా నిర్మాణం– ప్రతీ బంకర్‌లో రెండు గదులు, టాయిలెట్, భోజన ప్రాంతం– ఒక్కో బంకర్‌లో 50 మంది కూర్చునే వీలుజమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య యుద్ధ మేఘాలు అలుముకున్నాయి. త్వరలోనే పాకిస్థాన్‌పై భారత్ దాడి చేస్తుందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో జమ్మూలోని అంతర్జాతీయ సరిహద్దుకు ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో భూగర్భ బంకర్ల నిర్మాణాన్ని భారత ప్రభుత్వం వేగవంతం చేసింది. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి జమ్ము కశ్మీర్ సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్ సైన్యం ఎడతెరిపి లేకుండా కాల్పులు జరుపుతోంది. ఈ కాల్పుల నుంచి సరిహద్దు ప్రాంత ప్రజలను రక్షించడానికి భారత ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన బంకర్ల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు రక్షణ వర్గాలు చెబుతున్నాయి.సరిహద్దులోని సాంబా జిల్లా ప్రజలు హైఅలర్ట్ పాకిస్థాన్‌తో సరిహద్దు కలిగిన జమ్ము కశ్మీర్‌లోని సాంబా జిల్లాలోనూ ప్రజలు అలర్ట్ అయ్యారు. భారత్ –పాక్ యుద్ధం జరగొచ్చనే ఆందోళనతో ఈ జిల్లాలోని రామ్‌గఢ్ గ్రామస్థులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. యుద్ధం జరిగితే తమ ప్రాణాలను, ఆస్తులను కాపాడుకోవడానికి గ్రామంలో భూగర్భ బంకర్లను నిర్మించుకుంటున్నారు. ముఖ్యంగా అధిక జనసాంద్రత కలిగిన చాలా గ్రామాల్లోనూ డజన్ల కొద్దీ భూగర్భ బంకర్లను నిర్మించుకుంటున్నారు. "భారత్ – పాక్ సరిహద్దుల్లో పరిస్థితి మరింత దిగజారితే మమ్మల్ని మేం రక్షించుకోవాల్సి ఉంటుంది. మా కుటుంబాలు, పిల్లల భద్రత కోసం మేం చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా బంకర్లను నిర్మించుకుంటున్నాం" అని రామ్‌గఢ్ గ్రామస్థులు చెప్పారు.

# కుల ఆధారిత రిజర్వేషన్లు రైలు బోగీల్లాంటివి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**రిజర్వేషన్లను ఉద్దేశించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలోని కుల ఆధారిత రిజర్వేషన్లు రైలు బోగీల్లాంటివని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఆ కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన వ్యక్తులు ఇతరులను లోపలికి రానివ్వరని పేర్కొంది. మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్లపై వేసిన పిటిషన్ విచారణలో భాగంగా సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈవిధంగా స్పందించారు.మహారాష్ట్రలో 2016–17లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఓబీసీ కోటా విషయంలో జరుగుతోన్న న్యాయపోరాటంలో ఎన్నికల నిర్వహణలో జాప్యం చోటుచేసుకుంటోంది. ఓబీసీలకు 27 శాతం కోటాను అమలుచేయడం కోసం మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌ను 2021లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. కాగా.. ఓబీసీలకు సంబంధించిన డేటా ఉన్నప్పటికీ, దానిని ప్రభుత్వం ఉపయోగించడం లేదని తాజాగా పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టులో వాదించారు. .

# మన జలాలు.. మన హక్కు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో సింధూ నదీ జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. భారత్‌కు ఉద్దేశించిన జలాలు ఇక్కడే ఉంటాయని, వాటిని దేశ ప్రయోజనాలకే వినియోగిస్తామని స్పష్టం చేశారు. తాజా పరిణామాల వేళ అమెరికా కీలక ప్రకటన చేసింది.ఉగ్రవాదానికి వ్యతిరేకంగా న్యూఢిల్లీ చేసే పోరాటానికి తాము అండగా ఉంటామని పునరుద్ఘాటించింది. ఖతార్ పాలకుడు షేక్ తమీమ్ బిన్ హమద్ అల్‌థానీ ప్రధాని నరేంద్ర మోదీకి మంగళవారం ఫోన్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి తమీమ్ సంతాపం తెలియజేశారు. ఉగ్రవాదాన్ని పీచమణిచే పోరులో భారత్‌కు అండగా ఉంటామని ప్రకటించారు. ప్రధాని నరేంద్రమోదీతో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ భేటీ అయ్యారు. ప్రస్తుత భద్రతా పరిస్థితిపై చర్చించారు.

# దేనికైనా రెడీ

**ఇస్లామాబాద్(జనంసాక్షి):**శాంతి చర్చలకు పాకిస్థాన్ సిద్ధంగానే ఉందని పాకిస్థాన్ విదేశాంగ మాజీ మంత్రి బిలావల్ భుట్టో చెప్పాడు. అయితే, విధ్వంసం కావాలా? శాంతి కావాలో భారత్ నిర్ణయించుకోవాలంటూ మరోసారి విషం చిమ్మే ప్రయత్నమే చేశాడు.మరోవైపు భారత్‌కు వ్యతిరేకంగా భద్రతా మండలిలో తీర్మానం చేయించాలన్న పాక్ యత్నాలు మరోసారి బెడిసికొట్టాయి. ఫలితంగా దాయాదికే సభ్య దేశాల నుంచి కఠిన ప్రశ్నలు ఎదురయ్యాయి. ఉగ్రదాడికి పాల్పడిన వారు జవాబుదారీగా ఉండాలని తేల్చిచెప్పాయి. పాక్‌కు చెందిన దౌత్యవేత్త అబ్దుల్ బాసిత్ సంచలన ట్వీట్ చేశారు. వారం రోజుల్లో పాక్‌పై భారత్ దాడి చేసే అవకాశం ఉందని తెలిపారు. రష్యా విక్టరీ డే వేడుకల తర్వాతే మే 10–11 మధ్య ఇస్లామాబాద్‌పై భారత్ ప్రతీకార దాడులు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట వైరల్ అవుతోంది. కాగా, బాసిత్ భారత్‌లో పాకిస్థాన్ హైకమిషనర్‌గా పనిచేశారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు నగదు రహిత చికిత్సను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకం నేటి నుంచి అమల్లోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కేంద్ర రహదారుల రవాణాశాఖ విడుదల చేసింది. నేటి నుంచే ఈ పథకం అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. ఈ పథకం ద్వారా రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు రూ.1.5 లక్షల వరకూ ఉచిత వైద్య సేవలు పొందవచ్చు. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో ఉచిత వైద్యం అందించాలని సుప్రీంకోర్టు గత జనవరిలో తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇందు కోసం కేంద్రం 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ స్కీం–2025' పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడితే చికిత్సకు అయ్యే ఖర్చులో గరిష్ఠంగా రూ.1.50 లక్షలు ఈ పథకం ద్వారా ప్రభుత్వమే భరిస్తుంది. అయితే ఇది మొదటి ఏడు రోజుల చికిత్సకు అయ్యే బిల్లుకు మాత్రమే వర్తిస్తుంది.ప్రమాద ఘటన జరిగిన 24 గంటల్లోగా పోలీసులకు సమాచారాన్ని అందిస్తేనే స్కీం ద్వారా నగదు రహిత చికిత్సను పొం దొచ్చు.

# ఆర్టీసీలో సమ్మె వాయిదా

పొన్నం మాట్టాడుతూ.. సమ్మె ఆలోచన విరమించుకోవాలని కార్మిక సంఘాల నేతలకు విజ్ఞప్తి చేశారు. సమ్మెకు వెళ్లి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని కోరారు. ఇప్పుడిప్పుడే సంస్థ కోలుకుంటుందని.. సమ్మె చేస్తే నష్టం జరుగు తుందని చెప్పారు. కార్మికుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. త్వరలోనే కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి చెప్పడంతో తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేస్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు వెల్లడించారు. నేటి నుంచి సమ్మె చేయాలని నిశ్చయించుకున్న ఆర్టీసీ జేఏసీ నాయకులతో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. జేఏసీ నేతల డిమాండ్లను సమ్మతి తెలపడంతో ప్రస్తుతానికి సమ్మె విరమించుకున్నట్లు వారు ప్రకటించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్, నవీన్ మిత్తల్ ఉంటారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉద్యోగులతో జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. తమ డిమాండ్లకు మంత్రి సానుకూలంగా స్పందించడంతో ఉద్యోగ సంఘాలు సమ్మెను వాయిదా వేసుకున్నాయి. ఆర్టీసీ జేఏసీ నేతలు సమ్మె వాయిదా వేస్తున్నట్లు– సచివాలయం మీడియా పాయింట్ వద్ద వెల్లడించారు. ప్రభుత్వంతో సుధీర్ఘంగా జరిపిన చర్చలు సఫలమయ్యామని ప్రకటించారు. పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావులతో అనేక అంశాలపై చర్చించినట్లు– పేర్కొన్నారు.

# మోదీ నిర్లక్ష్యం వల్లే ఉగ్రదాడి

అలాంటప్పుడు అక్కడ (పహల్గాంలో) తగినంత భద్రతా ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నా " అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు

**తెలంగాణ కులగణను అనుసరించండి**

అనుసరించాలని ఖర్గే లేఖలో మోడీ ప్రభుత్వాన్ని కోరారు. తుది కుల గణన నివేదికలో ఏదీ దాచిపెట్టవద్దని.. ప్రతి కులం యొక్క సామాజిక, ఆర్థిక డేటాను ప్రజలకు చేరువలో ఉంచాలి అని ఆయన మోడీ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రిజర్వేషన్లకు సంబంధించిన విషయంపై కూడా ఖర్గే లేఖలో పేర్కొన్నారు. ఆగస్టు 1994 నుండి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో తమిళనాడు రిజర్వేషన్ల చట్టం మాత్రమే రక్షించబడింది. అదే మాదిరిగా.. ఇతర రాష్ట్రాల చట్టాలను కూడా మన రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలి అని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ, ఓబిసి రిజర్వేషన్లలో 50 శాతం పరిమితిని కూడా రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించేందుకు కులగణన సర్వే ద్వారా స్పష్టమవుతుందని ఆయన లేఖలో తెలిపారు. ఈ కులగణన సర్వే ద్వారా ప్రైవేట్ విద్యా సంస్థల్లో కూడా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఒబిసిలకు రిజర్వేషన్లు కల్పించే ఆర్టికల్ 15(5)ను అమలు చేయాల్సిన అవసరం నెలకొంటు–ంది అని ఖర్గే లేఖలో పేర్కొన్నారు. న్నత విద్యా శాఖకు గ్రాంట్ల డిమాండ్లపై మార్చి 25, 2025న సమర్పించిన 364వ నివేదికలో విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ– ఆర్టికల్ 15(5)ని అమలు చేయడానికి కొత్త చట్టాన్ని సిఫార్సు చేసిందని ఖర్గే పేర్కొన్నారు.

# మాస్కోపై డ్రోన్‌లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్

తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.మాస్కోలోని ప్రధాన ప్రాంతాల్లో ఉక్రెయిన్ దాడుల వల్ల మరో తొమ్మిది ప్రాంతీయ విమానాశ్రయాలు కూడా స్వల్పంగా ధ్వంసమయ్యాయని..దీంతో వాటిని మూసేయాల్సి వచ్చిందని రష్యా పౌర విమానయాన సంస్థ రోసావియాట్సియా వెల్లడించింది. మరోవైపు రష్యా సరిహద్దు వద్ద ఉన్న ఉక్రెయిన్‌లోని ఖార్కివ్ నగరంపై రష్యా దళాలు 20కి పైగా డ్రోన్లను ప్రయోగించాయి. ఈ దాడిలో నలుగురు గాయపడగా.. దాదాపు 100 మార్కెట్ స్టాళ్లు ధ్వంసమయ్యాయి. మరో ప్రాంతంలో మాస్కో బాంబులు ప్రయోగించిన ఘటనలో ఏడుగురు పౌరులు గాయపడినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. రెండో ప్రపంచయుద్ధ విజయానికి 80వ వార్షికోత్సవం 'విక్టరీ డే' సందర్భంగా మే 8 నుంచి 10 వరకు మూడు రోజులపాటు రష్యా.. ఉక్రెయిన్‌పై పోరు విరమణను ప్రకటించింది. వాటికన్‌లో పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు హాజరైన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ అయి.. శాంతి ఒప్పంద చర్చలు జరిపిన విషయం తెలిసిందే. అనంతరం మాస్కో తన నిర్ణయాన్ని వెలువరించింది. ప్రపంచ దేశాల నేతలు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 'విక్టరీ డే'కు ముఖ్య అతిథి అని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల పేర్కొన్నారు.

## మరుగుజ్జు చినిగెపల్లి రమేష్‌ను ఆదుకోండి



- కలెక్టర్ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

న్యాల్ కల్, మే 06 (జనం సాక్షి) : న్యాల్‌కల్ మండలం చినిగేపల్లి గ్రామానికి చెందిన గౌని శాంతప్ప కుమారుడు గౌని రమేష్ మరగుజ్జును ఆదుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి డాక్టర్ దామోదర రాజనర్సింహ జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరుకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో జరిగిన "ప్రజావాణి" కార్యక్రమంలో తన గోడును విన్నవించేందుకు మరుగుజ్జు గౌను రమేష్ కలెక్టరేట్ కు వచ్చాడు. కలెక్టరేట్ కార్యాలయానికి వస్తున్న మంత్రి దామోదర మరుగుజ్జు రమేష్ ను చూసి చెల్లించి పోయాడు. మంత్రి రమేష్ వద్దకు వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నాడు. ఈ మేరకు రమేష్ మంత్రికి విన్నవిస్తూ.. పుట్టుకతోనే మరుగుజ్జుగా ఉన్నానని, ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో సతమత మవుతున్నానని, సోదరి రేణుక (35) ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతుందని, 35 సంవత్సరాలు గడిచిన మా సోదరికి వివాహం చేయ లేకపోయామని, మా అమ్మ, నాన్న నిత్యం కూలి పని చేస్తేనే పూట గడవనుందని.. ఆరోగ్య మంత్రి, కలెక్టర్ ముందు వాపోయాడు. నేను పదవ తరగతి వరకు చదువుకున్నానని, ఏదో ఒక ప్రభుత్వ సంస్థలో అటెండర్ గా పనిచేసేందుకు అవకాశం కల్పించాలని మంత్రికి విన్నవించాడు. వెంటనే స్పందించిన మంత్రి తన పక్కనే ఉన్న కలెక్టర్ క్రాంతికి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

## అక్రమార్కుల కేసుల్లో ప్రత్యేక కోర్టులు : లక్ష్మీనారాయణ

హైదరాబాద్, మే 6 (జనంసాక్షి) : అనంతపురం జిల్లా ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో హైదరాబాద్ సీబీఐ కోర్టు ఇచ్చిన తుది తీర్పును సీబీఐ పూర్వ జేడీ వీవీ లక్ష్మీనారాయణ స్వాగతించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడిన వారికి శిక్షలు పడితేనే మిగతా వారిలో భయం కలుగుతుందన్నారు. ఈ తరహా ఘటనల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ వ్యవహారంలో రూ.840 కోట్ల విలువైన ఖనిజాన్ని అక్రమంగా తరలించారు. అక్రమాలకు శిక్ష పడితే మిగతా వారిలో భయం కలుగుతుంది. శిక్షలు పడకపోతే భూగర్భ సంపదను విచ్చలవిడిగా దోచేసే ప్రమాదం ఉంది. త్వరలో ఈడీ దర్యాప్తు కూడా కొనసాగవచ్చని, సీబీఐ కోర్టు తీర్పుపై కొందరు హైకోర్టుకు వెళ్లవచ్చని, అందువల్ల ఇలాంటి ఘటనల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు.

## కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయండి

- లక్షలాదిగా వచ్చే భక్తులకు సకల ఏర్పాట్లు చేయాలి
- రవాణా, శానిటరీ, భద్రతా, వైద్యం, ప్రచార చర్యలు పక్కాగా ఉండాలి
- అధికార యంత్రాంగానికి రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబులు ఆదేశం



హైదరాబాద్, మే 6 (జనంసాక్షి) : భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రవహించే "అంతర్వాహిని" సరస్వతీ నదీ పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికార యంత్రాంగానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ, పరిశ్రమలు, చేనేత శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. మంగళవారం మంత్రి సురేఖ ఆధ్వర్యంలో కాళేశ్వరం సరస్వతీ పుష్కరాల రివ్యూ మీటింగ్ హైదరాబాద్ సెక్రటేరియట్ లోని ఎండోమెంట్ మంత్రి కార్యాలయంలో జరిగింది. అత్యంత పవిత్రమైన ఈ త్రివేణి సంగమ స్నానానికి లక్షలాది భక్తులు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వస్తారని తెలిపారు. సరస్వతీ నది పుష్కరాలు బృహస్పతి మిథున రాశి ( మిథునరాశి )లోకి ప్రవేశించినప్పటి నుండి 12 రోజుల పాటు ఆచరిస్తారని, ఉమ్మడి రాష్ట్రంలో వచ్చిన పుష్కరాలు తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడిన తరువాత వచ్చాయని అన్నారు. 2025 మే 14న రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించే సమయంలో పుష్కరకాలం ప్రారంభమవుతాయని, అప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని చెప్పారు. మరుసటి రోజు సూర్యోదయం నుంచి పుష్కర పుణ్యస్నానాలు ఆచరించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ఈ పుష్కరాల కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్ల వివరాలు భక్తులకు సమగ్రంగా తెలిపేందుకు కాళేశ్వరం సరస్వతి పుష్కరాల వెబ్ పోర్టల్, మొబైల్ యాప్‌ను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల ప్రారంభించారు. సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులు, యాత్రికులకు సంబంధించిన వివరాలు తెలిపేందుకు వాటిని ప్రా రంభించినట్టు మంత్రి కొండా సురేఖ తెలిపారు. 'సరస్వతీ పుష్కరాలు' పండుగకు స్నాన ఘాట్ల విస్తరణతో సహా వివిధ అభివృద్ధి పనులను విస్తృతం గా చేపట్టినట్టు ఇరువురు మంత్రులు తెలిపారు. కొన్ని చిన్న చిన్న పనులు పెండింగ్ లో ఉన్నాయని... అవి కూడా పుష్కరాలు ప్రారంభం అయ్యేలోగా అయిపోతాయని అధికారులకు మంత్రులు నివేదించారు. కాళేశ్వరానికి సంబంధించిన వివరాలన్నీ ఆయా వెబ్ సైట్, యాప్ ద్వారా తెలియజేయాలన్నారు. ఆర్టీసీ బస్సులను అవసరానికి అనుగుణంగా నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక అమలు చేసిన ఉచిత బస్సు పథకం ద్వారా దేవాదాయ శాఖకు లాభం చేకూరినట్టు మంత్రి కొండా తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వస్తున్నట్టు మంత్రి కొండా సురేఖ చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని మంత్రి సురేఖ సూచించారు. 'ఉత్తరాన ప్రయాగ వద్ద, దక్షిణ భారతంలో కేవలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో మాత్రమే సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహిస్తుందని మంత్రి తెలిపారు. పవిత్ర సరస్వతీ పుష్కర స్నానం చేసిన వారికి సమస్త పాపములు తొలగి పోతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వాసిస్తారని ఆమె తెలిపారు.

### పీఠాధిపతులతో పవిత్ర పుష్కర స్నానం

సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు ఒక పీఠాధిపతి ఈ పుష్కర స్నానం చేయనున్నట్టు మంత్రి కొండా తెలిపారు. పుష్కర ప్రారంభం మే 15, 16వ తేదీన శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠం, రంగంపేట, మెదక్ నుంచి శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామిలు పాల్గొని సరస్వతి పుష్కరాలను ప్రారంభిస్తారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సీఎస్ రామకృష్ణరావు, డీజీపీ జితేందర్, దేవాదాయ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఆర్ అండ్ బీ ప్రిన్స్ పల్ సెక్రటరీ వికాస్ రాజ్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, ఎండోమెంట్ కమిషనర్ వెంకటరావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఇతర శాఖల ఉన్నతాధికారులు, ఆలయ ఈఓ మహేశ్, ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

# రేవంత్ వల్ల మాదిగలకు న్యాయం

- చంద్రబాబు వల్ల అన్యాయం
- డాక్టర్ పిడమర్తి రవి



హైదరాబాద్, మే 6 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణలో సీఎం రేవంత్ రెడ్డి వల్ల మాదిగల న్యాయం జరిగిందని, ఆంధ్రాలో ఎస్సీ వర్గీకరణలో చంద్రబాబు నాయుడు వల్ల మాదిగల అన్యాయం జరిగిందని మాదిగ జేఏసీ ఫౌండర్ అండ్ చైర్మెన్ పిడమర్తి రవి అన్నారు. బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ వద్ద ఉన్న బాబు జగ్జీరావు విగ్రహం వద్ద ఖైరతాబాద్ నియోజకవర్గ సీట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. తెలంగాణలో ముందు నుంచి ఏడు శాతం అడిగితే మాదిగలకు రేవంత్ రెడ్డి తొమ్మిది శాతం రిజర్వేషన్ ఇచ్చి రోస్టర్ లో తన 9.75% చేశారని, ఆంధ్రాలో ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు 6.5% మాలలకు 7.5% ఇచ్చినట్టుగా మనం చూసామని, రోస్టర్‌లో మాదిగలకు ఏడు రావాల్సిన ఆరు శాతం వచ్చిందని తెలిపారు. మాలలకు 8 శాతం వచ్చింది దానివల్ల మాదిగల కన్యాయం జరిగినట్టుగా తాము భావిస్తున్నామన్నారు. దాన్ని సరిచేయాల్సిందిగా చంద్రబాబు నాయుడు ను కోరుతామన్నారు. వర్గీకరణ ఉద్యమం చేసింది మాదిగలైతే లాభం జరిగింది ఆంధ్రలో మాలలకని, రోస్టర్‌లో మాదిగలకు జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని కోరారు. ముందు నుంచి మాదిగలు ఏపీ కూటమిలో భాగస్వామ్యం ఉన్నప్పటికీ మాదిగలను విస్మరించడం అన్యాయమని, ఇప్పటికైనా మీరు దాని సరిచేయాల్సిందిగా కోరారు. 26లో జరిగే జనాభా లెక్కల్లో ఆంధ్రాలో జిల్లాల వారీగా వర్గీకరణతో పాటు తెలంగాణలో కూడా జిల్లాల వారీగా వర్గీకరణ చేయాలని కోరారు. మే నెలలో పెరేడ్ గ్రౌండ్ లో విజయోత్సవ సభ జరపాలని తాము ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మీసాల మల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి దళిత బహుజన సమితి అధ్యక్షులు బొమ్మరాజు స్టాలిన్, మాదిగజేసి సిటీ అధ్యక్షులు జేరిపోతుల సాయి, బిఎస్ఎఫ్ రాష్ట్ర కరీంనగర్ బోరెల్లి సురేష్, మాదిగ యూత్ జెసి అధ్యక్షులు నక్క మహేష్, కోటి గణేష్ కవాడిగూడ శేఖర్ శివకుమార్ పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 252 దరఖాస్తులు

- దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య



హైదరాబాద్, మే 6 (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 252 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 56, విద్యుత్ శాఖకు సంబంధించి 32, రెవెన్యూ శాఖకు సంబంధించి 50, ప్రవాసి ప్రజావాణి కి 01, ఇందిరమ్మ ఇండ్ల కోసం 44 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 69 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## మెట్టు మార్గంలో మరిన్ని సౌకర్యాలు : టీటీడీ ఈవో

తిరుమల, మే6 (జనంసాక్షి) : తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పి స్తామని తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో జె. శ్యామలరావు తెలిపారు. టోకెన్లు పొందేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయందృష్టికి వచ్చిన నేపథ్యంలో.. తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి. వీరబ్రహ్మంతో కలిసి మంగళవారం కాలినడక మార్గంలో పరిస్థితిని పరిశీలించారు. శ్రీవారి మెట్టు మార్గంలో దర్శనానికి సంబంధించి టోకెన్లు పొంద డానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, ఆటోవాలాల నుంచి సరైన సహకారం లేదనే విషయం బోర్డు దృష్టికి వచ్చిందన్నారు.

## సంధ్యా కన్వెన్షన్ ఆక్రమణల తొలగింపు

- అక్రమ కట్టడాలను కూల్చివేసిన హైడ్రా
- శ్రీధరరావుపై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు



హైదరాబాద్, మే 06 (జనంసాక్షి) : శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న సంధ్యా కన్వెన్షన్ ఆక్రమణలను మంగళవారం హైడ్రా తొలగించింది. ఫెర్టిలై జర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే ఔట్‌లో సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధరరావు ఆక్రమణలకు పాల్పడ్డారంటూ వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా చర్యలు తీసుకుంది. అనుమతి లేకుండా నిర్మించిన సంధ్యా కన్వెన్షన్ మిని హాల్‌తో పాటు.. ప్రధాన కన్వెన్షన్‌ను ఆనుకుని నిర్మించిన వంట గదులను, 10 రెస్టు రూంలను హైడ్రా తొలగించింది. అలాగే ఐరన్ పిల్లర్లతో జీ ప్లస్ 2గా నిర్మించిన రెండు కట్టడాలను కూడా కూల్చింది. 1980 దశకంలో 20 ఎకరాల విస్తీర్ణంలో 162 ప్లాట్లతో లే ఔట్ వేయగా దాని నామ రూపాలు లేకుండా సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్‌రావు చేశారంటూ హైడ్రా ప్రజావాణిలో పలువురు ప్లాట్ యజమానులు ఫిర్యాదు చేశారు. సంధ్యా కన్వెన్షన్ పేరిట అడుగుపెట్టి పక్కనే ఉన్న మా లే ఔట్‌ను కబ్జా చేశారు. కష్టార్జితంతో కొనుక్కున్న ప్లాట్ల చిరునామా లేకుండా..మొత్తం హద్దులను చెరిపేశారు. లే ఔట్‌లో రహదారులు, పార్కుల ఆనవాళ్లు లేకుండా ఆక్రమించేశారు. ఇదేమని అడిగితే తమపైనే దాడులు చేశారు. ఈ మోసాలను తట్టుకోలేక పలువురు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. ఒకటా రెండా.. 30 వరకూ కేసులు ఆయనపై పలు పోలీసు స్టేషన్లో నమోదయ్యాయి. తమ లే ఔట్‌కు సంబంధించి కూడా 5కు పైగా కేసులు ఆయనపై నమోదయ్యాయి. హైడ్రా రావడంతో మాకు ధైర్యంవచ్చింది. మీరైనా చర్యలు తీసుకోండి' అని లే ఔట్‌లోని పలువురు ప్లాట్ యజమానుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రాకు సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు ఆక్రమణలు ఒకదాని తర్వాత ఒకటిగా బయటపడ్డాయి. అక్కడ లే ఔట్ నామరూపాలు లేకుండా కబ్జాలు జరిగాయని.. పలునిర్మాణాలకు అనుమతులు లేవని అధికారులు నిర్ధారించుకున్నారు. ఇదే విషయాన్ని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారికి అధికారులు నివేదించారు. కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. లే ఔట్ చుట్టూ నిర్మించిన ప్రహరీతో పాటు పలు ఆర్చిలను హైడ్రా కూల్చివేసింది.

### శ్రీధరరావుపై కొనసాగుతున్న ఫిర్యాదులు..

హైడ్రా చర్యలతో ధైర్యాన్ని కూడగట్టుకున్నబాధితులు వివిధ మార్గాల్లో ఫిర్యాదు చేస్తున్నారు. నగరంలో ఉన్నవారే కాకుండా.. విదేశాల్లో ఉన్నవారు కూడా హైడ్రాను ఆన్‌లైన్లో ఫిర్యాదు చేస్తున్నారు. తమను లే ఔట్‌లోకి కూడా రానీయకుండా అడ్డుకున్నారని.. మా ప్రమేయం లేకుండా డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు రాయించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని పలువురు హైడ్రాకు ఫిర్యాదుచేశారు. విదేశాల నుంచి మెయిల్స్‌తో పాటు.. వీడియో రూపంలో వారి గోడును వెల్లగక్కుతున్నారు. అక్కడ మేము కొనుక్కున్న ప్లాట్ లేదని శ్రీధరరావు మనుషులు చెప్పడంతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నారంటూ దిల్లీ నుంచి ఓ మహిళ ఆన్‌లైన్లో ఫిర్యాదుచేశారు. త్వరలో హైదరాబాద్ వచ్చి హైడ్రా కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేస్తానంటూ వేడుకున్నారు. ఇలా ఒకరి తర్వాత ఒకరుగా హైడ్రాను సంప్రదిస్తున్నారు. ఒక్క ఫెర్టిలైజర్స్ కార్పరేషన్ ఉద్యోగుల లే ఔట్ వారే కాకుండా.. వేర్వేరు ప్రాంతాల్లో శ్రీధర రావు చేసిన ఆక్రమణలపై ఫిర్యాదులందుతున్నాయి. ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలకు సంబంధించి హైడ్రాకు పలువురు ఫిర్యాదు చేస్తున్నారు.

# కాటారం పోలీస్ స్టేషన్ సమీపంలో దారుణం

- ప్రతీకారం తీర్చుకునేందుకే మహిళపై గొడ్డలితో యువకుడి దాడి
- కాటారం లో మొదలైన ప్రతికార హత్యలు



కాటారం మే 6 ( జనం సాక్షి ) బీ కాటారం హైటెక్ పోలీస్ స్టేషన్ సమీపంలో దారుణం చోటుచేసుకుంది. ఐదు గంటల భూమి కోసం హత్య గురైన వ్యక్తి కుమారుడు మరుపాక అంజి నిందితురాలైన లచ్చక్క పై గొడ్డలి తో దాడి చేసిన సంఘటన మంగళవారం పోలీస్ స్టేషన్ సమీపంలో జరిగింది. కాటారం మండలం దేవరాంపల్లి గ్రామానికి చెందిన మారుపాక లచ్చక్క అనే మహిళ మారుపాక సారయ్య ను హత్య చేసిన కేసులో అరెస్ట్ కాగా గత కొన్ని రోజుల క్రితం కండిషన్ బేలు పై విడుదలైంది. ప్రతి మంగళవారం కాటారం పోలీస్ స్టేషన్ కు వచ్చి హాజరై కావాల్సి ఉండగా మంగళవారం పోలీస్ స్టేషన్ కి వచ్చింది. తన తండ్రి సారయ్యను గత సంవత్సరం డిసెంబర్ 14న దేవరాంపల్లి గ్రామంలో లచ్చక్క మరో ముగ్గురు తో కలిసి దారణంగా హత్య చేశారు. దానికి ప్రతికారంగా అంజి పగ తీర్చుకునేందుకు పథకం రచించి పోలీస్ స్టేషన్ ముందే చంపి లొంగి పోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. లచ్చక్క పై దాడి చేస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు అడ్డగించి ఆపడంతో గాయాలతో బయటపడినట్లు తెలుస్తుంది. లచ్చక పరిస్థితి విషమంగా ఉండడంతో భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# సిఎం వ్యాఖ్యల్లో నిజాయితీ ఉంది

బిఆర్ఎస్ లాగా బుకాయించడం రాదు
ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఎదురుదాడి

హైదరాబాద్, మే6 (జనంసాక్షి) : తెలంగాణ ఆర్థిక పరిస్థితిని నిజాయితీగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తెలిపారు. ఈటల హాఫ్ బిజెపి.. హాఫ్ బిఆర్ఎస్ అని దయాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సిఎం కెసిఆర్ చేసిన అప్పులకు నెలకు రూ.7 వేల కోట్లు- కట్టాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. తెలంగాణను దోచుకున్న దొంగలు బిఆర్ఎస్ నాయకులని, ఉద్యమం చేస్తున్నట్లు నటించి పార్టీ నిర్మించుకున్నారని అన్నారు. కెసిఆర్ గుణం ఇంకా మారలేదని విమర్శించారు. కెటిఆర్ కాలు విరిగినా ఆయనే ప్రెస్ మీట్ పెట్టాలా? అని అద్దంకి ప్రశ్నించారు. కెటిఆర్ ను పైకి తేవడానికి పద్ధతి ప్రకారం కెసిఆర్ ప్లాన్ చేస్తున్నారని, బిఆర్ఎస్ రజతోత్సవ సభలో హరీష్ రావు ఫొటో కూడా లేదని ఎద్దేవా చేశారు. హరీష్ రావును కరివేపాకులా పక్కన పెట్టారని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు.




# ఓ ముఖ్యమంత్రి అప్ప పుట్టడం లేదని మాట్లాడటం సిగ్గుచేటు

- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర



హైదరాబాద్, మే 6 (జనంసాక్షి) : ఓ ముఖ్యమంత్రి అప్పు పుట్టడం లేదని మాట్లాడటం సిగ్గుచేటని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర అన్నారు. గత ప్రభుత్వాన్ని ప్రజలలో చులకన చేయాలని దురుద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రం దివాలా తీసిందని, డబ్బు లేదని ఉద్యోగస్తులకు డిఏలు గాని పిఆర్సిలు గాని పెన్షన్ బెనిఫిట్స్ గాని ఇవ్వలేమని ముఖ్యమంత్రి చెప్పడం వారి స్థాయికి తగదని అన్నారు. ఎలక్షన్స్ ముందు హామీలు ఇచ్చే ముందు అన్ని విషయాలు తెలిసి నోటికి వచ్చిన వాగ్దానాలు చేసి గ్యారెంటీ ల పేరుతో డిక్లరేషన్ల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు మొండి చేయి చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగస్తులను బెదిరించే ధోరణిలో మాట్లాడటం బాధాకరమన్నారు. ప్రజలకు ఉద్యోగస్తులకు మధ్యలో పంచాయతీ పెట్టటానికి కుట్రలు చేయడం సరికాదన్నారు. ఉన్నదే 18500 కోట్లు ఎట్లా పంచుతామో చెప్పండి ఏ పథకాలు ఆపుదామో చెప్పండి మాట్లాడుతూ మీటింగ్ పెడతా మీటింగ్ లో ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడాలని బెదిరిస్తున్నారని ఇది తగదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సామాజిక రాజకీయ అంశాల పట్ల పూర్తిగా అవగాహన ఉన్న తమ నాయకుడు కేసీఆర్ మొదటి నుంచి చెప్తున్నారని, కాంగ్రెస్ ను నమ్మితే ప్రజలకు గాడిద గుడ్డు తప్ప ఏమీ మిగలదని కాంగ్రెస్లో ప్రస్తుతం ఉన్న నాయకులకి ఒక్కరికి కూడా హార్దిక అంశాల పట్ల పరిపాలన పట్ల సంక్షేమ అభివృద్ధి పట్ల అవగాహన లేదని ఆనాడే చెప్పారని ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు వాళ్ళ జేబులు నింపుకోవడం తప్ప ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల గురించి ఆలోచించడం లేదని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రజలు అన్ని విషయాలు అర్థమై రాబోయే కాలంలో కాంగ్రెస్ నాయకులను గ్రామాలలోకి రాకుండా ప్రశ్నించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. ముఖ్యమంత్రి చేతకాకపోతే తెలంగాణ ప్రజలకు బాండ్ పేపర్లపై సంతకాలు చేసి ప్రజలను మోసం చేసినందుకు తెలంగాణ అమరవీరుల స్థూపం దగ్గర ముఖ్యమంత్రితో సహా మంత్రులందరూ ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే సరైన సమయంలో సరైన రీతిలో ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్తారని అన్నారు ఇప్పటికైనా రాష్ట్రం యొక్క పరువు ప్రతిష్టలు అప్పుల పేరుతో తక్కువ చేయవద్దని తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా బాధ్యతగల పదవిలో ఉండి ఇలాంటి మాటలు మాట్లాడడం తెలంగాణ రాష్ట్రానికి అభివృద్ధికి సంక్షేమానికి నిరోధకంగా మారే అవకాశం ఉందని, మాట్లాడేటప్పుడు అవగాహనతో సోయితో మాట్లాడితే మంచిదని హితవు పలికారు. ఇప్పటికైనా తెలంగాణ సమాజం మేధావి వర్గం అభ్యుదయ వాదులు ప్రజా సంఘాలు ఈ ప్రభుత్వ మోసపూరిత విధానాలను ఖండించి తెలంగాణను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
7 మే 2025
తెలంగాణ

# బీజేపీ నేతలపై విభిన్న కుంభకోణాల ఆరోపణలు



ఇటీవల రిపబ్లిక్ టీవీ వ్యాఖ్యాత అర్నబ్ గోస్వామి, తన టీవీ ఛానెల్‌లో నెహ్రూ కాలం నుండి మన్ మోహన్ సింగ్ వరకు కాంగ్రెస్ పార్టీలో, వారి ప్రభుత్వ కాలంలో జరిగిన అనేక అవినీతి కార్యక్రమలను గురించి ప్రస్తావన చేశారు. వాటిలో పూర్తి విచారణ జరిగి, కోర్టుల్లో శిక్షలు పడిన కేసులు బహు అరుదు. రాజకీయ జోక్యంతో విచారణ మధ్యలో ఆపటం, వివిధ కారణాలతో విచారణ మధ్యలో ఆగిపోయిన సంఘటనలు అనేకం.
2014లో బీజేపీ అధికారంలోకి వచ్చాక కూడా అనేక మంది కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులపై అనేక అవినీతి, అధికార దుర్వినియోగం కేసులు పెట్టారు. ఈ పదేళ్లుగా కొందరిపై విచారణ జరుగుతోంది. కొందరిపై కోర్టుల్లో విచారణ వాదోపవాదాలు జరుగుతున్నాయి. కేసులు వివిధ రకాల కారణాల రీత్యా వాయిదాలు పడుతు ఉన్నాయి. విచారణ పూర్తి అయిపోయి శిక్షలు పడిన కేసులు బహు తక్కువగా ఉన్నాయి. చాలా వరకు ఆధారాలు లేని, పసలేని కేసులు కోర్టులో వీగిపోతున్నాయి. వీటిలో చాలా కేసులు రాజకీయ ప్రేరేపితమైనవి.
ఈ మధ్య కాంగ్రెస్ నుండి, ఇతర పార్టీల నుండి వివిధ స్థాయి నేతలు ఈడీ, ఐటీ, సీబీఐ, కేసుల వేధింపులు భరించలేక... బీజేపీలో చేరి పునీతులయ్యారు. వీరినే (వాషింగ్ పౌడర్ నిర్మా) అంటూ వ్యంగ్యంగా కామెంట్స్ వినవస్తున్నాయి. వారిపై కేసులు మాఫీ,లేదా ఆ కేసులు విచారణ కొనసాగకుండా డెడ్ స్టోరేజ్‌లో ఉండిపోతాయి. కొందరు బీజేపీ నాయకుల అండదండలతో కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా రాజ్యం ఏలుతున్నారు. గత 75 ఏళ్లుగా కాంగ్రెస్ అవినీతి చరిత్ర గురించి అందరికీ తెలిసిందే.
ఇక పోతే బీజేపీలో అవినీతి ఆరోపణలు ఉన్ననాయకులు లేరా?అందరూ నీతి పరులేనా? అవి నీతి మరకలు అంటనివారేనా? వారి చరిత్ర కూడా సూక్ష్మంగా పరిశీలన చేద్దాం. భారత రాజకీయాలలో ఆధిపత్యం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అనేక ఆర్థిక , పరిపాలనా "కుంభకోణాల" ఆరోపణలను ఎదుర్కొంటోంది. ఫేస్ బుక్ (X) 'వంటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాప్తి చెందిన ఈ ఆరోపణలు ఎన్నికల నిధుల వివాదాల నుండి ప్రజా వనరుల దుర్వినియోగం వరకు విస్తరించాయి. అయితే, ఈ ఆరోపణలు ధృవీకరించబడిన ఆధారాల లేకపోవడంతో ఊహాగానాలుగా మిగిలిపోతున్నాయి. ఈ వ్యాసం బీజేపీపై ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ పత్రికలో, ఎలక్ట్రానిక్ మీడియాలో, సోషల్ మీడియాలో ఇప్పటికే బలంగా వచ్చిన వార్తా కథనాలు, ఇప్పటికీ వెలువడుతున్న పలు ఆరోపణల ఆధారంగా ఈ వ్యాసం రాయటం జరిగిందని పాఠకులు గమనించాలి.(నోట్: ఇప్పుడు బీజేపీ అధికారంలో ఉంది. కనుక వివిధ కోర్టుల్లో ఆ పార్టీ పై , ప్రభుత్వం పై వచ్చిన ఆరోపణలపై కేసులు మాత్రమే దాఖలు చేశారు.అనేక కారణాలు వల్ల పూర్తి స్థాయి విచారణ వేగంగా జరగటం లేదు.ఇంకా కోర్టులు తుది తీర్పులు ఏ కేసులోనూ ఇవ్వలేదు) ఎలక్టోరల్ బాండ్స్ స్కీమ్, 2018లో ప్రవేశపెట్టబడినది, ఈ ఆరోపణల పై 'X' లో అనేక ఆరోపణల పోస్టులు వచ్చాయి. "భారత దేశ చరిత్రలో అతిపెద్ద కుంభకోణం"గా పేర్కొంటూ, బీజేపీ రూ. 6,060 కోట్ల నుండి రూ.11,562 కోట్ల వరకు సేకరించిందని ఆరోపిస్తున్నాయి. గుజరాత్ లో ఒక దళిత రైతు కుటుంబం రూ.10 కోట్ల విరాళంలో మోసపోయిందని ఒక పోస్ట్ పేర్కొంది. 2024లో సుప్రీం కోర్టు ఈ స్కీమ్‌ను రద్దు చేసినప్పటికీ, ఈ ఆరోపణలు ఇంకా నిరూపణ కాలేదు.
కర్ణాటక రాష్ట్రంలో, బీజేపీ 2023 వరకు పాలన సాగించినప్పటికీ,'X' పోస్టులు రూ. 1.5 లక్షల కోట్ల దోపిడీ మరియు 40 శాతం కమీషన్ డిమాండ్ ఆరోపణలు అనేకం వచ్చాయి.అయితే, ఈ ఆరోపణలపై న్యాయపరమైన విచారణలు పూర్తి కాలేదు. శిక్షలు ఎవరికీ విధించ లేదు.
అదానీ స్కామ్, కోల్ స్కామ్, డీమానిటైజేషన్, కామన్వెల్త్ గేమ్స్, గుజరాత్ స్టేట్ పెట్రోలియం, రాజస్థాన్ ఫేక్ పైలట్ స్కామ్ వంటి ఆరోపణలు 'X' లో అనేక. వ్యాప్తి చెందాయి. అయితే, ఈ ఆరోపణలు న్యాయపరంగా విచారణ పూర్తి కాలేదు. కనుక శిక్షలు పడలేదు.
కొన్ని పోస్టులను పరిశీలిస్తే బీజేపీని "నెంబర్ గేమ్ లో నిష్ణాతురాలి గా విమర్శిస్తూ," రూ.15 లక్షల బ్లాక్ మనీ" లేదా "రూ.20 లక్షల కోట్ల కోవిడ్ ప్యాకేజీ" వంటి వాగ్దానాలను లేవనెత్తాయి. "కేరళ స్టోరీ" వివాదంలో మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు సంఖ్యలను తారుమారు చేసినట్లు ఆరోపణలు ఉచ్చాయి. ఈ ఆరోపణలు అసంతృప్తిని ప్రతిబింబిస్తాయి, కానీ ఆధారాలు ఇంత వరకు నిరూపితం కాలేదు.
ఈ ఆరోపణలు అధికార- ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయాల ఆధిపత్యం పోటీలో భాగంగా నడుస్తున్నాయి. సామాజిక మాధ్యమాల(సోషల్ మీడియా) వేగం, మరియు పారదర్శకత లోపం వల్ల కొనసాగుతున్నాయి. అనేక కేసుల భారాల వల్ల న్యాయ వ్యవస్థ, నిదానంగా విచారణ పలుమార్లు వాయిదాల వల్ల ఈ ఆరోపణల పై తీర్పులు వెలువడటంలో జాప్యం జరుగుతోంది. ఈ ఆరోపణలు జాగ్రత్తగా పరిశీలించాలి. కోర్టు తీర్పులు, అధికారిక ఆడిట్లు, లేదా ఎన్నికల సంఘ డేటాపై ఆధారపడాలి. రాజకీయ ఉద్దేశాలతో కూడిన ఈ వాతావరణంలో, విమర్శనాత్మక ఆలోచనే మన ఉత్తమ సాధనం. దానిని జాగ్రత్తగా ఉపయోగించాలి.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# మానవత్వం ఎక్కడ?



మన ప్రపంచంలో ఆధునికత అత్యంత వేగంగా పెరిగిపోతుంది కంప్యూటర్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంకా మరెన్నో కొత్త కొత్త ఆవిష్కరణలు జరుగుతున్నాయి, ఈ రోబోటిక్ యుగంలో మనిషి తన మానవత్వాన్ని తన మనిషి తనని మొత్తానికే కోల్పోతున్నాడు, ఒకపక్క గాజాలో జరిగే మరణ హోమంలో చిన్నారులు అక్కడి అమాయక ప్రజలు తమ ప్రాణాలు కోల్పోతుంటే మరోపక్క వారికి అలాగే జరగాలి అని మాట్లాడే వారు కూడా ఉన్నారు. వారి తప్పేంటి? వారికి మద్దతుగా మాట్లాడిన వాళ్లు కూడా నీరస్తులే... ఎక్కడైనా ఒక తప్పు జరుగుతుంది అని తెలిసి గొంతేతిన ప్రతి ఒక్కడిని నలిపివేయాలి అని ప్రభుత్వాలు చూస్తున్నాయి, ఇప్పుడు మనదేశంలో కూడా అదే జరుగుతుంది, మనిషికి మాట్లాడే స్వేచ్ఛ లేదు మానవత్వాన్ని చాటే స్వేచ్ఛ లేదు కనీసం ఒకరికి మద్దతుగా మాట్లాడిన తప్పే, ఆన్లైన్ ట్రోలింగ్ భూతాలు వారిని విడిచి పెట్టావు, పని పాట లేకుండా ఫేక్ ఐడి లు క్రియేట్ చేసుకుని ఇష్టం వచ్చినట్టు రోల్ చేయడం అనేది ఒక అలవాటైపోయింది, సత్యం ఏంటో తెలుసుకోకుండా నిజాన్ని ఆరా తీయకుండా ఏది కనిపిస్తే తనకి ఏది అనిపిస్తే దానిని ట్రోల్ చేయడం ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం ఒక ట్రెండ్ అయిపోయింది, పెహల్గాంలో జరిగిన ఘటనలో నీవల్ ఆఫీసర్ భార్య హిమాన్షి నీ కూడా ఈ ట్రలింగ్ భూతాలు వదలలేదు... హిమాన్షి ఒక ఇండియన్ ఆమె ఒక సెక్యులర్ ఇండియన్ ఆమె తన అభిప్రాయాన్ని చాటుతూ ముస్లింల వెంట పడకండి కాశ్మీర్ల వెంట పడకండి అందులో వారి తప్పు ఏం లేదు ప్రతి ఒక్క ముస్లిం టెర్రరిస్ట్ కాదు అని ఒక ట్వీట్ చేసింది అదే తను చేసిన పాపం. తను ఈ దేశస్కురాలు కాదని, ముస్లింల సోదరీ అని, పాకిస్తానీ అని భర్త మీద తనకి ప్రేమ లేదని ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు ఆమెని ట్రోల్ చేయడం మొదలుపెట్టారు, ఇది ఎక్కడి న్యాయం? తనకి తన అభిప్రాయాన్ని చాటుకునే హక్కు లేదా? ఉమెన్స్ రైట్స్ ఆమెకి తోడుగా నిలిచింది, కాశ్మీర్లో కాల్పులను దూరం నుండి విని ఒక యువకుడు అల్లాహు అక్బర్ అనసాగాడు దానిని కూడా ట్రోల్ చేయడం మొదలుపెట్టారు, అతడు ఒక టెర్రరిస్ట్ అని అతడికి ముద్ర వేస్తున్నారు. మనదేశంలో అనేక కులమతాలు ఉన్నాయి వాటికి తగ్గట్టు మనకి ఆనందం వచ్చిన బాధ కలిగిన లేదా భయపడిన మన మతాన్ని బట్టి మనం దేవుడి పేరు పలుకుతాం ఉదాహరణకి ఒక హిందూ హనుమాన్ చాలీసా చదువుతాడు లేదా హరే రామ హరే రామ అంటాడు అదే ఒక క్రిస్టియన్ హల్లెలూయ అంటాడు అలాగే ఒక ముస్లిం అల్లాహు అక్బర్ అంటాడు. అయితే ఇప్పుడు ఇది కూడా తప్పైపోయింది మనం మన నోటితో స్వేచ్ఛగా దేవుడి పేరు కూడా తీయలేమా? తీస్తే టెర్రరిస్ట్ అయిపోతారా ఈ దేశంలో మనుషుల ను చంపేస్తున్నారు, మానవత్వాన్ని చంపేస్తున్నారు, ఇదంతా కేవలం పేర్లు మార్చుకొని ఫేక్ ఐడి లు క్రియేట్ చేసుకుని ట్రోల్ చేసే వారి పని, ఒకవైపు మన సైన్యం మాక్ డ్రిల్స్ చేసుకుంటూ యుద్ధానికి ప్రిపేర్ అవుతుంది, మన వైపు ఎలాంటి దాడి కాకూడదని ప్రతి ఒక్క భారత పౌరుడు స్వేచ్ఛగా బతకాలని మన సైనికులు అందరూ ఎంతో శ్రమ పడుతున్నారు కానీ మనలో మనం ఈ జాతి కులం మతం పేరు మీద గొడవ పెట్టుకొని చేస్తున్నాం, మన దేశం మన ఐక్యతలోనే ఉందని దానిని ఎవరు విడదీయలేని చాటే సమయం ఇది మనం ఈ ట్రోలర్ల బారిన పడకుండా జాగ్రత్త పడే సమయం ఇది. హిమాన్షి లాంటి వారితో కలిసి నడిచే సమయం ఇది. ఆమెకి పూర్తిగా మద్దతు తెలిపాలి, అమాయకులైన కాశ్మీరుల మీద వారు టెర్రరిస్టులని టెర్రరిస్టులకు సహాయపడ్డారని కొంతమంది వారిని శిక్షిస్తున్నారు ఇది తప్పు ..వాళ్లు మన దేశ ప్రజలే వారికి జరిగిన అన్యాయం మీద మనం మాట్లాడాలి కూడా మనం సహాయ పడకూడదు, ఏదైనా న్యూస్ తెలిసిన వెంటనే అది నిజమో కాదో ముందు తెలుసుకోవాలి. తర్వాత దాన్ని ఇతరులకు పంపాలి ముందే ఒక న్యూస్ తెలిసింది కదా దీని వైరల్ చేసేద్దాం అని ఉండొద్దు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తేనే ఈ ట్రోలర్ల వారి నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చు ఫేక్ న్యూస్ స్ప్రెడ్ చేసుకుంటూ ఇతరులకు బాధనిచ్చి ఆనందాన్ని పొందే ఈ ట్రోలర్ల కి బుద్ధి చెప్పాలి, మీ ముందు హేట్ లేదా ట్రోల్ చేసే ఎవరైనా ఎకౌంట్ కనిపిస్తే వెంటనే దాన్ని రిపోర్ట్ చేయండి. ఒక బాధ్యత గల పౌరుడిగా మనం ఏదైతే చేయగలం, మన దేశాన్ని ఒక సేఫ్ సెక్యులర్ దేశంగా మళ్లీ తీర్చిదిద్దుకోవాల్సిన సమయం ఇది, కులమత విభేదాలకు అతీతంగా మనం నిలుస్తామని చాటి చెప్పే సమయం ఇది, ఎవరికైనా ఇండియాలో అన్ని కుల మతాలు ఎలా కలిసి ఉంటాయో చూపించండి అంటే ఒక్కసారి సింగరేణి కి వెళ్ళండి అని చెప్పండి ఎందుకంటే అక్కడ ఉన్న ఆప్యాయత అనురాగం జాతి మత కుల విభేదాలకు అతీతంగా ఉంటాయి అక్కడ అందరూ సింగరేణి కార్మికులే సింగరేణి వారి కుటుంబం ఇటువంటి సమయంలో సింగరేణి మనకు ఆదర్శం... మానవత్వం గురించి మాట్లాడే ప్రతి ఒక్కరితో సంఘీభవిద్దాం వారికి తోడుగా నిలుద్దాం మన దేశం నుండి ఈ హేటిని తొలగిద్దాం.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

## ఆపలేం

ఆపలేం అలల్ని అలల విన్యాసాల్ని
కలల్ని కలల కవాతుల్ని
ఆపలేం
ఉరకలేసే ఉత్సాహాల్ని ఉరుముతున్న
ఉద్రేకాల్ని
ఆపలేం
దాచిన దుఃఖాన్ని రేగిన కోపాన్ని
ఆపలేం
విచ్చిన తామర పువ్వులతో సోలిపోయే
గుండె ఆనందాన్ని
మెచ్చిన చిన్నారి నవ్వులతో తేలిపోయే
మనసు ఆహ్లాదాన్ని
ఆపలేం
మిత్రుడగుపిస్తే చేయి కలపక
గురువెదురైతే దండం పెట్టక ఆపలేం
మంచు కురిసేటి ఒకానొక సాయం
సంధ్యలో
చిరు దరహాసపు ఎర్ర గులాబీ కనిపిస్తే
కనుల భాషతో కవ్వించక కవిత
రాయక ఆపలేం
గాలిని ఆపలేం పిల్లగాలో సుడిగాలో
జల్లుని ఆపలేం చిరుజల్లో వానజల్లో
ఆపలేం
పరివ్యాప్తమై పల్లవించే పరిమళాల్ని
కన్నెర్ర చేసే ప్రకృతి ప్రళయాల్ని
ఆపలేం
వినువీధుల విహరించే నవ్య భవ్య
వివేకాన్ని
విశ్వవ్యాప్త పరిపూరిత ఫరిడవిల్లు
వికాసాన్ని
ఆపలేం
%అడుగు బడుగు జీవులకై
అంకురించు విప్లవాన్ని
తెగిపడ్డ సంకెళ్లలో అసమాన త్యాగాల
విజయాన్ని
ఆపలేం
విధి లిఖితాన్ని మార్చే వినూత్న కలాన్ని
విధి వంచితులతో విచిత్ర క్రీడలాడే
కాలాన్ని ప్రభుత్వాల నిష్క్రియత్వానికి
నీళ్లు వదలక పాలకుల
అచేతనావస్థకు చరమగీతం
ఆలపించక
ఆపలేం
ఉద్యోగం లేక ఉపాధి లేక
ఉసురుమంటూ
ఊరురా కూలీల వలసల్ని
బ్యాంకు రుణాలు కట్టలేక ప్రైవేటు
బాకీలు తీర్చలేక
అధికారుల అనధికారుల
సూటిపోటి మాటలు పడలేక
రైతుల ఆత్మహత్యల్ని
కనీవినీ ఎరుగని కరువుతో
పూట గడువక సాపాటు లేక
గిరిజనుల హరిజనుల ఆకలి చావుల్ని
ఆపలేం

కోటం చంద్రశేఖర్
9492043348

## గరం గరం చాయ్

ఈ ఆకాశం అద్దం
అది కార్చే నీటి బొట్టు
అక్షర సత్యం.
శిలలను సింహాలుగా మార్చేదే కవిత్వం.
ముసలి గొంతుకను సైతం తెరిపించేదే
నవజీవన గాత్రం.
యువకుల్లారా
మూలుగుతున్న మౌన మునుల్లారా...
కాలాన్ని కరగదీసి
వెన్నెముక అరగదీసి
ఫ్లెక్సీలో మెరుస్తున్న
ఓ అమాయకపు నక్షత్రాల్లారా....

అగ్గిలోనా కరిగి
బొగ్గులోన మెరిసేదే
అభ్యుదయ భావగీతం.

టెక్నాలజీ వీరుల్లారా,
టెక్సాస్ బాధితులారా
గ్రీన్ కార్డు హోల్డర్లారా
మన మట్టి నవజీవనశక్తి
మన గాలి అభ్యుదయ ప్రాణశక్తి.
మన నీరు నయగార కాదు
చీకటిపై పోరాడుతున్న
గరం గరం చాయ్...

సాదే సురేష్
9441692519

## అక్కడ!!



ఊరేగింపులు లేవు
కన్నీళ్లు లేవు
పూలరేకులు, పన్నీరు జల్లుల
వలపోతలు
అసలు లేనే లేవు
యేపేరు లేని శరీరాలు
భూమిలో నిశ్శబ్దంగా కప్పబడి
అధికారుల మరణాల
గణాంకాల పట్టికలో
చేరిపోయాయి

శాంతికాముక సూత్రాలు వల్లె
వేస్తూ...
మధ్యవర్తిత్వ ఒప్పందాలు
చేసుకున్న రాజ్యం
నిత్యం చాపకింద నీరై
చటుక్కున చుట్టేస్తుంది


ఊపిరి సలపనివ్వని
సమస్యల సవాళ్లను
నిత్యం భుజం మీద మోస్తూ
నడిచిన దారి గుండా
వాళ్ళు ఎన్నెన్ని
ఎర్రనిపరిష్కారాల పూలు
పూయించారో!!
ఆదివాసీ గిరిజనుల్లో
విద్వేషాన్ని రగిలించిందెవ్వరో?
అడవి సంపదను
బహుళజాతి సంస్థల పాల్జేస్తూ
పచ్చని అడవుల్లో
మారణహోమాన్ని
సృష్టిస్తున్నదెవరో?
అందరికి యేరుకయే!!

ఇప్పుడు రాజ్యానికీ
మరణాల లెక్కలు
విజయం కావచ్చు!!

శతాబ్దాల బానిసత్వానికి
ప్రతీకలైన మనమే...
ఇక అక్షరాల రక్తపు మరకలను
వేళ్లకు అంటించుకొనీ
అమరులయిన వారు వదిలేసిన
ఖాళీల్ని పోరాటాలతో నింపి
కాస్తయినా
మనిషితనంతో వెలిగిపోదాం!!!

అనితా కృష్ణ గండమళ్ళ

# ఆత్మరక్షణలో ఆదివాసులు



ఆదిమ జాతి ఆదివాసులు, ఆది నుండి ఈ ప్రపంచానికి నాగరికత నేర్పించారు. రాజ్యాలు నిర్మించి, రాజ్యాలను పరిపాలించిన ఘనత ఆదివాసులకు ఉంది.ఆదివాసి గోండ్ రాజు అయిన భక్త బుల్దన్ షా అనే రాజు మహారాష్ట్రలోని దేవ్ గాడ్ ప్రాంతాన్ని రాజధానిగా చేసుకొని పరిపాలిస్తున్న క్రమంలో పరిపాలన పరంగా సమస్య ఏర్పడడంతో, పరిపాలన సౌలభ్యం కొరకు దేవ్ ఘడ్ నుండి నాగపూర్ కి రాజధానిని మార్చాడు. ఇక్కడ ఖిల్లా (అంటే కోట అని అర్థం)నిర్మించి పరిపాలన కొనసాగించాడు. ఈ విధంగా నాగ్ పూర్ పురాతన కాలంలో నాగవంశ గోండ్ రాజుల యొక్క రాజధానియే కాక గోండి ధర్మ సంస్కృతి కేంద్రంగా సింగోర్ ఘడ్ కోట, చౌరగాడ్ కోట సత్పుర పర్వతశ్రేణులల్లో నిర్మించిన ఉంది. అక్కడ అనేక నీటి బావులు మరియు చెరువులు ఉన్నాయి. చంద్రపూర్ ప్రాంతం చారిత్మాత్మకం గా గోండ్వానా రాజ్యంలో ఒక ముఖ్యమైన భాగంగా ఉండేది. అక్కడ గోండ్వానా రాజులు పరిపాలించిన అనేక కోటలు మరియు రాజ్యాలు ఉన్నాయి. 13వ శతాబ్దంలో గోండ్వన రాజులు, ఖండక్య బల్లాల్ షా, ఇరాయి మరియు జర్పట్ నదుల సంఘమం వద్ద నిర్మించారు. కోట చుట్టూ బలమైన గోడలు మరియు అనేక ప్రవేశ ద్వారాలు ఉన్నాయి. వీటిలో జత్ పుర గేట్,బఘడ్ ఖిడ్కి, హనుమాన్ కిడ్కి, పఠాన్ పురగేట్ ,విఠోబ ఖిటికి, బింబాగెట్ మరియు చోర్ కిటికి ముఖ్యమైవి. చాంద రాజ్యం ఇతర గోండ్వానా రాజ్యాలైన ఖేర్లా మరియు దేవ్ ఘడ్ లకు సమకాలికంగా ఉండేది. ఈ ప్రాంతాన్ని పరిపాలించిన కొందరు ముఖ్యమైన రాజులలో భీమ్ బల్లాల్ సింగ్ ఈయన అదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్, ఉట్నూర్ ని రాజధానిగా చేసుకొని రాజ్యాన్ని స్థాపించారు. నీల్ ఖండ్ షా గోండ్వానా చివరి రాజు.గోండ్వానా రాజ్య కోటలు తన ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.
గోండ్వాన రాజ్యం 8వ శతాబ్దం నుండి 18 వ శతాబ్దం వరకు మధ్య భారత దేశంలో మహారాష్ట్రలోని విదర్భ, మధ్యప్రదేశ్, చతిస్గడ్, ఉత్తర తెలంగాణ, పశ్చిమ ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలను గోండ్వానా సామ్రాజ్యంగా సుదీర్ఘం గా పరిపాలించారు. 1751లో నాగపూర్‌కు చెందిన మరాఠా పాలకుడు రాఘోజీ భోంస్లే ఈ రాజ్యాన్ని జయించాడు, తద్వారా గోండ్వానా పాలన అంతమైంది. బ్రిటిష్ ప్రభుత్వం రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో అంటే 1944 లో పరిపాలన సౌలభ్యం కొరకు, బ్రిటిష్ ప్రభుత్వం హైమన్ డార్ఫ్ ని ఆదివాసుల స్థితిగతులపై పరిశోధన చేయాలని ఆదేశించింది. హైమన్ డార్ఫ్ యొక్క కృషి బ్రిటిష్ వారికి ఆదివాసి ప్రాంతాల పరిపాలనలో మరియు వారితో సత్సంబంధాలు కొనసాగించడంలో ఉపయోగపడింది.
గోండులు తమను తాము కొయ్తుర్ అని పిలుస్తారు.కోయ్తుర్ అనగా యోధుడు అని అర్థం. గోండ్ లలో ప్రధానంగా రాజ్ గోండ్లు, పర్దాన్, తోటి, కొలాం,కోయ అనే ఉప తెగలు ఉంటాయి చతిస్గఢ్లో ప్రధానంగా మూడు రకాలు ఉన్నాయి 1) మరియగొండ్లు, (2) కొండమరియలు, (3) బిషోహర్ మరియులు,కోయలు ప్రస్తుతం చతిస్గడ్ లోని బస్తర్ ప్రాంతమే ఈ మూడు రకాల గోండ్లకు పుట్టినిల్లు. రాజ్ గోండ్లు మధ్యప్రదేశ్, చతిస్గడ్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో కూడా విపరీతంగా ఉన్నారు.
స్వాతంత్రం తర్వాత ఆదివాసుల పరిస్థితి...
స్వాతంత్రం తరువాత భారత ప్రభుత్వం 1960లో షెడ్యూల్ తెగల అభివృద్ధి గురించి దెబర్ కమిషన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ దేబర్ కమిషన్ అభివృద్ధికి సంబంధించి అధ్యయనం చేసి సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి నివేదిక తయారు చేసి 19961లో ప్రభుత్వానికి సమర్పించింది. తర్వాత 1994లో పంచాయతీ రాజ్ చట్టన్ని, షెడ్యూల్ ప్రాంతాలకు విస్తరణ కోసం, భూరియా కమిషన్ నీ 1994 లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ భురియా కమిషన్ 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో భూములు మరియు అటవీ వనరులపై అలాగే వారి సాంప్రదాయ ఆచారాలు మరియు సంస్కృతిని పరిరక్షించాలని ఇలా కొన్ని రకాల సిఫారసులను ప్రభుత్వానికి పంపింది. ఆ తర్వాత పంచాయతీ ఎక్స్టెన్షన్ షెడ్యూల్ ఏరియాస్ 1996 చట్టం రూపొందించబడింది. ఈ చట్టం 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసులకు కన్నతల్లి లాంటిది. పేసా చట్టం గ్రామసభకు అనేక అధికారాలు ఇస్తుంది, వాటి ద్వారా గ్రామాల్లో ఎవరు ఉండాలో నిర్ణయించే అధికారం కూడా ఉంటుంది. సెక్షన్ 4(d) గ్రామ సభకు వారి సంప్రదాయా లు, ఆచారాలు, సాంస్కృతి గుర్తింపు సామాజిక వనరులు మరియు వివాద పరిష్కార పద్ధతులను పరిరక్షించే అధికారాన్ని ఇస్తుంది. ఈ అధికారాన్ని ఉపయోగించి, గ్రామ సభ తమ గ్రామంలో బయట వ్యక్తుల ప్రవేశాన్ని నియంత్రించవచ్చు లేదా వారి అనుమతి తప్పనిసరి చేయవచ్చు. సెక్షన్ 4(i) ప్రకారం అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూమిని సేకరించే ముందు గ్రామ సభ లేదా పంచాయతీలతో సంప్రదించడం తప్పనిసరి.
తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, చత్తీస్గడ్, ఝూరండ్, ఒడిస్సా, రాష్ట్రాల 5వ షెడ్యూల్ ప్రాంతాలలో ఆదివాసులను, అభివృద్ధి పేరుతో వేలమంది ఆదివాసులను కాల్చి చంపుతున్న ప్రభుత్వం. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసి స్వయం పాలన కానీ, ప్రభుత్వ పాలన కానీ కొనసాగడం లేదు. సైనిక పరిపాలన కొనసాగుతుంది. కారణం దండకారణ్యంలో ఖనిజ సంపదను, సహజ వనరులను పెట్టుబడి దారులకు అప్పజెప్పడానికి, సైనిక బలగాలతో ఆదివాసులను మావోయిస్టులుగా చిత్రీకరిస్తుంది.
తరం తరం నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే ఉన్నాము. బీర్సా ముండా, రాణి దుర్గావతి,రామ్ జీ గోండ్, కొమురం భీం, సమ్మక్క సారక్క, బాబూరావ్ సేడ్మకి పోరాటాలు, వలస దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నాం పోరాటాలు మాకేం కొట్టకదు. స్వాతంత్రం తర్వాత కూడా ఈ దేశంలో హక్కుల కోసం పోరాటం చేయాల్సిన దౌర్భాగ్యమైన పరిస్థితి నెలకొంది. ఇది స్వతంత్రానికి పూర్వం, స్వతంత్ర అనం తరం కొనసాగుతూనే ఉంది. అందుకే ఆదివాసి ప్రాంతాలు రణక్షేత్రాలుగా మారాయి. దీని పర్యవసారంగా మేధావు లు, బుద్ధి జీవులు, ఆదివాసులు చేస్తున్న ఉద్యమాలకు మద్దతుగా నిలుస్తున్న వారి పై, సైనిక బలగాలు మరింత కటిన వైఖరితో అటు ఆదివాసులను ఇటు మేధావులను, బుద్ధి జీవుల పై నక్సలైట్,అర్బన్ నక్సలైట్ అంటూ పేర్లు పెట్టి అణచి వేస్తున్నారు గ్రీన్ హంట్, ఆపరేషన్ కగార్ పేరుతో వేల మంది ఆదివాసులను పొట్టన పెట్టు కుంటున్నారు. దండకారణ్యంలో అత్యాచారాలు జరగని ఆదివాసి కుటుంబం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ సామ్రాజ్యవాదులు, దండకారణ్యంలో ప్రవేశించి ఆదివాసులను అంతం చేసి విలువైన ఖనిజ సంపదను,
సహజ వనరులను, రాజ్యాంగ విరుద్ధంగా సొమ్ము చేసుకునేందుకు ప్రయత్ని స్తున్నారు. ఇదేమి తెలియని అమాయక ఆదివాసులు సైనిక బలగాల తుపాకీ తూటాలకు బలవుతున్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో పారా మిలటరీ బలగాల బూట్ల చెప్పుల కింద నలిగిపోతూ, వారి కామవంచకు బలవుతున్నారు. ఈ నేపథ్యంలో జల్, జంగల్, జమీన్ ఆదివాసులకే అని ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసులు ఉద్యమం చేస్తుంటే వారి యొక్క ఆవేదనలను అణిచివేయడానికి ఆదివాసులకు పై నక్సలైట్ ముద్ర వేసి, చెట్లకు కట్టేసి, వేలాడదీసి అత్యాచారా లు చేసి, వారి కామ వాంఛ తీర్చుకొని చంపి, నక్సలైట్లు ఎదురుపడి మాపై కాల్పులు జరిపారు. ఆత్మ రక్షణ కోసం మేము కాల్పులు జరిపాము. ఈ కాల్పుల్లో ఇంతమంది చనిపోయారని, కట్టు కథలు అల్లుతున్నారు. రెండు వైపులా కాల్పులు జరిగినప్పుడు, రెండు వైపులా నష్టం జరగాలి కదా ? ఈ ప్రభుత్వ బాషలో చెప్పాలంటే నక్సలైట్ అనబడుతున్న అదివాసులే ఎందుకు చనిపోతారు ? సాయుదా బలగాలకు కూడా గాయాలు కావడం కానీ, చనిపో వడం కానీ జరగాలి కదా ! సాయుద బలగాలకు ఏం కాదు ఎందుకంటే అక్కడ అమాయక అదివాసులను పట్టుకొని,చిత్ర హింసలు పెట్టి చంపి, నక్సలైట్ దుస్తులు వేసి, ఆయుదాలు, విప్లవ సాహిత్యం పెట్టి ప్రజలను భయాందోళనకు గురి చేస్తుంది ప్రభుత్వం. ఆదివాసి ప్రాంతాలు (ఏజెన్సీ)అనగానే మనకు గుర్తుకొచ్చేది, రాజ్యాంగంలోని ఆర్టికల్ 244, 5వ షెడ్యూల్ ప్రాంతాలు, ఆర్టికల్ 244 (1) షెడ్యూల్ ప్రాంతాల పరిపాలనకు సంబంధించిన అంశాలు సహజంగా మనకు గుర్తుకొ స్తాయి. ఏజెన్సీలో కేంద్ర ప్రభుత్వం, 5వ షెడ్యూల్‌లో పొందుపరిచినటు వంటి అంశాలను అమలు చేయకుండా, ఆర్టికల్ 246, 7వ షెడ్యూల్లో ఉన్నటువంటి అంశాలను, ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో అమలు చేస్తా ఉంది. అంతర్యుద్ధం చేయడానికి కేంద్ర ప్రభుత్వం సాయుధ దళాలను, రాష్ట్రాలకు పంపించి పారా మిలిటరీ సైన్యంతో పరిపాలన కొనసాగిస్తుంది.తప్ప ప్రజాస్వామ్య యుతంగా ప్రభుత్వ పాలన కొనసాగినట్లు ఎక్కడ కనిపించడం లేదు. ఒకవేళ నామమాత్రంగా అవి ఉన్న వాటి లక్ష్యం ఆదివాసి హక్కులను కాలరాయడమే. జీవించే హక్కు అనేది ప్రతి వ్యక్తికి పుట్టుకతో వచ్చే ప్రాథమిక మానవ హక్కు.చట్టం ద్వారా నిర్దేశించబడిన సరైన ప్రక్రియను అనుసరించకుండా ఎవరి ప్రాణాలను తీయకూడదు.
భారత రాజ్యాంగంలోని 21వ ఆర్టికల్ ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు ఉంది అని చెప్తుంది. ఈ ఆర్టికల్ ప్రకారం, చట్టం ద్వారా నిర్దేశించబడిన ప్రక్రియ ద్వారా తప్ప మరే విధంగానూ వ్యక్తి యొక్క జీవితాన్ని లేదా వ్యక్తిగత స్వేచ్ఛను హరించకూడదు. జీవించే హక్కు కేవలం శారీరకంగా జీవించడమే కాదు. గౌరవంగా జీవించే హక్కు, ఆరోగ్యంగా ఉండే హక్కు, విద్య పొందే హక్కు, స్వచ్ఛమైన నీరు మరియు గాలిని పొందే హక్కు మరియు జీవనోపాధి పొందే హక్కు వంటి అనేక ఇతర హక్కులను కూడా ఇది కలిగి ఉంటుంది. జీవించే హక్కు చాలా ముఖ్యమైనది ఎందుకంటే ఇది అన్ని ఇతర హక్కులకు ఆధారం. ఒక వ్యక్తి జీవించకపోతే, వారు ఇతర హక్కులను ఎలా అనుభవించగలరు? అందువల్ల, ప్రభుత్వం మరియు సమాజం ప్రతి ఒక్కరి జీవించే హక్కును రక్షించడానికి చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. జీవించే హక్కు అనేది ఒక ప్రాథమిక మానవ హక్కు.

**భారత ప్రభుత్వం రాజ్యాంగం లోని ఆర్టికల్ 75 (4) ప్రకారం...** రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత కలిగి ఉంటామని, భారతదేశ సార్వభౌమత్వం, సమగ్రతను కాపాడుతామని, ఎటువంటి భయం గాని, పక్షపాతంగాని, స్వార్థ చింతనగాని లేకుండా చట్టబద్ధముగా, రాజ్యాంగ బద్ధంగా ప్రజలందరికీ న్యాయం చేస్తానని అంతరా త్మ సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అని ప్రమాణం చేసినటువంటి పాలకులు, భారత రాజ్యాంగాన్ని, చట్టలని తుంగలో తొక్కి ఒక నిరంకుశమైన పరిపాలన కొనసా గిస్తా ఉంది. చట్టాలను చేసే అధికారం పార్లమెంట్కు ఉంటుంది. ఆ చట్టాల ను హక్కులను అమలు చేసేటటువంటి అధికారం ప్రభుత్వానికి, అధికారు లకు ఉంటుంది. చట్ట వ్యతిరేకులకు అరెస్ట్ చేసే అధికారం పోలీసులకు మాత్రమే ఉంటుంది. శిక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉంటుంది. ఈ నాలుగు విశేష అధికారా లు మాకు మాత్రమే అంటే పంచాయతీ ఎక్స్టెన్షన్ షెడ్యూల్ ఏరియాస్ యాక్ట్ ,1996 (పేసా) చట్టం కల్పించింది. ఇప్పుడు మధ్య భారతదేశంలో జరుగుతున్న పోరాటం కూడా ఇదే. ప్రపంచంలో ఎక్కడైనా ప్రజలు చట్టానికి, రాజ్యాంగానికి వ్యతిరేకంగా తిరగబడితే ఆశ్చర్యపోతారు?? దురదృష్టం ఏమిటంటే మన భారత దేశంలో భారత రాజ్యాంగం కల్పించినటువంటి హక్కులు ఆర్టికల్ 244,244 (1), ఆర్టికల్ 21, ఆదివాసి భూ అక్రమణ చట్టం,1959 (1/70), అటవీ హక్కుల చట్టం, 2006, PESA Act,1996 చట్టాలని అమలు చేయాలని పోరాటం చేస్తా ఉంటే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల పైన, ఉక్కు పాదం మోపి, రాజ్యాంగం కల్పించినటువంటి హక్కులను కాలరాస్తూ ఇక్కడ ప్రభుత్వమే ప్రజలకు వ్యతిరేకంగా, సాయుధ బలగాలని మధ్య భారత దేశంలో దింపి పోరాటం చేస్తాం ఉంది. నిరంకుశ రాజనీతి నీ అవలంబిస్తా ఉంది.
ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మధ్య భారత దేశంలో మోహరించినటువంటి సాయుధ బలగాలను వెనక్కి తీసుకొని, రాజ్యాంగం కల్పించినటువంటి ఆర్టికల్ 244, 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో, ఆర్టికల్ 244 (1) ప్రకారం పరిపాలన కొనసాగించాలి. పేసా చట్టం 1996 లో ఉన్నటువంటి స్వయం పరిపాలన అధికారం కల్పించాలి. అదేవిధంగా 2006 అటవి హక్కుల చట్టం, 1/70 చట్టాలను అమలు చేయలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వారికి జీవించనివ్వండి.

రచయిత
కుడ్మేత శ్రీనివాస్
9177166152

# కూకట్‌పల్లి జోన్‌లో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్

**హైదరాబాద్ సిటీ, మే 6 (జనంసాక్షి) :** వర్షాకాలం దగ్గర పడినందున భూసేకరణ లేని ప్రాంతంలో నాలా పనులు ప్రారంభించాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కూకట్ పల్లి జోన్ లోని మూసాపేట్, గాజులరామారం, కూకట్ పల్లి సర్కిళ్లలో జరగుతున్న పలు అభివృద్ధి పనులను కమీషనర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మూసాపేట్ మెట్రో స్టేషన్ వద్ద వాటర్ స్టాగ్నేషన్ పాయింట్ ను పరిశీలించారు. అదే విధంగా ఐడిపిఎల్ చెరువు సర్ ప్లస్ నాలా ఆర్టిసి డిపో వరకు గల ఎస్ ఎన్ డి పి నిధులతో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలించారు. భూసేకరణ వల్ల పనులు ప్రారంభించలేక పోవడం జరిగిందని అధికారులు వివరించడంతో వర్షాకాల దగ్గర పడుతున్న నేపథ్యంలో వరద నీరు వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను కోరారు. కైతలాపూర్ రోడ్డు వెడల్పు పనులకు సంబంధించిన పరిశీలన చేసి జాప్యానికి గల కారణాలను ఇంజనీర్ ను వివరణ కోరగా కోర్టు కేసు ఉన్న నేపథ్యంలో పనులు స్టార్ట్ కాలేదని చెప్పడంతో కౌంటర్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ విషయంలో జోనల్ కమీషనర్ ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అంబేద్కర్ నగర్ కోర్టు ప్రాంగణంలో లైనింగ్



ఏరియాలో వాటర్ స్టాగ్నేషన్ సమస్య పరిష్కారానికి 90 ఎంఎం డయా పైప్ లైన్ వేయుటకు ప్రతిపాదించడం జరిగిందని అధికారులు చెప్పడంతో ఎక్జిస్టింగ్ జలమండలి పైప్ లైన్ ఉన్నందున జలమండలి తోనే పనులు చేయించి వరద లేకుండా చర్యలు తీసుకోవాలి జలమండలి ఎండి సమన్వయంతో పూర్తి చేయాలని జోనల్ కమీషనర్ ను ఆదేశించారు. కైలాస వారం హిందూ గ్రేవ్ యార్డ్ నిర్వహణ ఆరా తీశారు. దాని పక్కనే ఉన్న అనిమల్ కేర్ సెంటర్ ను పరిశీలించారు. కుక్కల ఆపరేషన్ సెంటర్ గదిని పరిశీలించారు. కుక్కలను ఆపరేషన్ చేసిన తర్వాత ఆపరేషన్ చేసిన కుక్కలను గుర్తించడం ఎలా అని కమిషనర్ వివరణ కోరగా కుక్క చెవిని కట్ చేయడం జరుగుతుందన్నారు. జేఎన్‌టియుకు వెళ్లేందుకు ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్కడ నుండి టి యస్ ఐ ఐ (షాపూర్) లో మల్టీ పర్పస్ ఫంక్షన్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అన్నారు. బిల్డింగ్ ఏరియా, వివరాలను ఈఈ వివరించారు. గ్రౌండ్ ఫ్లోర్ కుకింగ్, డైనింగ్ హాల్, ఫస్ట్ ఫ్లోర్ సెకండ్ ఫ్లోర్ లు కూడా నిర్మాణాలు పూర్తి చేసినట్లు కమిషనర్ కు వివరించారు. డైనింగ్, కుకింగ్ గదిలో షాబాద్ బండలు వేయాలని సూచించారు. సూరారం వాటర్ స్టాగ్నేషన్ ని, గాజులరామారంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిశీలించారు. ఏ ఏ క్రీడలు నిర్వహిస్తారని కమీషనర్ అడిగారు. క్రికెట్, బ్యాడ్మింటన్ ఆటలకు అనుకూలంగా ప్లే గ్రౌండ్ ఉందని, వాలి బాల్ కోసం కూడా ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అర్బన్ ఫారెస్ట్ పార్కును సందర్శించారు. కమిషనర్ వెంట జోనల్ కమీషనర్ అపూర్వ్ చౌహన్, జోనల్ ఎస్ ఈ చిన్నా రెడ్డి, ఈఈలు రమేష్, శ్రీనాథ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ లు, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిబిరాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 6 (జనం సాక్షి) :** జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన వేసవి శిబిరాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిబిరానికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు.శిబిరంలో ఉపాధ్యాయులు ఏమేమి నేర్పిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చే విద్యార్థులకు యోగా తో పాటు ఆంగ్లం, గణితము, భౌతిక శాస్త్రంపై మంచి పట్టు వచ్చేలా తర్ఫీదు ఇవ్వాలని అక్కడి ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా తొమ్మిదో తరగతి ఉత్తీర్ణత సాధించి పదో తరగతికి వెళ్లే విద్యార్థులకు ఆయా సబ్జెక్టులలో సామర్థ్యాన్ని పెంచేలా ఇప్పటి నుంచే శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచాలన్నారు. శిబిరంలో రోజూ వారీగా ఏ ఏ అంశాలలో శిక్షణ ఇచ్చారనే విషయాలను రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. అలాగే ఈ 15 రోజుల పాటు క్రమం తప్పకుండా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆమె సూచించారు.

## ప్రజల ఇబ్బందులు తలెత్తకుండా సహాయక చర్యలు



**హైదరాబాద్ సిటీ, మే 6 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్‌లో సోమవారం రాత్రి కురిసిన వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టినట్లు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వి కర్ణన్ తెలిపారు. నగరంలో వాతావరణ శాఖ సూచన మేరకు గ్రేటర్ లో తేలికపాటి, వర్షం నమోదు కావడంతో రోడ్ల పై నీరు నిలిచే 141 వాటర్ లాగింగ్ పాయింట్‌ల వద్ద మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేసి క్లియర్ చేయించడం జరిగిందన్నారు. తెలంగాణ డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి వ్యాప్తంగా 155 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ లను ఏర్పాటుచేసింది. వాటి ఆధారంగా జిహెచ్ఎంసి లో సగటు వర్షపాతం 2.3 మీ నమోదు అయ్యింది. ప్రధానంగా సికింద్రాబాద్ జోన్ ముషీరాబాద్ సర్కిల్ జవహర్ నగర్ ఆర్టిసి క్రాస్ రోడ్డు, ముషీరాబాద్ సర్కిల్ నాయిని నర్సింహారెడ్డి స్టీల్ బ్రిడ్జి, ఎల్ బి నగర్ జోన్ ఉప్పల్ సర్కిల్ వరంగల్ హై వే రోడ్డు ఆదిత్య హాస్పిటల్, స్టేడియం వద్ద, చార్మినార్ జోన్ రాజేంద్రనగర్ సర్కిల్ పిల్లర్ నంబర్191 వద్ద ఈ ప్రాంతాల్లో నిలిచిన వరద నీరు వాహన దారులకు ట్రాఫిక్ జామ్ జరగకుండా వెనువెంటనే క్లియర్ చేశారాని కమిషనర్ పేర్కొన్నారు. కురిసిన వర్షానికి ఎలాంటి ఆస్తి ప్రాణ నష్టం జరగలేదన్నారు. గోడ ఇల్లు కూలిన సంఘటనలు, మానవ ప్రమాదాలు సంభవించలేదని కమిషనర్ వివరించారు.

# పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి

- ముఖ్యమంత్రి వ్యాఖ్యలు విచారకరం
- పిఆర్‌టియుటిఎస్ మెదక్ జిల్లా శాఖ

**మెదక్ జిల్లా బ్యూరో, మే 6 (జనం సాక్షి) :** ఉద్యోగ, ఉపాధ్యాయుల, విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని పి ఆర్ టి యు టి ఎస్ మెదక్ జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు సుంకరి కృష్ణ, సామ్య నాయక్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ 5 డి ఏ లను వెంటనే విడుదల చేయాలని, సిపిఎస్ విధానం రద్దు చేసి, ఒపీఎస్ విధానం అమల పరచాలని, జీవో నెంబర్ 317 బాధితులకు న్యాయం చేయాలని వారు పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి సోమవారం రోజు పత్రికా విలేకరుల సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకుల గురించి మాట్లాడుతూ వారు చేసిన వ్యాఖ్యలు సరికాదని వారు అన్నారు. సబ్ కమిటీ తో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో వెంటనే చర్చలు జరపాలని, నెలకు 500 కోట్లు ఉద్యోగ ఉపాధ్యాయుల, విశ్రాంత ఉపాధ్యాయులకు సంబదించి బకాయిలు కూడా విడుదల చేస్తామని ప్రకటించి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో సరి కాదన్నారు. రెండు సంవత్సరాల నుండి ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు కూడా విడుదల చేయకపోవడం ఉద్యోగ ,ఉపాధ్యాయ సంఘాల నాయకులు అడగడం తప్పా అని



వారు ప్రశ్నించారు. ఎన్నికల హామీల భాగంగానే స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన డీఏలను కూడా విడుదల చేయకపోవడాన్ని వారు తప్పు పట్టారు. వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయుల మరియు విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన సంబంధించిన పెండింగ్ బిల్లులు మరియు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు మంగళవారం మెదక్ లో ఒక ప్రకటనలలో తెలిపారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్.మల్లారెడ్డి, మెదక్ మండల మరియు మెదక్ పట్టణ, చిన్న శంకరంపేట, హవేలీ ఘనపూర్, పాపన్నపేట బాధ్యులు శిరేగే చంద్రశేఖర్, ఇమ్మడి సంతోష్ కుమార్ , వీరేశం , నరేందర్ రెడ్డి , ఎగొండ, హరిబాబు, పంతులు రాజు, సుభాష్ రెడ్డి , సురేష్, యాదవ రెడ్డి, మార్గం సిద్ధిరాములు పాల్గొన్నారు.

## ఉగ్రవాద ఏజెంట్లను గుర్తించి పాకిస్తాన్‌ను పంపాలి

- బీజేపీ నాయకుల వినతి



**శివ్వంపేట, మే 6 (జనంసాక్షి) :** పాకిస్తాన్ ఉగ్రవాదుల ఏజెంట్లను గుర్తించి వెంటనే వారిని వారి స్వదేశానికి పంపాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొండల్ రావు, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పెద్దపులి రవి లు అన్నారు. ఉగ్రవాద సంస్థలకు కొమ్ము కాస్తున్న వారిని గుర్తించి, వారిని వారి యొక్క సొంత దేశాలకు పంపించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో బిజెపి నాయకుల బృందం శివ్వంపేట తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ షఫీయోద్దీన్ కు, స్థానిక పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ వెంకట్ స్వామిలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకిస్తాన్ నుండి అక్రమంగా మన దేశానికి అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఏదో ఒక్క వృత్తిలో జీవనం సాగిస్తున్న పాకిస్తాన్ ఉగ్రవాదుల ఏజెంట్లు జిల్లాలో మండలంలో ఉంటే వారిని గుర్తించి, పాకిస్తాన్ కు పంపించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ర్యావ పన్నారెడ్డి, కాశ ఆంజనేయ చారి, బానోత్ గోప్యా నాయక్, ఎరుకల్ భిక్షపతి, మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్, మండల ఉపాధ్యక్షులు వినోద్, అశోక్ షాదుల్లా, వెంకట్ రెడ్డి, భజరంగీ అంజి, చరణ్, యువమోర్చా అధ్యక్షులు భాస్కర్, ఎస్టి మోర్చా అధ్యక్షులు భాస్కర్ నాయక్, నాయకులు సుధాకర్, కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమానికి జిల్లా కార్మిక శాఖ కృషి

**కాప్రా, మే 6 (జనం సాక్షి) :** కార్మికుల సంక్షేమానికి జిల్లా కార్మిక శాఖ కృషి చేస్తుందని మేడ్చల్ జిల్లా కార్మిక శాఖ అధికారి సాయి సుమన్ పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి లో దుర్గామాత భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చదివేంద్రమును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నమని ఆయన తెలిపారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులకు సౌకర్యాలు కల్పించడంతోపాటు వారి సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం దుర్గామాత భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు



వెంకటయ్య, మందుల మల్లేష్ కార్మిక శాఖ అధికారి సాయి సుమన్ను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సత్తయ్య, అంజయ్య, మల్లేష్, కృష్ణ, తూర్పాటి స్వామి, యాకయ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపాలి



**తాండూరు, మే 6 (జనంసాక్షి) :** సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం తాండూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా నిరాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం రైల్వే రవాణా సౌకర్యాన్ని ప్రైవేటీకరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికి కుట్రలు చేస్తున్నారు. భారతీయ రైల్వే ప్రైవేట్ కరణను వెంటనే ఆపాలని రైల్వే విస్తరణ మరియు భద్రత కోసం అవసరాల నిధులు కేటాయించాలన్నారు.రైళ్లలో సౌకర్యాలు మెరుగుపరచాలని, ప్యాసింజర్ రైళ్లను పెంచాలని, ఎక్స్ప్రెస్ రైళ్లలో స్లీపర్ క్లాసులు మరియు జనరల్ కంపార్ట్మెంట్లని పెంచాలని, రైల్వే ప్రయాణికులకు కోసం ప్రభుత్వం భద్రత పెంచాలని, రైల్వే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, రైల్వే ఉద్యోగులకు సురక్షితమైన పరిస్థితులు కల్పించాలని, రైల్వే కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ మైనారిటీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు కే చంద్రయ్య, సిఐటియు నాయకులు సురేష్ ,మానెప్ప ,సంజీవ్, అంజయ్య ,ధనియాలు ,బాలస్వామి, ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన ధాన్యం తరలించాలి

- డిఆర్ఓ ఇన్చార్జి అదనపు కలెక్టర్ భుజంగరావు



**మెదక్ జిల్లా బ్యూరో, మే 6 (జనం సాక్షి) :** కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని ఇంచార్జ్ అదనపు కలెక్టర్ భుజంగరావు తెలిపారు. జిల్లాలోని చేగుంట మండలంలో ప్యాక్స్, ఐకెపి కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఇన్చార్జి అదనపు కలెక్టర్ భుజంగరావు పరిశీలించారు. ధాన్యాన్ని, రీజిస్టర్లు పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. త్వరితగతిన కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని . లారీల కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. రైస్ మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దించుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు సమర్థ నిర్వహణకు తగు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీకాంత్, సంబంధిత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**తూప్రాన్, మే 6 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ధాన్యం సేకరణలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సెంటర్లో నిర్వాహకులను ఆదేశించారు. మనోహరబాద్ మండల పరిధిలోని దండుపల్లి లో పాక్స్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మిక పర్యటన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణ తొందరగా సేకరించి రైస్ మిల్లులకి వెంట వెంటనే తరలించాలన్నారు. తేమ శాతం పరిశీలించి వడ్లను మిల్లులకు పంపాలని తెలిపారు.చుట్టూ ప్రక్కల ఎన్ని గ్రామాల నుంచి ధాన్యం వస్తుంది ఎంత మంది రైతులకు ఈ కేంద్రం ద్వారా ధాన్యం సేకరణ జరుగుతుంది



అని తెలుసుకున్నారు. అనంతరం రైతులను ఇబ్బందులు ఏమన్నా ఉన్నాయా అని పలకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జయ చంద్ర రెడ్డి పాక్స్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి బక్క రమేష్,తహసిల్దార్ చంద్ర శేఖర్ రెడ్డి ఆర్ఐ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హత మేరకే ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ జరగాలి

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన మేనేజింగ్ డైరెక్టర్ హౌసింగ్ వి.పి గౌతమ్

**కొడంగల్, మే 6 (జనం సాక్షి) :** కొడంగల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల వెరిఫికేషన్ అర్హత మేరకే చేపట్టడం జరిగిందని మేనేజింగ్ డైరెక్టర్, హౌసింగ్ వి.పి గౌతమ్ అన్నారు. మంగళవారం కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించారు. ప్రతిష్టత్మాకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మేనేజింగ్



డైరెక్టర్ హౌసింగ్ వి. పి గౌతమ్ పరిశీలించారు. మంగళవారం కొడంగల్ నియోజకవర్గం మున్సిపల్ పరిది లో మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మాణం జరిగుతున్న మోడల్ ఇందిరమ్మ ఇంటీ నిర్మాణ పనులను పరిశీలించారు.ఇందిరమ్మ కమిటీలచే ప్రతిపాదించిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు దారుల వెరిఫికేషన్ పూర్తి అయిన వాటికీ నిర్మాణ పనులు పూర్తి చేయాలనీ, అర్హత మేరకే ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ జరగాల ఈ సందర్భంగా అయన లబ్ధిదారులతో మాట్లాడుతూ అదేవిదంగా హుసేన్ పూర్ గ్రామంలో మరియు దుద్యాల మండలం సంఘాయి పల్లి గ్రామంలో మొదటి విడత లో మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ పర్యటనలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, కడ స్పెషల్ అధికారి వెంకట్ రెడ్డి, పిడి హౌసింగ్ కృష్ణయ్య,తహసీల్దార్ విజయకుమార్, మున్సిపల్ కమీషనర్ బలరాం నాయక్, డిప్యుటీ ఈఈ చందర్ నాయక్, ఎంపిడిఓ లు ఉషా శ్రీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటికి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలి జిల్లా కలెక్టర్

- ఇందిరమ్మ గృహాల సర్వే పారదర్శకంగా నిర్వహించాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**చిలప్‌చేడ్, మే 6 (జనంసాక్షి) :** జిల్లాలో వేసవి కాలంలో త్రాగు నీరు ఇబ్బందులు రాకుండా అధికారులు సమన్వయంతో పని చేస్తూ సమృద్ధిగా త్రాగు నీటి సరఫరా చేయాలనీ అలాగే ఇందిరమ్మ గృహాల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారుల ఆదేశించారు. మంగళవారం నాడు చిలప్ చేడ్ మండలంలోని చిట్కుల్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు సర్వే అలాగే గ్రామాలలో మంచినీటి ఎద్దడి సంబంధిత వాటిని క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ముందుగా ఇందిరమ్మ గృహ సర్వేపై లబ్ధిదారులతో స్వయంగా కలెక్టర్ మాట్లాడారు నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకు



పోతున్నామన్నారు.వేసవికాలంలో మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరాపై గ్రామస్తులతో కలెక్టర్ మాట్లాడారు. వేసవికాలంలో త్రాగునీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు మిషన్ భగీరథ అధికారులు మండల పరిషత్ జిల్లా పరిషత్ పంచాయతీ అధికారులు సమన్వయంతో పని చేసి త్రాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. త్రాగు నీటి సరఫరా కోసం సమృద్ధిగా నీరు అందుబాటులో ఉన్నందున మిషన్ భగీరథ ద్వారానే ఇంటింటికి త్రాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంచాలకులు సూచించారు. మిషన్ భగీరథలో అందుబాటులో ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్లు, ఇతర సాంకేతిక సిబ్బంది షిఫ్టుల వారిగా 24 గంటలు పని చేస్తూ డిమాండ్ మేరకు అవసరమైన నీరు గ్రామీణ ప్రాంతాలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాలలో ప్రతి ఇంటికి ప్రణాళిక బద్ధంగా నీటి సరఫరా చేయాలని, నీటి సరఫరాలో ఎదురయ్యే చిన్న చిన్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆనంద్, పంచాయతీ సెక్రటరీలు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సదస్సులతో భూ సమస్యలపైన అవగాహన

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**చిలప్‌చేడ్, మే 6 (జనంసాక్షి) :** భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. భూభారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పైలెట్ ప్రాజెక్టుగా చిలప్ చేడ్ మండలం ఎంపికైన విషయం విధితమే మంగళవారం నాడు చిలప్ చేడ్ మండలం బండపోతుగల్ గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణ తీరును ఆర్డీవో మైపాల్ రెడ్డి, తాసిల్దార్ తో కలిసి కలెక్టర్ రాహుల్ రాజ్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి చట్టం అమలులో భాగంగా భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు సమర్పించాలన్నారు. గతంలో ప్రజలు తహసీల్దార్, ఆర్డీఓ లేదా కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు అధికారులు స్వయంగా గ్రామాలకే వచ్చి ప్రజల సమస్యలను స్వీకరిస్తున్నారని తెలిపారు. ఈ సదస్సుల ద్వారా రెవిన్యూ అధికారులకు క్షేత్ర స్థాయిలో ఎవరెవరికి ఎలాంటి భూ సమస్య లు ఉన్నాయో అవగాహన వస్తుందన్నారు అధికారులు దరఖాస్తులను పరిశీలించి,వేరిఫికేషన్ ద్వారా అర్హతను నిర్ధారించిన తర్వాత వారికి సంబంధిత ఉత్తర్వులు జారీ చేస్తారని తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు పూర్తిగా ఉచితంగా స్వీకరించబడతాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ఉదయం 9 :00 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు అధికారులు గ్రామంలోనే అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అందరూ దరఖాస్తు ఫారమ్‌ను సమర్పించాలన్నారు. ఫారమ్ నింపడంలో ఎలాంటి సందేహాలు ఉంటే,సహాయం కోసం ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో భూ భారతి చట్టం గురించి అవగాహన కల్పించామని గుర్తు చేశారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు,విస్తీర్ణం హెచ్చు తగ్గులు,వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి భూభారతి కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. పైలెట్ మండలంలోని రెవెన్యూ గ్రామాలలో సదస్సులు పూర్తయ్యాక, జిల్లాలోని మిగతా అన్ని మండలాలలో జూన్ మొదటి వారంలో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మాలో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మైపాల్ రెడ్డి, తాసిల్దార్ సహదేవ్,డిప్యూటీ తాసిల్దార్ సింధుజ, ఆర్ఐ సునీల్,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవి శిబిరాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 6 (జనం సాక్షి) :** జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన వేసవి శిబిరాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.
శిబిరానికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. శిబిరంలో ఉపాధ్యాయులు ఏమేమి నేర్పిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చే విద్యార్థులకు యోగా తో పాటు ఆంగ్లం, గణితము, భౌతిక శాస్త్రంపై మంచి పట్టు వచ్చేలా తర్ఫీదు ఇవ్వాలని అక్కడి ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా తొమ్మిదో తరగతి ఉత్తీర్ణత సాధించి పదో తరగతికి వెళ్లే విద్యార్థులకు ఆయా సబ్జెక్టులలో సామర్థ్యాన్ని పెంచేలా ఇప్పటి నుంచే శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచాలన్నారు. శిబిరంలో రోజూ వారీగా ఏఏ అంశాలలో శిక్షణ ఇచ్చారనే విషయాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే ఈ 15 రోజుల పాటు క్రమం తప్పకుండా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆమె సూచించారు.

# పరువుపోయిందని పెళ్లి కొడుకు తండ్రి ఆత్మహత్య

- పెళ్లి జరగాల్సిన ఇంట్లో విషాదం



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, మే 6 (జనం సాక్షి) :** రెండు రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉండగా పెళ్లి కూతురు ప్రియుడితో వెళ్లి పోవడంతో తమ పరువు పోయిందనీ మదన చెంది పెళ్లి కొడుకు తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కాంజి గోవిందరావు కుమారుడు అభిషేక్ కు జ్ఞాని విజయ్ కుమార్ కూతురు శ్వేత తో పెళ్ళి నిశ్చయం అయింది. 4 నెలల క్రితం అంగరంగ వైభవంగా ఎంగేజ్ మెంట్ కార్యక్రమం జరిపారు. ఈ నెల 9న పెళ్లి ముహూర్తం నిశ్చయించి పెళ్లి పత్రికలు ముద్రించి బంధు మిత్రులకు పంచిపెట్టి పెళ్లికి ఆహ్వానించారు. అంతేకాకుండా పెళ్లి ఏర్పాట్లు లక్షలు ఖర్చు చేసి పూర్తి చేశారు. అయితే మంగళవారం పెళ్లి కుమారుడిని చేయాల్సి ఉండగా ఆదివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో పెళ్లి కూతురు ప్రియుడు వెంకటేష్ తో వెళ్లి పోయింది. దాంతో తన కొడుకు పెళ్లి ఆగిపోవడంతో పాటు తమ పరువు పోయిందనీ మదనపడి పెళ్లి కొడుకు తండ్రి కాంజీ గోవిందరావు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే పెళ్లి కూతురు ఇంట్లో కూతురి ప్రేమ వ్యవహారం తెలిసిన కప్పిపుచ్చి పెళ్లికి సిద్ధమై పరువు తీశారని దాంతో గోవిందరావు ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా పెళ్లి కూతురిని మామ వరుసకు చెందిన షోలాపూర్ కిషోర్,సంజీవ్ మరికొందరు ఆదివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో కేంచి గోపాల్ ఇంటి దగ్గరకు ప్రేమికులు ఇద్దరినీ కారులో ఎక్కించి పంపారని సి సి పుతేజీలను సైతం పోలీసులకు అప్పగించామని తెలిపారు. తన తమ్ముడు చావుకు కారణమైన వారిపై చర్య తీసుకోవాలని మృతుని సోదరుడు కాన్జి నారాయణ రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బీపీఎం చేతివాటం


- లక్షల్లో పొదుపు డబ్బులు స్వాహా
- అయోమయంలో ఖాతాదారులు
- విచారణ సాగదిస్తున్న అధికారులు



**మాగనూర్, మే 6 (జనం సాక్షి) :** మా గనూర్ మండల కేంద్రంలోని పోస్టాఫీసు లో పెద్ద అవినీతి బాగోతం బయటపడింది. బిపిఎం ధనుంజయ చేతి వాటంతో ఖాతాదారులు పొదుపు చేసిన లక్షల రూపాయలు మాయమయ్యాయి. ఈ ఏడాది జనవరిలో అవినీతి జరిగిందని బి పి ఎం నుంచి ఖాతా బుక్కులను జిల్లా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే విచారణ నత్తనడకన సాగుతోందనీ మంగళవారం విచారణకు వచ్చిన జిల్లా అధికారులు ప్రత్యూష, ఉమాకాంత్ ముందు ఖాతాదారులు వాకిటి శ్రీనివాస్ మాజీ సర్పంచ్ రాజు బొంబాయి మురళి వార్త వెంకటయ్య కురవ లక్ష్మీనారాయణ ఆంజనేయులు గౌడ్ లు ఆందోళనకు దిగారు. ఈ పోస్టాఫీసు లో మొత్తం760 ఖాతాలు ఉన్నాయి. అందులో ఎస్ బి ఖాతాలు36,ఆర్ డి ఖాతాలు 552,సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు 172 ఉన్నాయి. వీరంతా కొన్ని ఏళ్లుగా పొదుపు చేస్తూ వస్తున్నారు. సుకన్య సమృద్ధి యోజన ఖాతాల్లో 57 ఖాతాల్లో తేడాగా ఉన్నాయి. బుక్కుల్లో మాత్రం స్టాంపు వేసి జమ చేసినట్లుగా ఉండగా అధికారికంగా జమ కాలేదు. ఖాతా బుక్కులు స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి ఖాతా దారులు పొదుపు చేయడం లేదు. దాంతో ఖాతాదారులు ఆపతకం ప్రయోజనం అందుతుందాలేదా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచారణ వెంటనే పూర్తి చేసి తాము చేసిన పొదుపు పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. అందుకు స్పందించిన అధికారులు సుకన్య సమృద్ధి యోజన పథకం యదావిధిగా కొనసాగుతుందని 20 రోజుల్లో విచారణ పూర్తి చేసి బిపిఎం స్వాహా చేసిన డబ్బులు ఖాతాల్లో జమ చేయిస్తానని అధికారులు హామీ ఇచ్చారు.

## న్యాల్‌కల్ ఆయుర్వేద వైద్యాధికారికి పీహెచ్‌డీ పురస్కారం

- గవర్నర్, ఆరోగ్య మంత్రి చేతుల మీదుగా అందుకున్న డాక్టర్ గణపతి రావ్




**న్యాల్‌కల్, మే 6 (జనం సాక్షి) :** "భగంధర వ్యాధిలో పలాశ క్షార సూత్ర చికిత్స" పరిశోధనలో మెరుగైన ఫలితాలను సాధించడం పట్ల ఆయుర్వేద వైద్యాధికారి పీహెచ్డీ డాక్టరేట్ పట్టాను పొందారు. సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో.. "ఆయుర్వేద వైద్యాధికారిగా" విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఇటికాల గణపతి రావ్ పురస్కారాన్ని అందుకున్నాడు. మంగళవారం కర్ణాటక రాష్ట్రం, బెంగళూరు.. "రాజీవ్ గాంధీ ఆరోగ్య విశ్వవిద్యాలయం" 27వ వార్షిక ఘటకోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ థవర్చంద్ గెహలాట్, గౌరవ అతిథిగా రాష్ట్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ శరణ్ ప్రకాష్ పాటిల్, పలువురు ప్రముఖులు, ఆయుర్వేద శాస్త్రవేత్తల చేతుల మీదుగా పీహెచ్ డి డాక్టరేట్ పట్టాను అందుకున్నాడు. నారాయణఖేడ్ మండలం, అబ్బెంద గ్రామానికి చెందిన ఆయుర్వేద డాక్టర్ గణపతి రావ్.. బీదర్ లోని ఓ ఆయుర్వేద కళాశాలలో బీఏఎంఎస్, ఎమ్మెస్ ఆయుర్వేదం, పీహెచ్డీ విద్య నభ్యసించారు. అనంతరం న్యాల్ కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుర్వేద వైద్యాధికారిగా తొలిమారు విధుల్లో చేరారు. స్థానిక ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ గణపతి రావ్ కు పీహెచ్డీ డాక్టరేట్ అందుకోవడం పట్ల స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు సంతోషం వ్యక్తం చేశారు.

## పడాలపల్లి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించండి



**తూప్రాన్, మే 6 (జనం సాక్షి) :** తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు పడాలపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డికి 11వ వార్డు కౌన్సిలర్ మాజీ సర్పంచ్ బొంది వెంకట్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. గతంలో తాగునీరు గ్రామానికి రోజు రెండు పూటలా నీరు వచ్చేదని ప్రస్తుతం ఒక పూట మాత్రమే వస్తుందని అతి తక్కువ నీరు రావడంతో గ్రామస్తులు తీవ్ర నీటి సమస్య ఎదుర్కొంటున్నారని అన్నారు. ఊర చెరువు దగ్గర ఉన్న బోరుబావికి బోరు మోటార్ ను ఏర్పాటు చేసి ఎస్సీ కాలనీకి లోని వాటర్ ట్యాంకు నింప నింపాలని, ఎల్లమ్మ చెరువు వద్ద బోరుబావిలో లో మోటర్ ఏర్పాటుచేసి వాటర్ ట్యాంక్ నింపాలని, గాంధీ విగ్రహం వద్ద గల బోరు మోటర్ నుండి కొత్త రూముల వైపు పైప్ లైన్ వేయాలని ఎల్లమ్మ గుడి వరకు వేయాలని కోరారు. ఆయన తెలిపిన సమస్యలపై మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి వివరిస్తూ అతి త్వరలో పడాలపల్లి గ్రామంలో తాగునీటి సమస్యలు పరిష్కరిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

## నష్టపరిహారం అందజేయాలని కలెక్టర్‌కు వినతి



**రేవల్లి, మే 6 (జనంసాక్షి) :** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం ఏదుల రిజర్వాయర్‌లో భాగంగా బండరాయిపాకుల గ్రామంలోని ఇండ్లు, వేల ఎకరాల కొద్ది భూములు, గ్రామాన్ని కోల్పోయామని భూ నిర్వాసితులు మంగళవారం వనపర్తి జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ముంపు బాధితులకు కోసం ఆర్అండ్ఆర్ సెంటర్ లలో పునరావాసం కల్పించారు. పూర్తిస్థాయిలో 500 మందికి ఇంకా భూమి, ఇండ్ల డబ్బులు, ప్లాట్లు కేటాయించలేదని ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదు చేసిన, నేటి వరకు స్పందించలేదని బాధితులు తీవ్ర ఆవేద వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన వారికి పునరవాసంలో ఇండ్ల ప్లాట్లు కేటాయించి, భూమి డబ్బులు అందేలా ముంపు గ్రామస్తులు కోరుతున్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి




**చారకొండ, మే 6 (జనంసాక్షి) :** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చారకొండ ఎస్సై శంషుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్ పై మంగళవారం ఎస్సై శంషుద్దీన్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శంషుద్దీన్ మాట్లాడుతూ గ్రామాలలో రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని , వాటిపై అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పకూడదన్నారు. మొబైల్ యాప్ ద్వారా ఎలాంటి లోన్స్ తీసుకోకూడదన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేష్ నాయక్, మాజీ ఎంపిటిసి నరసింహారెడ్డి, ఏఎస్ఐ అంజయ్య , హెడ్ కానిస్టేబుల్ తిరుమల్ రావు, పీసీలు శేఖర్ , ప్రశాంత్ , నాయకులు జెసిబి వెంకటయ్య గౌడ్ , జరుపటి కొండల్, ఏసారపు అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తరుగుపేరిట దోపిడీని అరికట్టాలి

- క్వింటాల్ కు 2.5కిలోల తరుగుతో రైతుకు అన్యాయం



**మల్దకల్, మే 6 (జనంసాక్షి) :** తరుగు పేరిట దోపిడిని అరికట్టాలని,కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ ఉంచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేపట్టి రైతుకి మేలు చేయాలని మంగళవారం మల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామంలో పీఏసీఎస్ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా గొంగళ్ళ రంజిత్ కుమార్ మాట్లాడుతూ వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద తరుగు పేరిట 40 కేజీల బస్తాకు 600 గ్రాముల గన్నీ బ్యాగుల తరుగు తీయ్యాల్సి ఉండగా, కిలోన్నర వరకు తరుగు పేరిట దోపిడీ చేయడం అన్యాయమని,ఈ దోపిడీని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. క్వింటాల్ ధాన్యానికి హమాలి చార్జీలు వసూలు చేస్తూన్నారని,ఈ చార్జీలు రైతులపై వేయకుండా పూర్తి మొత్తానికి ప్రభుత్వమే పూర్తిగా భరించాలని తెలిపారు. ధాన్యం అమ్మిన తర్వాత ధాన్యం డబ్బులతో పాటు బోనస్ కూడా కలిపి ఇవ్వాలని కోరారు. రైతులకు వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,వారికి కావాల్సిన తాగునీరు,టెంట్లు మరియు ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు తమ పంటను వడ్ల కొనుగోలు కేంద్రం దగ్గర 20 రోజుల పాటు ఉంచిన కుడా ధాన్యాన్ని కొనకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, తేమశాతం 17 ఉంటే వడ్లను కొనాలని ప్రభుత్వము ఒకవైపు చెబుతున్న మరోవైపు దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని రైతులు కొనుగోలు కేంద్రం వద్ద నిద్రాహారాలు మాని, పడిగాపులు కాస్తూ,పందుల బెడదతో అనేక రకాలుగా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, నాయకులు శ్రీనివాస్ యాదవ్,ప్రేమ్,రాజ్ తిమ్మప్ప,లక్ష్మన్న,గోపాల్,చిన్న రాముడు, ఆశన్న, కృష్ణ,బలిజ రాజు,నాగేష్,రమేష్,భూపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా..

- పార్టీ బీమా చెక్కు అందజేసిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**రేవల్లి, మే 6 (జనంసాక్షి) :** గోపాలపేట మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన కార్యకర్త అడ్డాకుల రవీందర్ ఇటీవల ప్రమాదానికి గురై మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వారి కుటుంబానికి మాట ఇచ్చిన ప్రకారం పార్టీ భీమా చెక్ రవీందర్ సతమణి అడ్డాకుల అంజలికి తాడిపర్తిలోని వారి ఇంటికి వెళ్లి అందించి మనోధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ నాయకులకు, కార్యకర్తలకు ఆపద వస్తే అండగా ఉంటానని, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యకర్తల సంక్షేమం కోసం కేసీఆర్ జీవిత భీమా కల్పించారని, గతములో రైతు భీమా ద్వారా మరణించిన రైతు కుటుంబాలకు 5 రోజులలో 5 లక్షల రూపాయలు అందించిన ఘనత, కళ్యాణ లక్ష్మితో పేదింటి ఆడపిల్లలకు అందించిన ఘనత కేసీఆర్ కిట్టు ద్వారా బాలింతలకు 13000 /- అందించిన ఘనత ఈ దేశ చరిత్రలో కేసీఆర్ ది అని కొనియాడారు. అన్నింటి కంటే పేద కార్యకర్తలకు ప్రమాదం జరిగి చనిపోతే 2 లక్షల భీమా ఇచ్చి కేసీఆర్ ఆదుకున్నారని అన్నారు. నియోజకవర్గంలో నాయకులకు, కార్యకర్తలకు ప్రజలకు 24 గంటలు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ ఎంపీపి సంధ్య తిరుపతయ్య, పెబ్బేరు మాజీ జడ్పీటీసీ వెంకటేష్ , మణ్యం నాయక్, చంద్రశేఖర్, కృష్ణయ్య, శంకరయ్య, మోహన్, రాములు, వెంకటేష్ ,రమేష్, చిట్యాల రాము, నాగరాజు, శివ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల పహారా మధ్య రహదారి కొలతలు



ఆర్డీవోతో వాగ్వివాదనికి దిగుతున్న దుకాణ యజమాని

ఆలయం ముందు నిరసన తెలుపుతున్న దుకాణదారులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 6 (జనంసాక్షి) :**

వేములవాడ మూలవాగు నుండి రాజన్న ఆలయం వరకు రహదారి విస్తరణ కోసం అధికారులు పలుమార్లు కొలతలు వేశారు. రహదారి విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న కొంత మంది యజమానులు కోర్టుకు వెళ్లి స్టే తీసుకొని వచ్చారు. మాకు కోర్ట్ నుండి స్టే ఆర్డర్ ఉందని మా ఇల్లు కొలువవద్దని అధికారులతో వాగ్వాదానికి దిగడంతో పోలీస్ పహార మధ్య కొలతలు నిర్వహించారు. కోర్టు స్టేలో నాలుగింటికి మాత్రమే స్టే ఆర్డర్ ఉందని మిగతా వాటిని కచ్చితంగా కొలుస్తామని ఆర్డిఓ రాధాబాయి ఆధ్వర్యంలో పోలీస్ పహార మధ్య కొలతలు నిర్వహించారు. ఈ విషయంపై దుకాణ యజమా నులకు అధికారులకు కొంతమేర వాగ్వాదం జరిగింది వెంటనే దుకాణ యజమానులు తమ దుకాణాలకు స్వచ్ఛం దంగా మూసివేసి రాజన్న ఆలయం ముందు నిరసన తెలిపారు.

**15 రోజుల్లోగా పరిహారం చెల్లిస్తాం : ఆర్డీవో రాధాబాయ్**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రధాన ద్వారం నుంచి తిప్పాపూర్ మూలవాగు వంతెన వరకు ప్రధాన రహదారి వెడల్పు లో భాగంగా అధికారులు మంగళవారం సర్వే చేపట్టామన్నారు .సర్వేను పనితీరును జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జా పరిశీలించారన్నారు. 80 ఫీట్లు రహదారి వెడల్పులో భాగంగా 350 కట్టడాలు ముంపునకు గురవుతా యన్నారు. ఇల్లు కోల్పోతున్న వారికోసం ప్రభుత్వం ఇప్పటికే సుమారు రూ 47 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారూ. 15 రోజుల్లో గా ఇల్లు కోల్పోతున్న వారం దరికీ ప్రభుత్వం ద్వారా పరిహారం అందుతుందని ఆమె తెలిపారు. రహదారి వెడల్పులో నాలుగు ఇండ్లకు మాత్రమే స్టే ఆర్డర్ ఉందని మిగతావారికి ఎలాంటి స్టే లేదని అలాంటి పుకార్లను నమ్మొద్ద న్నారు .రహదారి వెడల్పు కోసం ప్రజలు సహకరిం చాల న్నారు. ఈ రహదారి వెడల్పు కార్యక్ర మంలో వేములవాడ ఇన్చార్జి తహసిల్దార్ పుష్పలత, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.



# పాలాభిషేకాలు పనులు ఆలస్యమైనందుకా?



మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**మల్హర్, మే 06(జనంసాక్షి)**

భూపాలపల్లి జిల్లా మలహార్ రావు మండల కేంద్రం నుంచి అటవీ ప్రాంతం ద్వారా జిల్లా కేంద్రానికి రహదారి పనులు పూర్తి చేయడంలో ఆలస్యం చేస్తున్నందుకే మంత్రి పాలాభిషేకాలు చేయించుకుంటున్నాడా అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. మల్హర్ మండలం కిషన్‌రావుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మల్హర్ మండల ప్రజల చిరకాల స్వప్నం ఖమ్మంపల్లి బ్రిడ్జి నిర్మాణం చేసి మండల ప్రజలకు దూరభారం తగ్గించేలా రహదారుల సౌకర్యాలు కల్పించామన్నారు. కోల్ కారిడార్‌గా పేరున్న భూపాలపల్లికి నిత్యం మంథని నుంచి రాకపోకలు సాగుతున్న క్రమంలో ఖమ్మపల్లి, తాడిచర్ల, కిషన్‌రావుపల్లి మీదుగా భూపాలపల్లికి చేరేలా నిధులు మంజూరీ చేసి రహదారి నిర్మించామని, అయితే కిషన్‌రావుపల్లి నుంచి భూపాలపల్లి వరకు మధ్యలో ఫారెస్ట్ క్లియరెన్స్ రాక పనులు ఆగిపోయాయని తెలిపారు. అటు తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, మంథని ఎమ్మెల్యే మంత్రిగా అయినా ఇప్పటి వరకు ఈ రహదారిని పూర్తి చేయలేదన్నారు. సాధారణ ఎమ్మెల్యేలా కాకుండా మంత్రిగా ఉండి రోడ్డును పూర్తి చేయడంలో 16నెలలు గడిచిపోయా యని ఆయన విమర్శించారు. రెండు మాసాల క్రితం ఒక జీవో తీసుకువచ్చి నాలుగు కోట్ల రూపాయలు మంజూరీ చేశారని,

దీంతో ఆ పార్టీశ్రేణులు మంత్రికి పాలాభిషేకాలు చేయడంతో పాటు ప్రతిపక్షపార్టీకి చెంపపెట్టు అంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రిగా ఫారెస్ట్ క్లియరెన్స్‌కు రెండు నెలలు పట్టినందుకు సిగ్గుపడాలే కానీ ప్రతిపక్షపార్టీలను ఎగతాలి చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు.

ఒక్క మాటతో ఫారెస్ట్ క్లియరెన్స్ తీసుకువచ్చి పనులు పూర్తి చేయాల్సి ఉండగా అలా చేయకుండా ఈ ప్రాంత ప్రజలను చులకనగా చూస్తున్నాడని

ఆయన అన్నారు. ఇప్పటికైనా కిషన్‌రావుపల్లిలాంటి గ్రామాల ప్రజలు ఆలోచన చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ జెడ్పిటిసి గోనే శ్రీనివాసరావు, జాగరి హరీష్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర ఆటో దొంగల ముఠా అరెస్ట్

**27 లక్షల విలువ చేసే 27 ఆటోలు**

**5 సెల్ ఫోన్లు స్వాధీనం**

**ఆదిలాబాద్ ప్రతినిది (జనంసాక్షి) :**



అంతరాష్ట్ర దొంగల ముఠాను మంగళవారం జిల్లా కేంద్రంలో అరెస్టు చేసి అనంతరం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీమాట్లా డుతూ ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్ వంతెన వద్ద వాహన తనిఖీలు నిర్వహించి సమయంలో నిందితుడు ఏ3 షారుక్ పఠాన్ ఆదిలాబాద్ దొంగలించిన ఆటో (టీఎస్ 01 యూఏ 0832) తో అనుమానస్పదంగా పట్టుబడ్డా డని అతనిని విచారించగా ఏడుగురు ముఠా సభ్యులు అందరూ కలిసి హైదరాబాద్ ఆదిలాబాద్ ఆటోలను దొంగలించి వాటి వాహన నంబర్లు ఇంజన్ నంబర్లు చేసిన నంబర్లు మార్చి వాటి స్థానంలో కొత్త నఖిలీ నంబర్లు ముద్రించి అమ్మడానికి సిద్ధంగా ఉన్న సమయంలో జిల్లా పోలీసులు వారిని పట్టుకొని కేసును చేదించారని తెలిపారు. ఏ3 షారుక్ప ఠాన్ ను విచారించిన సందర్భ ంలో నిందితుడు ఏ4 అల్తాఫ్ ఖాన్ వద్దకు తీసుకువెళ్లగా అక్కడ ఏ5 షేక్ ఖయ్యూం మరియు 15 ఆటోలు వీరిద్దరి వద్ద లభ్యమయ్యాయని తెలిపారు. అనంతరం వీరందరూ ఏ6 అఫ్సర్ బేగ్, ఏ7 అసద్ ఖాన్ ఇంటి వద్దకు తీసుకువెళ్ళగా వారి వద్ద 11 ఆటోలు లభ్యమయ్యాయని తెలిపారు. వీరిపై హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 6 కేసులు నమోదయి ఉన్నాయని తెలిపారు. ఈ ఐదుగురు ప్రధాన నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్న ఏ1 యూసఫ్, ఏ2 సయ్యద్ పథకం ప్రకారం ఆటోలను హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో దొంగలించి వాటిని ఇక్కడికి తీసుకువచ్చి అమ్మడానికి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ప్రధాన నిందితులను పట్టుకోవడంలో జిల్లాలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి త్వరలో వారిని పట్టుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, దొంగలను పట్టుకోవడంలో జిల్లా పోలీసు యంత్రాంగం ముందు ఉంటుందని జిల్లా ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పిస్తుందని తెలిపారు. మొత్తం వీరందరి వద్ద 27 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు వీటి విలువ బహిరంగ మార్కెట్లో దాదాపు 27 లక్షల వరకు ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన రూరల్ సీఐ కే

ఫణిందర్ సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ఎస్సై ముజాహిద్, సిసిఎస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కే ఫణిధర్, సిసి ఎస్ ఇన్స్పెక్టర్ సిహెచ్ చంద్రశేఖర్, ఎస్సై సయ్యద్ ముజాహిద్, రూరల్ పోలీసు, సిసిఎస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జూన్ 14న జాతీయ లోక్ అదాలత్

**ఖమ్మం (జనంసాక్షి)**

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజ గోపాల్**

**మే 5 నుంచి మే 19 వరకు చెక్ బౌన్స్ కేసులకు సంబంధించి..**

జూన్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజ గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం చెక్ బౌన్స్ కేసులకు సంబంధించి ప్రత్యేక లోక్ అదాలత్ జూన్ 9 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మే 5 నుంచి 19 వరకు ముందస్తు లోక్ అదాలత్ ను జిల్లాలోని అన్ని కోర్టులలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రత్యేక లోక్ అదాలత్ లో ఇరు వర్గాల లేదా ఒక పక్షం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే అందుకు సంబంధించిన కేసు వివరాలు పరిశీలించి , ఇరుపక్షాల వారిని పిలిపించి ఇరుపక్షాల సమక్షంలో, వారి న్యాయవాదుల సమక్షంలో మధ్యవర్తిత్వం నిర్వహించి ఆమోదయో గ్యమైన పరిష్కారం కనుగొనేందుకు ప్రయత్నం జరుగుతుందని అన్నారు.

ఇరువురి సమక్షంలో రాజీ వివరాలను రాతపూర్వకంగా రాసి ఇరు వర్గాలకు అవార్డు రూపంలో కేసు పూర్తయినట్టుగా తక్షణమే అందిస్తామని తెలిపారు. చెక్ బౌన్స్ కేసుల ప్రత్యేక లోక్ అదాలత్ ను వినియోగి ంచుకోవాలని కోరారు.

జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడదగిన సివిల్, క్రిమినల్, మోటార్ ప్రమాదాలు, బ్యాంక్ రికవరీ, వివాహ సంబంధ కేసులను పరిష్కరించుకోవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రతి గింజ రాష్ట్ర ప్రభుత్వం కొనాలి

**నిష్పక్షపాతంగా కొనుగోలు జరపాలి**

**కేంద్ర హెూం శాఖ మంత్రి బండి సంజయ్...**

**గంభీరావుపేట మే 6( జనం సాక్షి):**



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోనీ నాయకమ్మ కొనుగోలు కేంద్రం వద్ద పాత్రికేయుల సమావేశం నిర్వహించారు, ఇందులో భాగంగా కేంద్ర హెూం శాఖ మంత్రి ఎంపీ బండి సంజయ్ మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల అవస్థలు వినడానికి చాలా బాధాకరంగా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ప్రశ్నించారు, కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వమే రవాణా, గోనె సంచులు గోదాముల కిరాయి, భరిస్తుందని, %ఘు% వరి ధాన్యానికి డబ్బులు కూడా చెల్లిస్తుందని, కొనుగోలు చేయడానికి మీ ప్రభుత్వానికి ఏం ఇబ్బందు చెప్పాలని మండిపడ్డారు, ఉమ్మడి జిల్లాలో దాదాపు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కానీ ఇప్పటివరకు రెండు లక్షల 50 వేలు మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని, రాష్ట్రవ్యాప్తంగా రైతులకు చాలా ఇబ్బంది పెడుతున్నారని లారీలు పెట్టుకోవడం వల్ల రైతుల టాక్టర్, యాజమాన్యం వారి జీవనోపాధి కోల్పోయారని డిపడ్డారు. వర్షం పడితే ధాన్యం ఎండుతుంది అని తడుస్తున్నాయని, ఎవరైనా రాజకీయ నాయకులు ప్రశ్నిస్తే వారిపై కేసులు పెడుతున్నారని ఇప్పటికైనా రైతుల బాధలు అర్థం చేసుకొని ప్రతి గింజ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని , వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎడబోయిన గోపి ,మండల అధ్యక్షుడు గంట అశోక్, ప్రసాద్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, కోడె రమేష్, రైతులు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల పండించిన ప్రతి చివరి గింజ

# కొనుగోలు చేస్తాం

**జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్**

**జనగామ ప్రతినిధి, మే 6(జనంసాక్షి ):**



నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి మార్కెట్ యార్డు లో,గానుగు పహాడ్, అడివికేశ్వ పూర్, ఎర్రకుంట తండా గ్రామలలో అధికారులతో కలిసి రైతుల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ను పరిశీలించి అనంతరం తడిసిన ధాన్యాన్ని త్వరగా లిఫ్ట్ చేయాలని సంబంధిత అధికారులకు శివరాజ్ ఆదేశించారు. అదేవిధంగా ఏ గ్రామంలో అయినా రైతులకు అండగా నిలిచి వారికి ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూడాలని కొనుగోలు కేంద్రాల సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు ,అదేవిధంగా వర్షం కి తడిసిన ధాన్యాన్ని వెంటనే లిఫ్ట్ చేసి మిగిలి పోయిన ధాన్యాన్ని కూడా తొందరగా కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వారి వెంట జనగామ ఆర్డీఓ గోపీరామ్, ఎం.ఆర్.ఓ హుస్సేన్ పాల్గొన్ని రైతులకు పలు సూచనలు ఇచ్చరు. ఈ కార్యక్రమంలో ఐకేపీ నిర్వాహుకులు,పీఏసీఎస్ అధికారులు,ఏఎంసీ డైరెక్టర్ బన్సీ నాయక్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రకాష్ యాదవ్,మాజీ ఎంపీటీసీ తుపాకుల రాములు, భిక్షపతి, సోముల, నిఖిల్, శ్రీనివాస్, బలరాం, రాజు మరియు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

**సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అల్వాల వీరయ్య**

**మరిపెడ మే 6 (జనంసాక్షి) :**



అర్హులైన పేదలందరికీ ఎలాంటి షరతులు లేకుండా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఐ ( ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలవాల వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళ వారం మరిపెడ పట్టణ కేంద్రంలోని సిపిఐ (ఎం) మండల కమిటీ సమావేశం జరిగింది . ఈ సమావేశానికి వీరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమా వేశంలో సిపిఐ (ఎం) జిల్లా నాయకులు గున గంటి మోహన్, మండల కార్యదర్శి గుండ గాని మధుసూదన్,

పార్టీ ఆర్గనైజర్ బాణాల రాజయ్య, మండల కమిటీ సభ్యులు కొండ ఉప్పలయ్య, కందాల రమేష్, దొంతు మమత, పాల్గొన్నారు.

## గత ప్రభుత్వం చేసిన అప్పులు తప్పుల గురించి

# ప్రజలకు తెలియాలి కదా?

**మంథని, (జనంసాక్షి)**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ముక్కు సూటి మనిషి అని.. గత ప్రభుత్వం చేసిన తప్పుల అప్పుల వల్ల ఇబ్బంది పడుతున్నామని ముఖ్యమంత్రి మాట్లాడారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మీడియాతో మంత్రి చీట్‌చాట్ నిర్వహించారు. బీజేపీ వాళ్లు దిగి పోండి అంటున్నారు.. బీజేపీ కేంద్రం లో పాలన చేతకాక పోతే దిగిపోవాలని అంటున్నారు. మరి పెహల్గం వైఫల్యంకి ఎవరు దిగిపోవాలి, మోడీ దిగిపో వాలని,మేము అన్నామా!బీజేపీ ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా..? మోడీ విదేశాలకు పోతే.. లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయా..? అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని ఒకరిద్దరు బెదిరించినట్టు మాట్లాడారు .. దానికి హార్ట్ అయ్యి ఉంటారన్నారు. హెలికాప్టర్ ప్రభుత్వం అద్దెకు తీసు కుందని.. మంత్రులు జిల్లాలు తిరిగితే%ా% కార్ల కంటే హెలికాప్టర్ ఖర్చు తక్కువన్నారు. ఇప్పుడున్న హెలికాప్టర్ గత ప్రభుత్వం హయంలోనే అద్దెకు తీసు కున్నారని.. వాళ్లు తిరగకుం డా రెంట్ కట్టారని చెప్పారు. సీఎం ఆవేదనతో మాట్లా డటానికి గల కారణాన్ని మంత్రి శ్రీధర్ బాబు చెప్పు కొచ్చారు. ప్రజా సంక్షేమం కోసం ఆలోచించి మాట్లాడారు సీఎం. చిన్నా భిన్నం చేసిన ఆర్థిక విధానం చూసి ఆవేదనతో మాట్లా డారు. నేను ఇచ్చిన మాట ప్రకారం అన్ని పనులు చేయాలి డబ్బులు లేవు అనే ఆవేదన సీఎంలో ఉంది. బీఆర్ఎస్ వాళ్లకు పేగు బంధం ఉంటే జీతాలే సరిగా వేయలేదు. వాళ్లకు ప్రేమ ఉన్నట్టా..? మేం రాగానే డీఏ ఇచ్చాం. వాళ్ళలాగా మేము వదిలేయలేదు. కార్పొరేషన్ పేరుతో తెచ్చిన అప్పులు కూడా ప్రభుత్వమే కడుతుంది. కేటీఆర్.. ప్రభుత్వం చేసిన అప్పుల గురించే మాట్లాడుతున్నారు" వాళ్లు చేసే తప్పుల గురించి మాట్లాడటం లేదు అని మంత్రి శ్రీధర్ బాబు వాక్యానించారు. తెలంగాణ రాష్ట్రాన్ని దివాళ తీయించింది కెసిఆర్ కాదా?అని ఆయన ప్రశ్నించారు. దాని నుంచి బయట పడేసే పనిలో మేమున్నామని, మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. "సెక్రటేరియట్ హెూం ఐతే.. వాళ్ళు ఉండేది ఫార్మ్ హౌసా..? ఉద్యోగస్తులు మా సోదరులు.. మా మిత్రులే. ఆలస్యం అయినా.. అన్ని సమస్యలు పరిష్కారం చేస్తాం. తెలంగాణ లోనే కాదు..దేశ వ్యాప్తంగా ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. అయినా.. వనరులు పెంచి.. నిధులు తెచ్చే పనిలో ఉన్నాం. లక్ష కోట్లు అప్పు తెచ్చి కాళేశ్వరంలోనే పెట్టారు కేసీఆర్. గత ప్రభుత్వం చేసిన దివాలా ఈ వ్యవస్థ గురించి ప్రజలకు తెలియాలి అని చెప్పారు. అప్పుల గురించి ప్రజలకు తెలియాలి కదా?చెప్పకపోతే ఎలా? రిటైర్మెంట్ ఉద్యోగుల బెనిఫిట్ ఇవ్వలేక.. కేసీఆర్ ఉద్యోగుల పదవి కాలాన్ని పెంచారు. కానీ మేము యువతకు ఉద్యోగాలు ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నాం.. అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మవోయిస్టుల ఎన్‌కౌంటర్లపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిం చారు.

మావోయిస్టుల తో మా కుటుంబానికి అన్యాయం జరిగింది. కానీ ఇంకో కుటుంబానికి అన్యాయం జరగొద్దు అనేది మా ఆలోచన. శాంతి చర్చలు కోరడం తప్పు కాదు. మా ప్రభుత్వమే గతంలో మావోయిస్టుల తో చర్చ చేసిందని గుర్తు చేశారు.

# నిబంధనల ప్రకారం అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు

**ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ఖమ్మం (జనంసాక్షి) :**



నిబంధనల ప్రకారం అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయింపు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో పైలెట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతి, ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. పైలెట్ గ్రామాలలో 878 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే, 409 ఇండ్లు బేస్మెంట్ స్థాయి వరకు నిర్మించామని, 370 లబ్దిదారులకు ప్రభుత్వం మొదటి విడత లక్ష రూపాయల ఆర్థిక సహాయం విడుదల చేసిందని అన్నారు. మిగిలిన గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని అధికారులు వివరించారు. మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పైలెట్ ప్రాజెక్టు మంజూరు చేసిన ఇళ్ల పురోగతి, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికపై కలెక్టర్ మండలాల వారీగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు ఒక గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను గ్రౌండింగ్ చేసే ముందు సంబంధిత లబ్దిదారులకు, మేస్త్రీ లకు మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇళ్లను చూపించి, తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇంటిని ఎలా నిర్మించుకోవాలో హౌజింగ్ శాఖకు ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన అసిస్టెంట్ ఇంజనీర్ ద్వారా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఇంటి నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులతో చర్చించి త్వరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలని, డబ్బు సమస్య ఉంటే డ్వాక్రా ద్వారా రుణాలు అందించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వివరాలను ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శి ఫోటో తీసి అప్ లోడ్ చేస్తారని, వీటిని అసిస్టెంట్ ఇంజనీర్, డీ.ఈ. క్షేత్ర స్థాయిలో ధ్రువీకరణ చేస్తారని, జిల్లా కలెక్టర్ ఆమోదం తర్వాత ప్రభుత్వానికి వెళ్లి లబ్ధిదారులకు చెల్లింపులు జరుగుతాయని అన్నారు.

ఖమ్మం జిల్లాకు 14 వేల 763 ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తే, 10 వేల 921 దరఖాస్తులు సర్వే చేసి 9 వేల 150 దరఖాస్తులకు అర్హత ఉందని తేలిందని తెలిపారు. తుది లబ్దిదారుల జాబితా ర్యాండమ్ గా చెక్ చేసి అర్హులకు మాత్రమే జాబితాలో చోటు కల్పించారా లేదా గమనించి వివరాలు అందించాలని అన్నారు. ర్యాండమ్ చెక్ పూర్తి చేసుకున్న తర్వాత ఎంపిక చేసిన అర్హుల జాబితాను ఆమోదం తీసుకొని గ్రౌండ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులకు మాత్రమే ఇళ్ల కేటాయింపు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సిఇఓ దీక్షా రైనా, డిఆర్డిఓ సన్యాసయ్య, ఈఈ హౌసింగ్ బి. శ్రీనివాస్, డిఇఓ సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత జిల్లా అధికారులు, ఆర్డీఓ కల్లూరు రాంచందర్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమీషనర్, తదితరులు పాల్గొన్నారు.



# కోటగుళ్లను సందర్శించిన పురావస్తు శాఖ సూపరింటెండెంట్ నిఖిల్ దాస్

**గణపురం, మే 06 (జనం సాక్షి )**

కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ ను మంగళవారం పురావస్తు శాఖ సూపరింటెండెంట్ నిఖిల్ దాస్ సందర్శించారు. త్వరలో ఆలయాన్ని అభివృద్ధి చేయనున్న తరుణంలో అధికారుల బృందం సందర్శించి ఆలయ పరిసరాలను పరిశీలించారు. గర్భాలయం ప్రదక్షిణ పదం, కాటేశ్వరాలయం నాట్యమండపాలను క్షుణ్ణంగా

పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన శిలా శాసనం శివ ద్వారపాలక విగ్రహాలను పరిశీలించి ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆర్కియాలజిస్ట్ అసిస్టెంట్ రోహిణి సీనియర్ కన్సర్వేటర్ మల్లేశం లుఉన్నారు.

# శేరిలింగంపల్లి సమగ్ర సంతులిత అభివృద్ధే అంతిమ ధ్యేయం

- రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ



శేరిలింగంపల్లి, మే 6 (జనంసాక్షి) : శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర, సంతులిత అభివృద్దే తన ప్రధాన ధ్యేయమని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎంత దూరమైనా వెళ్తానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని ఆయా ప్రాంతాలలో రెండు కోట్ల 48 లక్షల 70 వేల రూపాయల నిధుల అంచనా వ్యాయాయంతో ప్రభుత్వం చేపట్టనున్న సిసి రోడ్ల ఏర్పాటుకు సంబంధించిన కార్యక్రమాలలో మంగళవారం ఆయా డివిజన్లో కార్పొరేటర్లతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పలు శంకుస్థాపనలు గావించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధి ఈస్ట్ సాయి నగర్, మొగులమ్మ బస్తీ, పీజేఆర్ నగర్, దత్తాత్రేయ నగర్, షంషీగూడ ఇంద్రా హిల్స్, హెచ్ఎంటి శాతవాహన నగర్, జయ నగర్ తదితర కాలనీల పరిధిలో రెండు కోట్ల 48 లక్షల 70 వేల రూపాయల నిధుల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి పిఎసి చైర్మన్ అరికెపూడి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి నుండి శేర్లింగంపల్లి ప్రజలు తనను ఎంతో ఆదరాభిమానాలతో ఆశీర్వదిస్తూ వస్తున్నారని, శేరిలింగంపల్లి ప్రజలంటే తన సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తానని, అందుకే ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎన్ని నిధులనైనా వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తానని అరికెపూడి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న కోట్ల రూపాయల నిధులతో నూతనంగా రోడ్లు, మౌలిక సదుపాయాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ పరిధిలోని ఆయా కాలనీల అభివృద్దే ధ్యేయంగా అనేక కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని, ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని అరికపూడి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందని, తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని, ఎందుకోసం పక్కా ప్రణాళికలతో ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఈస్ట్ సాయి నగర్ కాలనీలో 57.50 లక్షల రూపాయల నిధుల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులు, 53 లక్షల రూపాయలతో మొగులమ్మ బస్తి, పిజెఆర్ నగర్, దత్తాత్రేయ కాలనీలలో చేపట్టనున్న సిసి రోడ్డు పనులు, షంసిగూడ ఇంద్రహిల్స్ కాలనీలో 76 లక్షల 20 వేల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులు, హెచ్ఎంటి శాతవాహన నగర్ జయ నగర్ కాలనీలలో 62 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ, డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శంకుస్థాపన గావించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. 80 లక్షలతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన శేరిలింగంపల్లి డివిజన్ పరిధి స్ప్రింగ్ వ్యాలీ కాలనీలో 80 లక్షల రూపాయల నిధుల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ మంగళవారం ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను కంకణబద్ధుడిని ముందుకు సాగుతున్నారని, ఇందుకోసం ప్రభుత్వ పెద్దల నుండి వీలైనన్ని నిధులు రాబట్టి శేరిలింగంపల్లి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోకజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిచేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఆశాభావం వ్యక్తం చేశారు. రోడ్లుసహా ఇతర అభివృద్ధి పనులను అధికారులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, ఎక్కడా రాజీ పడకూడదని సూచించారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత సుఖవంతమైన మెరుగైన రవాణా సౌకర్యంకొరకు శాయశక్తులా కృషి చేస్తానని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, ఆయా కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలిలో ఆక్రమణలను తొలగించిన హైడ్రా



శేరిలింగంపల్లి, మే 6 (జనంసాక్షి) : హైడ్రాధికారులు మంగళవారం మరోసారి శేరిలింగంపల్లిలో తమ పంజాను విసిరారు. ఈ మధ్యకాలంలో హైడ్రా కదలికలు కాస్త తగ్గాయని భావించిన కొందరు కబ్జా రాయుళు శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి ప్రాంతంలోని సంధ్య కన్వెన్షన్ ప్రాంతంలో పలు ఆక్రమణలను నిర్మించినట్టు గుర్తించిన అధికారులు తగిన ఆధారాలతో సంధ్య కన్వెన్షన్ వద్దకు చేరుకొని ఆధారాలను సరిచూసుకోవడంతోపాటు ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే అవుట్‌లో స్పష్టమైన ఆక్రమణల గుర్తించి సదరు నిర్మాణాలను కూల్చివేయడం జరిగింది. ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్ యొక్క రూపురేఖలను పకడ్బందీగా మార్చేసిన ఆక్రమణదారులు పాత ఆనవాళ్లను నామరూపాలు లేకుండా చేయడంతోపాటు లే అవుట్ పరిధిలోని రోడ్లు, పబ్లిక్ పార్కులను కలుపుతూ చేపట్టిన నిర్మాణాలను లోపభూయిష్టమైన వని గుర్తించి పూర్తిస్థాయి నేలమట్టాన్ని చేపట్టారు. కాగా సంధ్య కన్వెన్షన్ ప్రాంతంలో పలువురు అక్రమ నిర్మాణాలకు పూనుకున్నారని లేఅవుట్ యజమానులు, స్థానికులు పలుమార్లు ఆధారాలతో కూడిన ఫిర్యాదులను హైడ్రాధికారులకు సమర్పించిన నేపథ్యంలో పక్కా ప్రణాళికతోనే అధికారులు విచ్చేసి సంధ్య కన్వెన్షన్ మినీ హాల్ తో పాటు వంటగదులు, రెస్ట్ రూమ్ లను తొలగించడం జరిగింది. లే అవుట్ ను ఆక్రమించి నిర్మించిన రేకుల ఫెన్సింగ్‌ను సైతం పూర్తిస్థాయిలో నేలమట్టడం చేయడంలో హైడ్రాధికారులు సఫలీకృతులయ్యారు. జీ ప్లస్ 2గా నిర్మించిన 3 ఐరన్ షడ్‌లను కూడా ఈ సందర్భంగా అధికారులు తొలగించడం గమనార్హం.

# నూనె గింజల ఉత్పత్తిని పెంచాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



నారాయణపేట జిల్లా బ్యూరో, మే 6 (జనం సాక్షి) : జిల్లాలో నూనె గింజల ఉత్పత్తిని పెంచాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ లో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ అమలుపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మిషన్ ప్రధాన ఉద్దేశ్యం దేశీయంగా తినదగిన నూనె గింజల ఉత్పత్తిని ప్రోత్సహించడం ద్వారా దిగుమతులపై ఆధారాన్ని తగ్గించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ మాట్లాడుతూ మద్దూరు, దామరగిద్ద, మక్తల్ మండలాల్లో ఉన్న రైతు ఉత్పత్తిదారుల సంఘాల సహకారంతో సుమారు 1500 హెక్టార్లలో (పల్లీ) వేరుశెనగ సాగును ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఈ ఉద్దేశంతో రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరా, ఉత్పాదకత పెంపునకు శిక్షణా కార్యక్రమాలు, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా ఫార్మర్ ఫీల్డ్ స్కూల్స్ నిర్వహించనున్నట్లు వివరించారు. అలాగే మైక్రో ఇరిగేషన్ (స్ప్రింక్లర్లు) ఏర్పాటు కోసం ఉద్యానవన శాఖ సహకారం అవసరమని, అలాగే ఆయిల్ ప్రొడక్షన్ యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించేందుకు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మద్దతు ఇవ్వాలని జాన్ సుధాకర్ విజ్ఞప్తి చేశారు. ఆయా ప్రతిపాదనలపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన అన్ని రకాల సహాయాన్ని డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ విజయ్ కుమార్, ఇరిగేషన్ ఈ ఈ బ్రహ్మానం దరెడ్డి, నారాయణపేట వ్యవసాయ అధికారులు, మద్దూరు, దామరగిద్ద, మక్తల్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, ఎఫ్ పీ వో ప్రతినిధులు పాల్గొన్నారు.

# దళారుల ప్రమేయం లేకుండా గొర్రెలను పంపిణీ చేయాలి



శామీర్‌పేట్, మే 6 (జనం సాక్షి) : గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం మొదటి మహాసభలు శామీర్ పేట్ మల్లన్న గుడి వద్ద జరిగా యి. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎక్కలదేవి కొమురయ్య,జిల్లా సహాయ కార్యదర్శి భావన వెంకటేశ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ఈ సమావేశంలోజిల్లా ప్రధాన కార్యదర్శి ఎక్క లదేవి కొమురయ్య హాజరై మాట్లాడుతూ..గత బి.ఆర్.ఎస్. ప్రభుత్వం గొల్ల కురుమలను మోసం చేసినట్టే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరి స్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గొల్ల కురుమలకు 2 లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా హామీని నెరవేర్చకుండా పాత ప్రభుత్వం అడుగుజాడల్లో నడుస్తుందని విమర్శించారు. అవినీతి సాకుతో నేటి ప్రభుత్వం గొర్రెలివ్వకుండా డి.డి.ల డబ్బులు రిటర్న్ ఇవ్వడం విడ్డూరంగా ఉంది. పశువైద్యశాలల్లో ఎలాంటి మందులు అందుబాటులో ఉండటంలేదని, రెండేండ్ల నుండి కనీసం నట్టల మందులు కూడా ఇవ్వటంలేదని, జిల్లా వ్యాప్తంగా ప్రతీరోజు వీధి కుక్కల దాడులు, రకరకాల ప్రమాదాల్లో వందలాది గొర్రెలు చనిపోతున్నాయన్నారు. గొర్రెల కాపరులపై రాష్ట్ర వ్యాప్తంగా ఫారెస్టు అధికారుల దాడులు పెరుగుతున్నాయని, రైతు భీమా ఉందనే కారణం చూపి ప్రమాదవశాత్తు మరణిస్తున్న గొర్రెల కాపరు లకు ఎక్స్రేషియో ఇవ్వడంలేదని, రోజురోజుకు గొర్రెల దొంగతనాలు పెరిగిపోతున్నాయి, ఇప్పటికీ పశుసంవర్ధక శాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించ లేదని, ముఖ్యమంత్రి దగ్గరే ఆ శాఖ ఉండటంతో ఎవరికి కలిసే అవకాశం ఇవ్వటం లేదని, శాఖకు శాశ్వత డైరెక్టర్ ని, ఇతర అధికారులను నియ మించడంలేదని, సమస్యలను ఎవరికి మొర పెట్టుకోవాలో అర్థం కాని స్థితిలో గొర్లకాపరు లున్నారని, ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతున్నా రని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేనిచో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యాదవ సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు.

# ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రుద్రంగి, మే 6 (జనం సాక్షి) : ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రుద్రంగి మండల కేంద్రంలోనీ రైతు వేదికలో అర్హులైన 22 మంది లబ్ధిదారులకు 7 లక్షల పై చిలుకు ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజా ఆరోగ్యశ్రీని 10 లక్షలకు పెంచడం జరిగిందని తెలిపారు. మన ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార, ఎల్ఓసి ల ద్వారా ఇప్పటి వరకు 20 కొట్లు పై చిలుకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రుద్రగి మండల కేంద్రంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని 1 కోటి 43 లక్షలతో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు.. తద్వారా ప్రజలకు వైద్య సేవలు కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా మండల కేంద్రంలోని చికిత్స తీసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. గతంలో 108 అంబులెన్సు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. పేదలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి,ఎంపీడీవో నటరాజ్, వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, మాజీ జెడ్పిటిసి గట్ల మీనయ్య, డిసిసి కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ రెడ్డి తో పాటు నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, స్థలాలు ఇవ్వాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



సంగారెడ్డి టౌన్, మే 6 (జనం సాక్షి) : సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అర్హులైన పేదలకు ఇండ్లు ఇళ్లస్థలాలు, డబుల్ బెడ్రూమ్ ఇల్లు ఇవ్వాలని మే 8న సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో సంగారెడ్డి జరిగిన సమావేశం లో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అనేక మంది పేదలు ఇండ్ల స్థలాలు లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వచ్చిన ఆదాయం సగం ఇంటి కిరాయిలకే పోతున్నదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. 18 నెలలు గడిచిన ప్రభుత్వం నుండి ఎలాంటి హామీలు అమలు కావటం లేదన్నారు. ఖాళీగా ఉన్న డబల్ బెడ్ రూమ్ లు పేదలకు పంచాలని అన్నారు. రాజీవ్ గృహ కల్ప ఇండ్లు పూర్తి చేసి వెంటనే పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం సిపిఎం నాయకులు రాజయ్య, సాయిలు, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకే రాజీవ్ యువ వికాసం పథకాన్ని అందించాలి


- అధికారులకు సూచించిన ఎంపీడీవో శ్రీకాంత్
- తలకొండపల్లి తాహసిల్దార్ నాగార్జున



తలకొండపల్లి, మే 6 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించి ఆర్థికంగా భరోసాను కల్పించేందుకే రాజీవ్ యువ వికాస పథకాన్ని అమలు పరుస్తుందని,నిజమైన అర్హులకే అందించాలని సంబంధించిన అధికారులకు తలకొండపల్లి ఎంపీడీవో శ్రీకాంత్,తహసిల్దార్ నాగార్జున పేర్కొన్నారు.మంగళవారం తలకొండపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీకాంత్ అధ్యక్షతన ఎస్సీ,ఎస్టీ,బీసీమైనారిటీ కార్పొరేషన్ల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండలంలో 2249 మంది నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.కులాలవారీగా ఎస్సీ కార్పొరేషన్ కు 708,మంది,ఎస్టీ కార్పొరేషన్ కు 420,మంది,బీసీ కార్పొరేషన్ కు 1044,మంది,మైనారిటీ కార్పొరేషన్ కు 63 మంది,క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ కు 03 మంది,ఎంబీసీ నిరుద్యోగులు 11 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.లబ్ధిదారుల ఎంపికను సిబిల్ ఆధారంగా పారదర్శకంగా ఎంపిక చేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు.బ్యాంకులవారీగా వచ్చిన దరఖాస్తు వివరాలు.. వెల్జాల్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుకు 604,తలకొండపల్లి యూనియన్ బ్యాంక్ కు 894,తెలంగాణ గ్రామీణ బ్యాంకు తలకొండపల్లి శాఖకు 335,పడకల్ తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు,183,మక్తమాదారం కెనరా బ్యాంకుకు 68,ఊరుకొండ పేట బ్యాంకుకు 75 చొప్పున వచ్చిన దరఖాస్తులను పరిశీలించి బ్యాంకు అధికారులకు అందజేసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ప్రతినిధి ప్రసాద్,బీసీ కార్పొరేషన్ అధికారి శ్రీలక్ష్మి,ఎంపీఓ లక్పతి నాయక్,వివిధ గ్రామాల స్పెషల్ ఆఫీసర్స్,జూనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ,గ్రామపంచాయతీ కార్యదర్శులు,మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొంటాం


- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



గుర్రంపోడు, మే 6 (జనంసాక్షి) : జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండలం కొప్పోలు, గ్రామం గుర్రంపోడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ లారీల సమస్య ఉత్పన్నమైందని తెలుసుకొని తక్షణమే ఈ రెండు కేంద్రాలకు వెళ్లి సమస్య పై అక్కడి రైతులు, స్థానికులతో మాట్లాడారు. లారీల సమస్య లేకుండా లారీలను ఎప్పటికప్పుడు పంపించే ఏర్పాటు చేస్తామని అన్నారు. ఒకే మిల్లుకు నాలుగైదు లారీలు పంపించకుండా ఆ పరిధిలో ఉన్న అన్ని మిల్లులకు ఒక్కో లారీ పంపించాలని, అప్పుడే ధాన్యాన్ని వెంట వెంటనే దించుకోవడం కొనుగోలు కేంద్రాలనుండి పంపించడం సులభం అవుతుందని, లేదంటే ఒకే మిల్లుకు పంపించినట్లయితే దిగుమతి చేసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. ఒకవేళ కేటాయించిన లారీలు సరిపోకపోతే అదనంగా స్థానికంగా లారీలను ఏర్పాటు చేయాలని తహసిల్దార్ శ్రీనివాసులు ఆమె ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన దాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుకూలంగా ఉంటే వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని చెప్పారు. ఎట్టి పరిస్థితులలో ట్రాన్స్పోర్ట్ సమస్య, మిల్లర్ల సమస్య రాకూడదని ఆదేశించారు. దాన్యం కొనుగోలులో ఇబ్బంది కాకుండా ఎప్పటికప్పుడు ప్రతిరోజు టెలికాన్ఫరెన్సు ద్వారా తాను సమీక్షించడమే కాకుండా, మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి ధాన్యం కొనుగోలును వేగవంతం చేస్తున్నామని, ఏ మిల్లుకు ఎంత దాన్యం అవసరమో పరిశీలించి పంపించడం జరుగుతున్నదని స్పష్టం చేశారు .ఇతర ప్రాంతాల నుండి దళారీలు ధాన్యాన్ని తీసుకు వచ్చినట్లయితే వారిపై కేసులు నమోదు చేస్తున్నామని, అలాగే ఎవరైనా మిల్లర్లు కావాలని ఇబ్బందులు పెట్టినట్లయితే వారిపై చర్య తీసుకోవడానికి వెనకాడబోమని హెచ్చరిస్తున్నామని, తనతోపాటు, పౌర సరఫరాల అధికారులు, ఇన్చార్జి రెవెన్యూ ఆదనపు కలెక్టర్ ప్రతిరోజు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్, రెవెన్యూ అదనపు ఇన్చార్జి కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ హరీష్, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, గుర్రంపొడ్ తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు. ఉన్నారు.కాగా కొప్పోలు, గుర్రంపోడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా నిర్వహిస్తుండగా, ఈ రెండు కేంద్రాలలో రికార్డుల నిర్వహణ ,తేమ అన్ని సక్రమంగా ఉండడం పట్ల జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయింది

- కేంద్రమంత్రి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్



ఎల్లారెడ్డిపేట, మే 6 (జనంసాక్షి) : రాష్ట్రం అప్పుల్లో ఉందని డబ్బులు లేవని ముఖ్యమంత్రి అనడం సిగ్గుచేటని, 6 గ్యారంటీలపై కాంగ్రెస్ శాసనసభ్యులను, నాయకులను నిలదీయాలని, ముఖ్యమంత్రి డబ్బులు లేవని బహిరంగంగా చెప్పడంతో మంత్రులు, శాసనసభ్యులు ఆందోళన పడుతున్నారని, చేతకాకుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయిందని, ఖేల్ ఖాతం, దుకాణం బంద్ అని కేంద్రమంత్రి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోన ప్రెస్ క్లబ్‌లో మంగళవారం సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ రైతుల హామీలన్నీ గాలికొదిలేసినట్లే, వృద్దులకు 4 వేల ఫింఛన్ ఇయ్యరని, మహిళలకు నెల నెలా 2500లు, తులం బంగారం ఒట్టిమాటేనని అన్నారు. నిరుద్యోగులకు 4 వేల భ్రుతి లేదని, ఆరు గ్యారంటీలు ఇస్తామని రేవంత్‌రెడ్డి హామి ఇవ్వడమే కాకుండా రాహుల్ గాంధీ సంవిధాన్ పుస్తకం పట్టుకొని ఇచ్చిన హామిని ఇవ్వలేమని మళ్లీ తెలంగాణకు వచ్చి చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. జాతీయ రహదారి నిర్మాణాలపై కాంగ్రెస్ 2035 వరకు కాంట్రాక్టతో ఉన్న సమస్యను పరిష్కరించుకోవాలని కేంద్రం చెప్పింది నిజం కాదా? ఆ సమస్యను పరిష్కరిస్తే 6 లేన్ జాతీయ రహదారిగా విస్తరిస్తామని 2022లోనే చెప్పలేదా? ఇదిగో ఆధారం నిన్న కోమటి రెడ్డికి కూడా గడ్కరీ ఇదే విషయాన్ని చెప్పారు లేఖల పేరుతో కేంద్రంపై బురద చల్లడం ఎంత వరకు కరెక్ట్ ప్రజల దృష్టిని మళ్లించడానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్పందించాల్సిందే అని అన్నారు. సీఎం వ్యాఖ్యలపై మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలో భయం పట్టుకుందన్నారు. ఇంటికి ఏద్కెనా సమస్య వస్తే ఇంటి పెద్ద కుటుంబ సభ్యులకు ధ్కెర్యం చెబుతూ సమస్యను అధిగమించేందుకు ప్రయత్నిస్తారని, కానీ రాష్ట్రానికి పెద్దగా ఉన్న ముఖ్యమంత్రి అందుకు భిన్నంగా మాట్లాడి రాష్ట్రం పరువు తీశారన్నారు. నక్సల్కెట్లు అమాయికుల ప్రాణాలను తీస్తున్నారని పోలీసులను హత్య చేయడమేకాకుండ ఎంతోమంది అమాయికులను ఇన్‌ఫార్మర్‌ల నేపంతో చంపడం జరిగిందని వారితో చర్చలు ఉండవని అన్నారు. అనంతరం ఎల్లారెడ్డిపేట వద్ల ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం గోస పెడుతుందని రైతులందరు ప్రభుత్వానికి తగిన బుద్ది చెప్పుతామన్నారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు రాంచందర్‌రెడ్డి, నాయకులు పొన్నాల తిరుపతిరెడ్డి, సద్ది లక్ష్మారెడ్డి, గాల్‌రెడ్డి, బుగ్గారెడ్డి, సత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




### రియల్ ఎస్టేట్‌లోకి
# పెట్టుబడుల వెల్లువ

దేశంలోని రియల్ ఎస్టేట్ రంగంలోకి ప్రత్యామ్నాయ పెట్టుబడులు(ఏఐఎఫ్) వెల్లువెత్తుతున్నాయి. 2024 డిసెంబర్ చివరి నాటికి రూ.73,903 కోట్లకు చేరాయి.గతేడాది డిసెంబర్ నాటికి అన్ని రంగాల్లో ఏఐఎఫ్‌లు కలిపి రూ.5,06,196 కోట్లు రాగా.. ఇందులో 15 శాతం వాటా రియల్ ఎస్టేట్ రంగంలోకి వచ్చాయని అనరాక్ నివేదిక వెల్లడించింది.నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న ప్రాజెక్ట్‌లకు ఏఐఎఫ్ పెట్టుబడులు జీవాన్నిస్తున్నాయని, డెవలపర్లకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని నివేదిక వెల్లడించింది. రియల్ ఎస్టేట్ తర్వాత అత్యధికంగా ఐటీ, ఐటీఈఎస్ రంగంలోకి రూ.30,279 కోట్ల ఏఐఎఫ్ పెట్టుబడులు వెళ్లాయి.ఆ తర్వాత ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.26,807 కోట్లు, ఎన్‌బీఎఫ్‌సీ రూ.21,929 కోట్లు, బ్యాంకులు రూ.21,273 కోట్లు, ఫార్మా రూ.18,309 కోట్లు, ఎఫ్ఎంసీజీ రూ.12,743 కోట్లు, రిటైల్ రూ.11,550 కోట్లు, పునరుత్పాదక ఇంధన రంగం రూ.11,433 కోట్ల చొప్పున ఏఐఎఫ్ పెట్టుబడులు ఆకర్షించగా.. ఇతర రంగాల్లోకి రూ.2,77,970 కోట్ల పెట్టుబడులు వెళ్లాయి. రియల్ ఎస్టేట్ అభివృద్ధి పరంగా వివిధ దశల్లో ఉన్న నిధుల సమస్యకు ఏఐఎఫ్ రూపంలో పరిష్కారం లభించినట్టయింది.దేశంలో సంపన్నులైన పెట్టుబడిదారులు ముఖ్యంగా కనీసం రూ.కోటి పెట్టుబడి పెట్టగల హై నెట్‌వర్త్ ఇండివిద్యువల్స్ సంస్థల కోసం ఉద్దేశించిన ప్రైవేట్ పెట్టుబడి సమీకరణ సాధనాలే ఈ ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్). 2012 ఏఐఎఫ్ నిబంధనల ప్రకారం సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) వీటిని నియంత్రిస్తుంది.స్టాక్స్, బాండ్లు లేదా మ్యూచువల్ ఫండ్స్ వంటి సంప్రదాయ పెట్టుబడులకు భిన్నంగా ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్, హెడ్జ్ ఫండ్స్, రియల్ ఎస్టేట్, కమోడిటీస్, డెరివేటివ్స్ వంటి సంప్రదాయేతర ఆస్తుల తరగతులలో ఏఐఎఫ్ పెట్టుబడులు పెడతారు.

## లాభాలకు విరామం

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. మాక్‌డ్రిల్స్ నిర్వహించాలంటూ కేంద్రం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో భారత్‌- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తొచ్చన్న అంచనాలతో మదుపర్లు అప్రమత్తత పాటించారు.దీనికి తోడు తమ దేశంలో ఔషధాల ఉత్పత్తికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ ప్రభావం మన ఫార్మా స్టాక్స్‌పై పడింది. వడ్డీ రేట్లపై బుధవారం అమెరికా ఫెడరల్ రిజర్వ్ నుంచి నిర్ణయం వెలువడనుండడంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో రెండ్రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. నిఫ్టీ 24,400 దిగువకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 80,907.24 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,796.84) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 80,481.03 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 155.77 పాయింట్ల నష్టంతో 80,641.07 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 81.55 పాయింట్ల నష్టంతో 24,379.60 వద్ద ముగిసింది.

**స్థిరాస్తి రంగానికి ప్రత్యేకించి గృహ విభాగానికి కరోనా మహమ్మారి బూస్ట్‌లా బలానిచ్చింది. హోం ఐసోలేషన్, వర్క్ ఫ్రం హోమ్ వంటి కారణంగా సొంతింటి అవసరం తెలిసి రావడంతో నివాస విభాగం శరవేగంగా అభివృద్ధి చెందింది. దీంతో కోవిడ్ తర్వాత కొత్త ఇళ్లకే కాదు రీసేల్ ప్రాపర్టీలకూ గిరాకీ పెరిగింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో రిజిస్ట్రేషన్ అయిన ప్రాపర్టీలలో సెకండ్ హ్యాండ్ హోమ్స్ వాటా 38 శాతంగా ఉండగా.. 2024-25 నాటికి 43 శాతానికి పెరిగిందని ఇంటిగ్రేటెడ్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ప్లేస్ స్క్వేర్ యార్డ్స్ నివేదిక వెల్లడించింది.**

# కొత్తవి వద్దు..
# సెకండ్ హ్యాండే ముద్దు



- హైదరాబాద్‌లో ఇలాంటి ఇళ్లకు పెరుగుతున్న డిమాండ్
- కరోనాతో పెరిగిన ఇంటి అవసరం మంచి ప్రాంతం, మౌలిక
- వసతులుంటే కొనడం ఉత్తమం 38 శాతం నుంచి 43శాతానికి
- పెరిగిన రీ సేల్ ప్రాపర్టీల వాటా
- ఐటీ కారిడార్ సమీప ప్రాంతాల్లోని ఇళ్లకు అధిక డిమాండ్

**జనంసాక్షి:**డెవలపర్ నుంచి నేరుగా కొనుగోలుదారులు కొనుగోలు చేసే ప్రాపర్టీలను ప్రైమరీగా, ఇంటి యజమాని మరొక కస్టమర్‌కు రీసేల్ చేస్తే దాన్ని సెకండరీ ప్రాపర్టీగా పరిగణిస్తారు. దేశంలోని 7 ప్రధాన నగరాలలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3.07 లక్షల యూనిట్లు రిజిస్ట్రేషన్ కాగా.. ఇందులో 1.22 లక్షల రీసేల్ ప్రాపర్టీలు ఉండగా 2024-25 నాటికి మొత్తం 5.44 లక్షల యూనిట్లు రిజిస్ట్రేషన్ కాగా.. సెకండ్‌హ్యాండ్ ప్రాపర్టీలు ఏకంగా



2.33 లక్షలకు పెరిగాయి. ప్రైమరీ యూనిట్లు 2018-19లో 1.84 లక్షలుగా ఉండగా.. 2024-25 నాటికి 3.11 లక్షలకు చేరాయి. అంటే రీసేల్ ప్రాపర్టీలలో 38 శాతం నుంచి 43 శాతానికి పెరిగితే.. ప్రైమరీ యూనిట్లు 62 శాతం నుంచి 57 శాతానికి తగ్గాయి.కరోనా కంటే ముందు వరకూ బెంగళూరు, చెన్నై, ముంబై వంటి నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు అందుబాటులోనే ఉండేవి. డెవలపర్లు కూడా అఫర్డబుల్ హౌసింగ్ నిర్మాణాలకే ప్రాధాన్యత ఇచ్చేవారు. అయితే ఏటేటా భూముల ధరలు పెరుగుతుండటంతో చౌక ఇళ్ల నిర్మాణ వ్యయప్రయాసంగా మారింది. దీంతో లగ్జరీ, విశాలమైన గృహ నిర్మాణాల వైపు ఆసక్తి పెరిగింది. కొత్త ప్రాజెక్టల లాంచింగ్స్ పరిమిత స్థాయిలో ఉండటం, అందు బాటు గృహాల స్థానంలో ఖరీదైన గృహాల సరఫరా పెరగడంతో సెకండ్ హ్యాండ్ ప్రాపర్టీల వైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలు మొగ్గుచూపుతున్నారు.హైదరాబాద్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 71 వేల యూనిట్లు రిజిస్ట్రేషన్ కాగా.. ఇందులో 35 వేలు ప్రైమరీ, 36 వేలు సెకండరీ యూనిట్లు ఉన్నాయి. అదే 2018-19లో మొత్తం 63 వేల యూనిట్లు రిజిస్ట్రేషన్ కాగా.. ఇందులో ప్రైమరీ 29 వేలు, సెకండరీ యూనిట్లు 34 వేలు ఉన్నాయి. 2018-19లో ప్రైమరీ యూనిట్ల వాటా 46 శాతం కాగా.. సెకండరీ యూనిట్ల వాటా 54 శాతంగా ఉంది. అదే 2024-25లో ప్రైమరీ యూనిట్ల వాటా 49 శాతం కాగా..సెకండరీ యూనిట్ల వాటా 51 శాతంగా ఉంది.రోడ్లు, విద్యుత్, తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ వంటి మెరుగైన మౌలిక వసతులు ఉన్న ప్రాంతాలలో రీసేల్ ప్రాపర్టీలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. మాదాపూర్, హైటెక్ సిటీ, కూకట్‌పల్లి, హబ్సిగూడ, ఉప్పల్, పోచారం వంటి ఐటీ కేంద్రాలకు సమీపంలో ఉన్న ప్రాంతాల్లోని సెకండ్ హ్యాండ్ హోమ్స్ డిమాండ్ ఎక్కువగా ఉంది. మెట్రో కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లోని నాణ్యమైన ఇళ్లకు ధర కాస్త ఎక్కువైనా కొనేందుకు కస్టమర్లు ఆసక్తి చూపిస్తున్నారు.

### ధరలు అందుబాటులో..

రోడ్లు, విద్యా, వైద్య సంస్థలు, మార్కెట్లు, రవాణా సదుపాయాలతో స్థిరమైన మౌలిక వసతులు ఉంటాయి.నిర్మాణం పూర్తయ్యే వరకూ వేచి చూడా ల్సిన అవసరం లేకుండా గృహ ప్రవేశం చేసేయవ చ్చు. రీసేల్ ప్రాపర్టీలకు జీఎస్టీ వర్తించదు కాబట్టి కొనుగోలుదారులకు డబ్బు ఆదా అవుతుం ది.కొత్త ప్రాజెక్టులు పెద్దగా లేని ప్రాంతాల లో సెకండ్ హ్యాండ్ హోమ్స్ యజమానితో బేరసా రాలకు అవకాశం ఉంటుంది.రీసేల్ ప్రాపర్టీలకు సైతం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లు తక్కువ వడ్డీలోనే గృహ రుణాలను అందిస్తున్నాయి.కొత్త ఇంటి కొనుగోలు సమయం లో డెవలపర్ కు ముందుగా చెల్లించే 10-15 శాతం డౌన్ పేమెం ట్‌ను చెల్లించి, బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుం ది. అదే రీసేల్ ప్రాపర్టీలో అయితే ఇదేమీ అక్కర్లేదు.

### జాగ్రత్త సుమా..

సెకండ్ హ్యాండ్ ప్రాపర్టీలు కొనేముందు ఇంటి వాస్తవ విలువ, మార్కెట్ ధరలను పూర్తిగా అధ్య యనం చేసుకున్న తర్వాతే నిర్ణయానికి రావడం ఉత్తమం.సాధారణంగా రీసేల్ ప్రాపర్టీలు వ్యవస్థీకృ త రంగంలో విక్రయాలు జరగవు కాబట్టి మధ్య వర్తుల మాటలు నమ్మకూడదు. ఒకటికి రెండుసా ర్లు పునఃసమీక్ష చేసుకున్న తర్వాతే ముందడుగు వేయాలి.లీకేజీలు, నిర్వహణ సమస్యలను గృహ యజమాని దాచిపెట్టే అవకాశాలు ఉంటాయి కాబ ట్టి థర్డ్‌పార్టీతో సమగ్రంగా అధ్యయనం చేయిం చిన తర్వాత కొనుగోలు చేయడం బెటర్.10-15 ఏళ్లకు పైబడి పాత ఇంటిని కొనకపోవడమే ఉత్త మం. పాత ఇంటిని కొన్నా.. దాని కూల్చేసి కొత్త ఇం టిని నిర్మించుకుంటేనే కలిసొస్తుంది.లింక్ డాక్యు మెంట్లు, సేల్‌డీడ్, ఆస్తి పన్ను పత్రాలు ఇతరత్రా డాక్యుమెంట్లను న్యాయ సలహా తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.

### 70% టీసీఎస్ ఉద్యోగులకు నూరు శాతం వేరియబుల్ పే

ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ జనవరి- మార్చి త్రైమాసికానికి వేరియబుల్ పే అలవెన్స్‌ను చెల్లించింది. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి నూరు శాతం చెల్లింపులు చేసినట్లు టీసీఎస్ తెలిపింది. తమ తమ వ్యాపార విభాగాల పనితీరు ఆధారంగా మిగిలిన ఉద్యో గులకు వేరియబుల్ పే చెల్లింపులు చేసినట్లు పేర్కొంది. ప్రతి త్రైమాసికంలోనూ టీసీఎస్ ఇదే విధానాన్ని అవలంబిస్తోందని ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు ఇటీవల మార్చి నెల త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన టీసీఎస్.. రూ.12,224 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మార్జిన్లు తగ్గడంతో నికర లాభం 1.7 శాతం మేర క్షీణించింది. ఆదాయం మాత్రం గతేడాదితో పోలిస్తే 5.3 శాతం వృద్ధితో రూ.64,479 కోట్లుగా నమోదైంది. అయితే, త్రైమాసిక ఫలితాల సందర్భంగా 6.07 లక్షల మంది ఉద్యోగులకు వార్షిక వేతన పెంపును వాయిదా వేసినట్లు ప్రకటించింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 4.75 | ₹ 4.77 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 90,250 | ₹ 98,460 |
| --- | --- |
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,07,900



# హార్వర్డ్‌పై కొరడా..
## ఫెడరల్ నిధులు నిలిపివేసిన ట్రంప్

హార్వర్డ్ యూనివర్సిటీ విషయంలో ట్రంప్ యంత్రాంగం అన్నంతపని చేసింది. ఆ విశ్వవిద్యాలయానికి అందించే ఫెడరల్ నిధులను నిలిపివే స్తున్నట్లు అమెరికా ప్రభుత్వంలోని విద్యాశాఖ మంత్రి లిండా మెక్‌మాన్ ప్రకటించారు. విశ్వవిద్యాలయంపై నియంత్రణ ఆశిస్తూ కొన్ని విధానప రమైన మార్పులు తీసుకురావాలని విశ్వవిద్యాలయానికి సూచించినప్ప టికీ.. దానికి ససేమిరా అనడంతో విశ్వవిద్యాలయం బడ్జెట్, పన్ను మిన హాయింపుల్లో కోతలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ డిమాండ్లను నెరవేర్చే వరకు హార్వర్డ్‌కు ఎటువంటి కొత్త గ్రాంట్లు మంజూరుచేయమని స్పష్టం చేశారు.ఫెడరల్ పరిశోధన గ్రాంట్లకు మాత్రమే ఈ నిషేధం వర్తి స్తుందని.. యూనివర్సిటీ ట్యూషన్ ఫీజులను చెల్లించడానికి విద్యార్థులకు సహాయపడే ఫెడరల్ ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందని విద్యాశాఖ పేర్కొంది. అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్న విదేశీ విద్యార్థులకు హార్వర్డ్‌లో ప్రవేశం కల్పిస్తూ.. అత్యున్నత వ్యవస్థను అపహాస్యం చేసిందని ఆరోపించారు. మరోవైపు విశ్వవిద్యాలయంపై జాతి వివక్షపై ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై విచారణ కొన సాగుతోందని పేర్కొన్నారు.ప్రభుత్వం ఫెడరల్ నిధులను నిలిపి వేయడాన్ని హార్వర్డ్ విశ్వవిద్యాలయం వ్యతిరేకిం చింది. ప్రభుత్వం చేసే చట్టవిరుద్ధమైన డిమాండ్లను పాటించడానికి నిరా కరించడంతో సమాఖ్య ప్రభుత్వం విశ్వవిద్యాలయంపై ఇటువంటి చర్యలు తీసుకుంటోం దని హార్వర్డ్ అధ్యక్షు డు అలాన్ గార్బర్ పేర్కొన్నారు. ప్రభుత్వం తమను ఎన్నిరకాలుగా అణచి వేయడానికి ప్రయత్నించినా పోరాడుతూనే ఉంటా మని అన్నారు.విదేశీ విద్యార్థుల అక్రమ, హింసాత్మక కార్యకలాపాల రికా ర్డులను సమర్పిస్తేనే కొత్తగా విదేశీయులను చేర్చుకునేందుకు అనుమతి స్తామని వైట్‌హౌజ్ హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి స్పష్టం చేసింది.

# అసలేమిటీ.. మాక్ డ్రిల్స్

భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తారా స్థాయికి చేరడంతో కేంద్ర హోం శాఖ సంక్షోభ సమయంలో పౌరులు ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పించాలని నిర్ణయించింది.ఈ క్రమంలో భాగంగా రేపు దేశవ్యాప్తంగా 259 లొకేషన్లలో మాక్ డ్రిల్స్ జరగనున్నాయి. దాదాపు 50 సంవత్సరాల తర్వాత దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్స్ చేపట్టడం గమనార్హం. కార్గిల్ యుద్ధం అప్పుడు జరిగినా.. అవి సరిహద్దు జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్ వంటి సరిహద్దు రాష్ట్రాలకే పరిమితం అయ్యాయి. ఈ సారి మాత్రం దేశవ్యాప్తంగా కీలక ప్రదేశాల్లో వీటిని నిర్వహిస్తున్నారు. 1971లో తూర్పు పాకిస్థాన్(ప్రస్తుత బంగ్లాదేశ్), పశ్చిమ పాకిస్థాన్‌లో పోరాడాల్సి రావడంతో దేశ వ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేశారు. అంతకు ముందు 1962, 65 యుద్ధాల సమయంలో కూడా నిర్వహించారు. 1971లో మాక్ డ్రిల్స్ అనుభవాన్ని సీనియర్ జర్నలిస్టు మధురేంద్ర ప్రసాద్ సిన్హా ఓ మీడియా సంస్థతో పంచుకొన్నారు. యుద్ధానికి సరిగ్గా రెండు నుంచి నాలుగు రోజుల ముందు ఈ డ్రిల్స్ మొదలుపెట్టారని.. తూర్పు పాకిస్థాన్‌లో లెఫ్టినెంట్ జనరల్ ఏఏకే నియాజీ ఢాకాలో లొంగుబాటు పత్రంపై సంతకం చేసే వరకు వీటిని కొనసాగించారన్నారు. నాడు రాత్రి 6.30 కల్లా ప్రతి ఒక్కరూ ఇళ్లకు చేరుకొనేవారన్నారు. సైరన్ వినిపించగానే ప్రతి ఒక్కరూలైట్లు ఆర్పేసి.. ఇంట్లో సురక్షిత స్థానాల్లో దాక్కొనేవారమని పేర్కొన్నారు. ఆ సమయాల్లో పెద్దగా మాట్లాడటం కూడా చేసేవారు కాదు. ఆర్కే శర్మ అనే రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి తన అనుభవాలు చెబుతూ.. నాడు సైరన్ వినిపించగానే నేలపై పడుకొని.. చెవులు గట్టిగా మూసుకొనేవారమన్నారు. 1971 యుద్ధ సమయంలో తాజ్‌మహల్‌ను కూడా కేమోఫ్లాజ్ వస్త్రంతో కప్పిపెట్టారు. నాడు ఆగ్రాలోని ఖేరియా ఎయిర్ బేస్ కూడా పాక్ లక్ష్యాల్లో ఒకటి. ఆ దేశ విమానాలు డిసెంబర్ 3వ తేదీన అక్కడ బాంబులు జారవిడిచాయి. దీనిలో ఎయిర్ బేస్ స్వల్పంగా దెబ్బతింది. యుద్ధంలో ప్రజల నైతిక స్థైర్యం దెబ్బతీయడం కోసం సాంస్కృతిక చిహ్నమైన తాజ్ మహల్‌పై పాక్ దాడి చేయొచ్చని భావించారు. దీంతో ఆ మర్నాడే దానిని శత్రువు కంటపడకుండా పరిసరాల్లో కలిసిపోయే చేసేందుకు ఒక ఆకుపచ్చటి జూట్ వస్త్రంతో కప్పిపెట్టారంట.. ఇక దాని సమీపంలోని లైట్లు మొత్తాన్ని ఆర్పేశారు. ఇలాంటి జాగ్రత్తలే ఎర్రకోట, కుతుబ్‌మినార్, జైసల్మేర్ కోట వద్ద కూడా తీసుకొన్నారు. 2వ ప్రపంచ యుద్ధ సమయంలో కూడా బ్రిటిష్ వారు జర్మనీ, జపాన్ విమానాలను తప్పుదోవ పట్టించేందుకు వెదురు పరంజాను ఏర్పాటు చేశారు.ఇప్పటికే ఈ మాక్ డ్రిల్స్‌లో పాల్గొవాలని ఆయా జిల్లా అధికార యంత్రాంగాలు, సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వాలంటీర్లు, హోమ్‌గార్డ్స్, ఎన్‌సీసీ కోర్‌ను, ఎన్ఎస్ఎస్, నెహ్రూయువ కేంద్ర సంఘటన్, కాలేజ్‌లు, స్కూల్ విద్యార్థులకు కేంద్రం పిలుపునిచ్చింది. శత్రు యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లు దూసుకొస్తున్న వేళ ప్రజల సన్నద్ధత కోసం వీటిని నిర్వహిస్తున్నారు. ఇందులో సైరన్ అత్యంత కీలకమైంది. గగనతల దాడుల హెచ్చరిక వ్యవస్థల సామర్థ్యాన్ని అంచనావేసేందుకు.వాయుసేనతో హాట్‌లైన్, రేడియో కమ్యూనికేషన్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు. కంట్రోల్‌రూమ్‌లు, షాడో కంట్రోల్ రూమ్‌ల పనితీరును పరీక్షించేందుకు.పౌరులు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి, సంక్షోభ సమయంలో పౌరులు ఆత్మరక్షణ చేసుకోవడం కోసం వీటిని నిర్వహిస్తారు.బ్లాకౌట్ సమయంలో తీసుకోవాల్సిన చర్యలను నేర్పించడం. వాటి ప్రభావాన్ని అంచనావేయడం కోసం.సివిల్ డిఫెన్స్ సర్వీసులను యాక్టివేట్ చేయడం, వాటి స్పందనను పరీక్షించడం. వీటిల్లో వార్డెన్ సర్వీసులు, అగ్నిమాపక, సహాయక, తరలింపు ఆపరేషన్లు వంటివి ఉంటాయి.ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించే ప్లాన్ల పనితీరును అంచనావేసుకోవడానికి నిర్వహిస్తారు. ఈ వ్యవస్థలు మొత్తాన్ని యాక్టివేట్ చేస్తారు.రేపటి డ్రిల్స్‌లో కీలక పరిశ్రమలు, ప్రభుత్వ భవనాలు, సైనిక ఔట్‌పోస్టులను విద్యుత్తు స్టేషన్లు, కమ్యూనికేషన్ హబ్స్ కేమోఫ్లాజ్ చేయడాన్ని కూడా సాధన చేయనున్నారు. ఉపగ్రహాలు, ఇతర గగనతల నిఘా నుంచి తప్పించడానికి ఇలా చేయనున్నారు.ఇలాంటి మాక్ డ్రిల్స్‌ను ఇటీవల కాలంలోకొన్ని దేశాలు నిర్వహించాయి. 2025 మార్చిలో తైవాన్‌లో నిర్వహించారు.

**దాదాపు 50 సంవత్సరాల తర్వాత దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్స్ చేపట్టబోతున్నా రు.భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తారా స్థాయికి చేరడంతో కేంద్రం హోం శాఖ సంక్షోభ సమయం లో పౌరులు ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో అవగా హన కల్పించాలని నిర్ణయిం చింది.ఈ క్రమం లో భాగంగా నేడు దేశవ్యాప్తంగా 259 లొకేషన్లలో మాక్ డ్రిల్స్ జరగనున్నాయి.**





### అత్యంత కఠినమైన
# జైలు మళ్లీ ఓపెన్!

న్యూయార్క్: అమెరికాలోనే అత్యంత కఠినమైన, 60 ఏళ్ల కిందట మూతపడిన అల్కాట్రాజ్ జైలును తెరవాలని అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించారు.కాలిఫోర్నియాలోని ద్వీపంలో ఉండే ఈ జైలును తెరవాలని అధికారులకు ఆదేశాలిచ్చానని ఆయన వెల్లడించారు. ఈ జైలు నుంచి అమెరికా ప్రధాన భూభాగంలోకి రావడం అత్యంత కష్టం. 'చాలాకాలంగా అమెరికా దుర్మార్గమైన, హింసాత్మకమైన.. తరచూ నేరాలు చేసే వారివల్ల ఇబ్బందులు పడుతోంది. వారు దేశానికి ఎటువంటి సేవలు అందించకపోగా బాధపెడుతున్నారు. గతంలో ఇటువంటి అత్యంత ప్రమాదకరమైన నేరగాళ్లను అత్యంత దూరంగా ఉండే జైళ్లలో ఉంచాం. ప్రజలకు ఎటువంటి హాని చేయలేనంత దూరంలో వారిని పెట్టాం. అటువంటి కఠిన శిక్షలను మళ్లీ తేవాల్సిన అవసరం ఉంది. అందుకే మళ్లీ ఆ జైలును పునర్నిర్మించి తెరవాలని జైళ్లశాఖ, న్యాయశాఖ, ఎఫ్‌బీఐ, హోంలాండ్ భద్రతా విభాగాలను ఆదేశించా' అని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్'ద్వారా ఆదివారం సాయంత్రం వెల్లడించారు.బలమైన సముద్ర అలలతోపాటు అత్యంత చల్లని పసిఫిక్ నీటితో నిండి ఉండే అల్కాట్రాజ్ జైలు ఖైదీలకు నరకం లాంటిది. 'ద రాక్' అని పిలిచే ఈ జైలులో గ్యాంగ్‌స్టర్ అల్ కాపోన్, జార్జ్ మెషీన్ గన్ కెల్లీ లాంటి కరడుగట్టిన నేరగాళ్లను ఉంచారు. దీనిపై సినిమాలూ నిర్మితమయ్యాయి. 29 ఏళ్లపాటు మనుగడలో ఉన్న ఈ జైలు నుంచి తప్పించుకోవడానికి 36 మంది 14 సార్లు ప్రయత్నించారు. వారందరూ దొరికిపోయారు. అధిక నిర్వహణ ఖర్చుల కారణంగా 1963లో ఈ జైలును మూసివేశారు. ప్రస్తుతం అల్కాట్రాజ్ ద్వీపాన్ని పర్యాటక కేంద్రంగా మార్చారు.

### మాటలతోనే
# సరిపెడతారు

**ఇది విచారకరమైన వాస్తవం**

**ఐరాస భద్రతా మండలి సమావేశంపై శశిథరూర్ కీలక వ్యాఖ్యలు**

భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులపై మంగళవారం ఐరాస భద్రతా మండలిలో ఒక క్లోజ్డ్‌డోర్ సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు.సభ్యదేశాల సంప్రదింపుల తర్వాత ఐరాస భద్రతామండలి ఎలాంటి తీర్మానాన్ని ఆమోదించదని థరూర్ అన్నారు. "పాకిస్థాన్‌ను విమర్శిస్తూ ఏ తీర్మానం చేసినా దాన్ని చైనా వీటోతో అడ్డుకుంటుంది. భారత్‌ను విమర్శిస్తూ తీర్మానం చేసినా చాలా దేశాలు అడ్డుకుంటాయి. శాంతి కోసం పిలుపునివ్వడం, ఉగ్రవాదంపై ఆందోళన వ్యక్తం చేయడం వంటి మామూలు మాటలే వినిపిస్తాయి" అని అన్నారు. ఇంతకుమించి ప్రత్యేకంగా ఏమీ ఉండకపోవచ్చని అంచనావేశారు. ఇదంతా విచారకరమైన వాస్తవమని వ్యాఖ్యానించారు.ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ కఠిన చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. అందులో సింధూజలాల ఒప్పందం అమలు నిలిపివేత కూడా ఒకటి. ఈ తరుణంలో ఐరాస సమావేశం జరిగింది. భారత్‌కు వ్యతిరేక తీర్మానం చేయాలని ఈ సమావేశంలో తొలుత పాక్ భావించింది. కానీ, ఈ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఇస్లామాబాద్ బహిరంగ అణు బెదిరింపులపై చాలా సభ్యదేశాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఇటీవల ఆ దేశం క్షిపణి పరీక్షలు నిర్వహించడాన్ని ప్రశ్నించాయి.

### దుబాయ్‌లో భారత బిలియనీర్‌కు
# జైలు .. బహిష్కరణ

దుబాయ్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ప్రముఖ వ్యాపారవేత్తగా పేరొందిన భారత బిలియనీర్ బల్వీందర్ సింగ్ సాహ్నీ కటకటాలపాలయ్యారు. మనీలాండరింగ్ వ్యవహారానికి సంబంధించిన కేసులో ఆయన దోషిగా తేలడంతో దుబాయ్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. రూ.కోటి జరిమానాతో పాటు ఆస్తుల స్వాధీనానికి న్యాయస్థానం ఆదేశించింది. అంతేగాక.. శిక్ష పూర్తయిన తర్వాత దేశం నుంచి బహిష్కరించాలంటూ తీర్పు వెలువరించింది. ఆర్ఎస్‌జీ ప్రాపర్టీ డెవలప్‌మెంట్ కంపెనీ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అయిన బల్వీందర్ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నట్లు అభియోగాలు వచ్చాయి. షెల్ కంపెనీలు, ఫోర్జరీ ఇన్‌వాయిస్‌లతో 150 మిలియన్ దిర్హమ్‌ల (భారత కరెన్సీలో దాదాపు రూ.340 కోట్ల) మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈక్రమంలోనే 2024లో బల్వీందర్, మరికొందరిపై కేసు నమోదైంది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఆర్థిక మోసాలకు పాల్పడటం నిజమేనని తేల్చింది. అనంతరం బల్వీందర్‌తో పాటు ఇతర నిందితులను దోషులుగా తేల్చుతూ దుబాయ్ ఫోర్త్ క్రిమినల్ కోర్టు తీర్పు వెలువరించింది.బల్వీందర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష ఖరారు చేసింది. 5 లక్షల దిర్హమ్‌ల జరిమానా విధించింది. ఆర్థిక నేరాలకు పాల్పడినందుకు గానూ.. బిలియనీర్ నుంచి 150 మిలియన్ దిర్హమ్‌ల (దాదాపు రూ.340 కోట్ల) విలువైన ఆస్తులను జప్తు చేయాలని కోర్టు ఆదేశించింది. శిక్ష పూర్తయిన తర్వాత బల్వీందర్‌ను దేశం నుంచి పంపించాలని స్పష్టంచేసింది. ఈ కేసులో శిక్ష పడిన ఇతర నిందితుల్లో ఈ బిలియనీర్ పెద్ద కుమారుడు కూడా ఉన్నారు.53 ఏళ్ల బల్వీందర్.. రాజ్ సాహ్నీ గ్రూప్ (ఆర్ఎస్‌జీ) పేరుతో ప్రాపర్టీ డెవలప్‌మెంట్ కంపెనీని స్థాపించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి.

**బెల్లంపల్లి, మే 6, (జనంసాక్షి)**

బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేస్తున్న విద్యార్థులు చేరాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన అడ్మిషన్ల పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఈ మేరకు అధ్యాపక బృందం క్యాంప్ ఆఫీసుకు తరలి వెళ్ళింది. అన్ని హంగులతో కొనసాగుతున్న బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరంలో నూతన కోర్సులు ప్రారంభమయ్యాయని, వాటిని సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ కోరారు. అర్హత, అనుభవజ్ఞులైన అధ్యాపకులు గల బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ



కళాశాల విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దోస్త్ వెబ్సైట్ ద్వారా బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లను అందజేస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. కళాశాలలో బిఏ, బీకాం, బీఎస్సీ ఎంపీసీ, బిజెడ్సి కోర్సులతో పాటు ఈ ఏడాది కొత్తగా బీకాం బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ ఇన్సూరెన్స్, బీకాం టాక్సేషన్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తమ కళాశాలలో అందిస్తున్న వివిధ కోర్సులు డిగ్రీ పూర్తి కాగానే ఉపాధి మార్గాలను చేరువ చేస్తాయని వివరించారు. మరిన్ని వివరాలకు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా జరిగిన ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బొంకూరి ప్రవీణ్ కుమార్, సీనియర్ అధ్యాపకులు గజెల్లి మోహన్, డాక్టర్ కొండగొర్ల చంద్రశేఖర్, డాక్టర్ కంబాల మురళీకృష్ణ, అధ్యాపకురాలు కూనురాజుల సమ్మక్క , టిఎస్కేసి ఫుల్ టైం మెంటార్ పులి సుమన్ పాల్గొన్నారు. డిగ్రీ అడ్మిషన్ దోస్తు సందేహాలకు 9959269975 ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ గారిని సంప్రదించాలని తెలిపారు

# చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్టు

**నిర్మల్ బ్యూరో, మే 06 (జనంసాక్షి)**

: మోటార్ సైకిల్ పై వెళ్తున్న దంపతులను అడ్డగించి, బంగారు చైన్, పుస్తెల తాడు అపహరించిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఏఎస్పి అవినాష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం లో అయన మాట్లాడుతూ గత నెల ఏప్రిల్ 30వ తేదీన రాత్రి ఇద్దరు దంపతులు మోటార్ సైకిల్ పై నిర్మల్ నుంచి వెంగ్వాపేట కు వెళ్తున్న క్రమంలో, కావేరి కుటీర్ వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వారి మోటార్ సైకిల్ ను అడ్డగించి, బాదితుని మెడలోని బంగారు చైన్ ను, బాదిత మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడు అపహరించి, వెంట తెచ్చుకున్న ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. దీంతో బాధితు ని ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న నిర్మల్ రూరల్ పోలీసులు చైన్ స్నాచింగ్ దొంగల కోసం విస్తృతంగా గాలించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మంజులాపూర్ లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, అనుమానస్పదంగా వచ్చుచున్న ఇద్దరు వ్యక్తులు అక్కడి పోలీసులని చూసి పారి పోయే ప్రయత్నం చేయగా వారిని పోలీసులు పట్టుకొని విచారించగ వారు మహరాష్ట్ర లోని నాందేడ్ జిల్లా పార్భని,ఇంకొకరు తల్వేద గ్రామానికి చెందిన అలిశెట్టి శ్రీనివాస్ లను, పూర్తి విచారణ లో




ఫిర్యాది మెడలోని బంగారు చైన్ ఇంకా మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడు చోరీ చేసింది తామేనని నిందితులిద్దరూ అంగీకరించారు. వారి వద్ద నుంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడు, ఒక తులం బంగారు గొలుసును స్వాధీనం చేసుకొన్నారు, ఆ ఇద్దరినీ రిమాండ్ కు తరలిచడం జరుగుతుంది అని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ సంతోష్, సత్యనారాయణ లను అభినందించారు. ఈ సమావేశం లో నిర్మల్ రూరల్ సిఐ కృష్ణ, నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబద్రి సిబ్బంది లు పాల్గొన్నారు. ఈ కేసులో త్వరగా స్పందించి నిందితుల్ని పట్టుకోవటం లో ప్రతిభ చూపిన రూరల్ సిఐ మున్నూరు కృష్ణ, నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబద్రిని, సిబ్బందిని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అభినందించారు.

# అధునాతన డయాగ్నస్టిక్ సేవలే లక్ష్యం

## అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్, అపోలో వన్ ప్రారంభం

**హైదరాబాద్, మే 6 (జనంసాక్షి):**

అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఆధునిక డయాగ్నస్టిక్ సేవలందించే అపోలో వన్ ఆధ్వర్యంలో బెంగుళూరులోని ఎలక్ట్రానిక్ సిటీలో ఏర్పాటు చేసిన అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్, అపోలో వన్ హాస్పిటల్‌ను అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి భారత మాజీ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు ప్రకాశ్ పదుకొణే, ప్రముఖ కన్నడ నటి సప్తమి గౌడ విచ్చేశారు. జాతీయ చలనచిత్ర



అవార్డు గ్రహీత, గాయకుడు రాహుల్ దేశ్‌పాండే వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగీతా రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమన్నారు. తద్వారా కీలకమైన సమయాలలో ఉత్తమ వైద్య సేవలు అందేలా చేయనున్నామని చెప్పారు. అపోలో క్రెడిల్ కు బెంగళూరులో ఇది 7వ కేంద్రం, దేశవ్యాప్తంగా 19వ కేంద్రం అన్నారు. ఇది 50 పడకలతో కూడిన హాస్పిటల్ అన్నారు. మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించామని తెలిపారు. ఈ ఆధునిక కేంద్రంలో లగ్జరీ ప్రసవ సదుపాయాలు, గైనకాలజీ, ఫీటల్ మెడిసిన్, లెవెల్ ఐఐఐ ఎన్ఐసీయూ, ఈ-ఎన్ఐసీయూ, పీఐసీయూ, అధునాతన శస్త్రచికిత్సా సేవలు, మాతృ శిశు అత్యవసర చికిత్స కేంద్రం, హై-రిస్క్ గర్భధారణల కోసం 24/7 రక్త నిల్వ కేంద్రం ఉన్నాయని తెలిపారు. పిల్లల కోసం జనరల్ పీడియాట్రిక్స్‌తో పాటు శస్త్రచికిత్స, న్యూరాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ వంటి సేవలు కూడా అందుబాటులో కలవన్నారు. మాతృ ఆరోగ్య సేవలతో పాటు మహిళలకు నాన్ హెల్త్ చెక్ అప్ ప్యాకేజీలు కూడా ఉన్నాయన్నారు.

# భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా ఏర్పాట్లు

## సరస్వతీ పుష్కరాలపై మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు సమీక్ష

**మంథని, (జనంసాక్షి)**

సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలను అందించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రులు కొండా సురేఖ, దుద్దిల్ల శ్రీధర్ బాబులు ఆదేశించారు. మే 15 నుంచి 26వ తేదీ వరకు మంథని నియోజక వర్గం పరిధిలోని కాళేశ్వరం వద్ద నిర్వహించనున్న సరస్వతి పుష్కరాలపై మంగళవారం దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు



అందించేందుకు ప్రణాళికలపై చర్చించారు. మహాబలిపురం నుంచి వచ్చిన సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠా పనుల పురోగతిని సమీక్షించారు. దేవాదాయ శాఖ, జిల్లా యంత్రాంగం, ఆలయ అధికారులు, అర్చకులు, సలహా బోర్డుతో సమన్వయంగా పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు.

# సీఎస్ రామకృష్ణరావుకి అపార అనుభవం

## మంత్రి సురేఖ అభినందనలు

**హైదరాబాద్ బ్యూరో (జనంసాక్షి)**

తెలంగాణ నూతన సీఎస్ గా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐఏఎస్ రామకృష్ణరావుకి రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అభినందనలు తెలిపారు. ఆయన సీఎస్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మంత్రి సురేఖను సెక్రటేరి



యట్ లోని ఆమె ఛాంబర్ లో ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఆయన్ను సన్మానించి... సురేఖ, సీఎస్ రామకృష్ణరావుకి కంగ్రాట్స్ తెలిపారు. అనంతరం మినిస్టర్ సురేఖ మాట్లాడుతూ... రాష్ట్ర పరిపాలన విభాగం లో, తెలంగాణ ఆర్థిక కార్యకలాపాల్లో సీఎస్ రామకృష్ణరావుకి ఉన్న అపార అనుభవం ప్రస్తుతం రాష్ట్ర పురోగతి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అటువంటి సీనియర్ ఐఏఎస్ నేతృత్వంలో పరిపాలన సంబంధిత అంశాల్లో రాష్ట్రంలోని అన్ని విభాగాలు ముందుకు వెళుతాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు. త్వరలో తమ ఎండోమెంటు డిపార్టుమెంటు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కాళేశ్వరం సరస్వతీ నది పుష్కరాలు సమర్థవంతంగా నిర్వహించేందుకు రామకృష్ణరావు కృషి చేయాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖకి రామకృష్ణరావు ధన్యవాదాలు తెలిపారు.

# బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనపై సమీక్ష.

**నస్పూర్, మే 6, (జనం సాక్షి):**

శ్రీరాంపూర్ ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో మంగళవారం సింగరేణి ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు,ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇందారం, శ్రీరాంపూర్ ఉపరితల గనుల అధికారులు,ఓబి కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు.శ్రీరాంపూర్ ఉపరితల గని వార్షిక ఓబి ఉత్పత్తి లక్ష్యం 320 లక్షల క్యూబిక్ మీటర్లు,ఇందారం ఉపరితల గనికి 240 లక్షల క్యూబిక్ మీటర్లుగా నిర్దేశించబడ్డాయని తెలిపారు.ఈ లక్ష్యాలను తప్పనిసరిగా సాధించేందుకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.ఓబి తొలగింపు అధికంగా ఉంటే బొగ్గు ఉత్పత్తి,రవాణా కూడా మెరుగుపడుతుందని,కాబట్టి ఓబి కాంట్రాక్టర్ల ప్రతినిధులు తగినంత యంత్ర సామాజిని సమకూర్చుకోవాలని,భారీ యంత్రాల పని గంటలను




పెంచి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు.అలాగే బొగ్గు ఉత్పత్తి పరంగా శ్రీరాంపూర్ ఉపరితల గనికి వార్షికోత్పత్తి లక్ష్యం 35 లక్షల టన్నులు,ఇందారం ఉపరితల గనికి 15 లక్షల టన్నులుగా నిర్దేశించబడిందని తెలిపారు.ఈ లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్క అధికారి,ఉద్యోగి పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఎస్ ఓటు జిఎం ఎన్ సత్యనారాయణ,ప్రాజెక్టు అధికారులు టి శ్రీనివాస్, ఎ వెంకటేశ్వర రెడ్డి,సర్వే అధికారులు రామ్మోహన్, దావూద్,సిఆర్ఆర్,జివిఆర్,వరాహ ఓబి కాంట్రాక్టర్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# గాలి, వాన భీబిత్సం..

## తడిసి ముద్దయిన వరిధాన్యం

**దస్తురాబాద్, మే 06 (జనంసాక్షి):**

మండల కేంద్రంలోని పలు గ్రామాలలో రాత్రి ఈదురు గాలులు, అకాల వర్షం వల్ల తడిసి ముద్దయినా వరి ధాన్యం. నిన్నటి రాత్రి



వీచిన ఈదురు గాలులకు, వర్షానికి వరి ధాన్యం నిల్వ ఉన్న ధాన్యం తడిసి ముద్దయిందని రైతులు వాపోతున్నారు. వరి అమ్ముడు పోయే సమయంలో ఇలా జరగడం రైతుకి తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని బాధితులు తెలిపారు. అలాగే రేవోజిపేట్ గ్రామానికి చెందిన కోలా భూచ్చవ్వ కి సంబందించిన గొర్ల కోరకు నిర్మించిన రేకుల షెడ్డు గాలి వానకి కుప్ప కూలిపోయింది. దీనివల్ల బాధితురాలుకి చాలా వరకు ఆర్థిక నష్టం కలిగిందని తెలిపారు.

# బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

**నిర్మల్ రూరల్, ఏప్రిల్ 6 (జనంసాక్షి)**

నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని బోసి గ్రామంలో బాల్య వివాహం జరగబో తున్న సమాచారం అందుకున్న



బాలల పరిరక్షణ శాఖ అధికా రులు సకాలంలో స్పందించి వివాహాన్ని అడ్డుకున్నారు.బోసి గ్రామానికి చెందిన14ఏళ్ల మైనర్ బాలికకు వివాహం జరుగుతున్నట్టు సమాచారం అందడంతో బాలల సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. ముధోల్ సీఐ మల్లేష్,ఎస్సై, సీడిపిఒ సరోజినీ, ఏసీడిపిఒ నాగలక్ష్మి,బాల పరిరక్షణ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు అక్కడికి చేరుకొని వివాహాన్ని నిలిపివేశారు.ఇరు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి, బాల్యవివాహం వల్ల ఏర్పడే దుష్పరిణామాలను వివరించారు.అనంతరం ఇద్దరు కుటుంబాల నుంచి కూతురు మేజర్ అయ్యే వరకు

వివాహం జరిపించబోమని హామీ పత్రాలు రాసుకున్నారు.ఈ సంఘటనపై స్పందించిన స్థానికులు,బాలిక భవిష్యత్తు దృష్ట్యా చర్యలు తీసుకున్న అధికారులకు అభినందనలు తెలిపారు.

# యాసిఫ్ పాషకు గౌరవ డాక్టరేట్

**రాయపర్తి,మే 06(జనంసాక్షి):**

కృషి ఉంటే మనుషులు ఋషుల వుతారు అన్న పదాన్ని నిజం చేశారు మహ్మద్ యాసిఫ్ పాషా.అతి చిన్న వయస్సులో ఒక మీడియా సంస్థ ను ఏర్పాటు చేసి ఎందరో నిరుద్యోగులను జర్నలిస్ట్ లుగా తీర్చిదిద్ది సమాజంలో జరిగే అన్యాయాలను వెలుగులోకి తీసుకువస్తూ మీడియా రంగంలో సంచలనాలను సృష్టిస్తున్న టీజీ 24 టీవి ఫౌండర్,సీఈఓ మహ్మద్ యాసిఫ్ కు హెూప్ థియలాజికల్ యూనివర్సిటీ,డాక్టర్ ఆఫ్ బెస్ట్ మీడియా ఎడిటర్ ఇన్ చీఫ్ గౌరవాన్ని హైదరాబాద్ లోని చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గాన సభ



లో అతిథులు మాజీ మంత్రి వేణుగోపాల్ చారి,రిటైర్డ్ జడ్జి మధుసూదన్,మాజీ ఐపిఎస్ అధికారి చంద్రవర్ధన్ ఆధ్వర్యం లో అందించారు.హెచ్ టి యు నేషనల్ డైరెక్టర్ పండు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ యాసిఫ్ పాత్రికేయతను ప్రశంసించారు.సమాజానికి స్పష్టమైన ,నిష్పక్షపాతమైన ,సమగ్ర సమాచారాన్ని అందించడంలో ఆయన చేసిన కృషి ప్రశంసనీయం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సెక్రటరీ సంజీవ రావు,హెచ్ టి యు చైర్మన్ డేవిడ్ సాల్,హెచ్ టి యు డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి,డాక్టర్ వంశీకృష్ణ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# 15 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

## గాజులరామారంలో ఆక్రమణలను తొలగించిన హైడ్రా

**హైదరాబాద్, మే 06 (జనంసాక్షి)**

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం విలేజ్‌లో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. సర్వే నంబరు 354లో ఉన్న ప్రభుత్వ భూమిలో కబ్జాలను హైడ్రా మంగళవారం తొలగించింది. ఇందులో కేఎల్‌యూనివర్సిటీ వారు ఆక్రమించిన 5 ఎకరాల భూమి కూడా ఉంది. వాస్తవానికి ఈ భూమిని రాజీవ్‌స్వగృహ నిర్మాణాలకు గాను రాష్ట్ర ప్రభుత్వం 2009లో కేటాయించింది. అక్కడ నిర్మాణాలు రాకపోవడంతో స్థానికంగా నాయకులుగా చెలామణి అవుతున్నవారి కన్ను ఈ భూమిపై పడింది. అంతే ఎవరికి వారు



ప్రహరీలు నిర్మించుకుని.. షెడ్డులు వేసి ఆక్రమణలకు పాల్పడితే.. స్థానికుల నుంచి హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులందాయి. ప్రభుత్వ భూమిని ఎకరాలకొద్దీ ప్రహరీలు నిర్మించి ఆక్రమించుకుంటున్నారని.. ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టింది. హైడ్రా అదికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వేచేసి ప్రభుత్వభూమి అని నిర్ధారించుకున్న తర్వాత నివేదికను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారికి అందజేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన శ్రీ రంగనాథ్‌గారు ఆక్రమణలు తొలగించి వెంటనే ప్రభుత్వభూమి పేరిట బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలను మంగళవారం కూల్చేసిన అదికారులు అక్కడ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అలాగే హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమిగా బోర్డులు పెట్టారు. కాటేదాన్‌లో కూడా హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఇందిరా సొసైటీ కాలనీలోని రహదారులను ఆక్రమించిన వారి కట్టడాలను తొలగించింది. రహదారులను ఆక్రమించి.. లేఔట్లలోని ప్లాట్లను కబ్జా చేసిన వారి ప్రయత్నాలను అడ్డుకుంది.

# ఐపీఎల్ బెట్టింగ్ పై పోలీసుల కొరడా



**చేర్యాలలో టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడులు**

**నగదు, సెల్ ఫోన్లు, మోటార్ సైకిల్ లు స్వాధీనం**

**చేర్యాల (జనంసాక్షి) మే 06 :**

ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతున్న స్తావారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారులు, చేర్యాల పోలీసులు దాడులు నిర్వహించి నాలుగు మొబైల్ ఫోన్ లు, మూడు మోటార్ సైకిల్లు, 76 వేల నాలుగు వందల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు చేర్యాల సిఐ ఎల్. శ్రీను తెలిపారు. చేర్యాల పట్టణంలోని చెరువు సమీపంలో శ్రీనివాస్, శివప్రసాద్, చంద్రబాబు, నవీన్ అనే వ్యక్తులు కలసి ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు చేర్యాల పోలీసులు వెళ్లి దాడులు నిర్వహించి ఆ వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మరికొంతమంది పరిపోయినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారి వద్ద నుండి 76,400 రూపాయలు, నాలుగు మొబైల్ ఫోన్ లు, మూడు మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకొని చేర్యాల పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ ఒక ప్రకటనలో తెలిపారు. మరికొంత మంది నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. ఐపీఎల్ బెట్టింగ్ గ్యాంబ్లింగ్ పేకాట తదితర చట్ట వ్యతిరేకత కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామాలలో, పట్టణంలో ఎవరైనా పేకాట గంజాయి ఇతర మత్తు పదార్థాలు బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినట్లయితే వెంటనే డయల్ 100 లేదా చేర్యాల పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో చేర్యాల ప్రొఫెషనల్ ఎస్ఐ సమత హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ధోనీ కోసమే బీసీసీఐ రూల్ : గావస్కర్



గత ఏడాది ఐపీఎల్ మెగా వేలానికి ముందు ప్రవేశపెట్టిన అన్‌క్యాప్డ్ ప్లేయర్ రూల్‌పై దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ తీవ్ర విమర్శలు గుప్పించాడు. ఈ నిబంధన చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ ఎంఎస్ ధోనీ కోసమే బీసీసీఐ రూపొందించిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ రూల్ ప్రకారం, వరుసగా ఐదేళ్లు అంతర్జాతీయ క్రికెట్ ఆడని ఆటగాళ్లను అన్‌క్యాప్డ్ కేటగిరీలో రిటైన్ చేసుకోవచ్చు, గరిష్ఠంగా రూ.4 కోట్ల వరకు చెల్లించవచ్చు. ఈ రూల్ ద్వారా చెన్నై జట్టు గణనీయంగా లాభపడింది, ధోనీ వంటి స్టార్ ఆటగాడిని కేవలం రూ.4 కోట్లకే దక్కించుకుంది. ఈ నిబంధన ధోనీ కోసమే తీసుకొచ్చారా అనే విమర్శలు వెల్లువెత్తాయి. అదే విధంగా, రాజస్థాన్ రాయల్స్ జట్టు సందీప్ శర్మను కూడా అన్‌క్యాప్డ్ హోదాలో రిటైన్ చేసుకుంది. మొత్తం 12 మంది ఆటగాళ్లను ఈ విధంగా రిటైన్ చేసుకోగా, వీరిలో అంతర్జాతీయ క్రికెట్ ఆడిన ఐదారుగురు లాభపడ్డారు. గావస్కర్, ఐపీఎల్‌లో యువ ఆటగాళ్లకు చెల్లించే డబ్బుపై ఆంక్షలు అవసరమని పేర్కొన్నాడు. వేలంలో కోట్ల రూపాయలకు అమ్ముడైన ఆటగాళు తర్వాత ఆటలో విఫలమవుతున్నారని, ఇలాంటి భారీ మొత్తాలు వారి ఏకాగ్రత, ఆటపట్ల చిత్తశుద్ధిని దెబ్బతీస్తున్నాయని విమర్శించాడు. ఈ డబ్బు ఆటగాళ్లలో ఆడాలనే కసిని చంపేస్తుందని, ఐపీఎల్ యాజమాన్యం ఈ విషయంపై దృష్టి సారించాలని సూచించాడు.

గత ఏడాది మెగా వేలంలో ఆటగాళ్లపై కనకవర్షం కురిసింది. రూ.27 కోట్లతో రిషభ్ పంత్‌ను లక్నో సూపర్ జెయింట్స్ దక్కించుకుంది, ఐపీఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. అయితే, పంత్ తన ధరకు తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు, కేవలం ఒక అర్ధ సెంచరీ మాత్రమే సాధించాడు. దీంతో లక్నో జట్టు ప్లే-ఆఫ్ ఎలిమినేషన్ అంచున నిలిచింది. పంత్‌తో పాటు, భారీ ధరలకు కొనుగోలైన ఇతర ఆటగాళ్లు కూడా నిరాశపరిచారు. రంజీ మ్యాచ్‌లు కూడా ఆడని కొందరు ఆటగాళ్లపై కోట్లు కుమ్మరించడంతో, వారిలో కొందరు ఘోరంగా విఫలమయ్యారు. ఐపీఎల్‌లో డబ్బు ప్రవాహం వల్ల ఇలాంటి ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని గావస్కర్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఐపీఎల్ యాజమాన్యం భవిష్యత్తులో ఈ విషయంపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.



## ఉత్తమ దర్శకునిగా డా.వేణుగోపాలకృష్ణ

నిర్మల్ బ్యూరో, మే 06 (జనంసాక్షి) : ప్రముఖ వైద్యులు డా.వేణుగోపాలకృష్ణ ఉత్తమ వైద్యునిగా, ఎన్నో జాతీయ, రాష్ట్ర స్థాయి, జిల్లా అవార్డులు పొందారు. అదిలాబాద్ ఉట్నూరు, ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ గా మంచి గుర్తింపు పొందారు. నిర్మల్ ఆర్‌ఎంవోగా కరోనా వారియర్‌గా జాతీయ పురస్కారం పొందారు. కళారంగంలోనూ కవిగా, రచయితగా, లఘు చిత్రాల దర్శకునిగా డా.వేణుగోపాలకృష్ణ ఉత్తమ సేవలందిస్తున్నారు. స్వీయ దర్శకత్వంలో నటించిన ప్రేమతో నాన్నకి 4 నంది పురస్కారాలు పొందారు డా. వేణుగోపాలకృష్ణ. కూతురు డా.సుహాసిని హైద్రాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన టాలీవుడ్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రేమతో నాన్న ప్రత్యేకంగా ప్రదర్శించబడింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకునిగా డా.వేణు గోపాలకృష్ణ అవార్డులు పొందారు. ఈ సందర్భంగా బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు ఆయనను అభినందించారు.

# ఈ సీజన్ మాకు కలిసి రాలేదు

- హోమ్ గ్రౌండ్ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి
- పిచ్‌లను సరిగ్గా అంచనా వేయకపోయారు
- సన్‌రైజర్స్ హెడ్ కోచ్ డానియల్ వెటోరి

ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పోరాటం ముగిసింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో సోమవారం ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దవ్వడంతో ఆరెంజ్ ఆర్మీ ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా తప్పుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 133 పరుగులు చేసింది. తర్వాత వర్షం రావడంతో సన్‌రైజర్స్ బ్యాటింగ్ సాధ్యం కాలేదు. ఈ సీజన్‌లో 11 మ్యాచ్‌లు ఆడిన ఆరెంజ్ ఆర్మీ కేవలం మూడింట్లో మాత్రమే గెలిచి ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్ అనంతరం సన్‌రైజర్స్ హెడ్ కోచ్ డానియల్ వెటోరి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తమ జట్టు వైఫల్యానికి గల కారణాలను చెప్పాడు. ఈ సీజన్ తమకు కలిసి రాలేదన్నాడు. హోమ్ గ్రౌండ్ పరిస్థితులు భిన్నంగా ఉండటం, నిలకడగా రాణించకపోవడం, బౌలింగ్, ఫీల్డింగ్ వైఫల్యం.. పిచ్‌లను సరిగ్గా అంచనా వేయకపోవడం ఈ సీజన్‌లో తమ పతనాన్ని శాసించాయని వెటోరి తెలిపాడు. 'ఈ ఏడాది ఉప్పల్ గ్రౌండ్ పరిస్థితులు మేం ఊహించిన విధంగా లేవు. గతేడాది ఇక్కడ భారీ స్కోర్లు నమోదయ్యాయి. కానీ ఈ సారి పిచ్‌లు ఫాస్ట్ బౌలర్లకు సహకరించాయి. ఇది మా బ్యాటింగ్ శైలికి ప్రతికూలంగా మారింది. అదే సమయంలో స్పిన్నర్లకు సహకరించలేదు. కొత్త బంతిని కొట్టడం బ్యాటర్లకు ఇబ్బందిగా మారింది. సమష్టిగా రాణించడంలోనూ విఫలమయ్యాం. నిలకడైన ప్రదర్శన చేయలేకపోయాం. పిచ్ కండిషన్స్‌ను సరిగ్గా అంచనా వేయలేకపోయాం. ఏ రోజు ఏ తరహా ఆట అవసరమో తెలుసుకొని ఆడలేకపోయాం. ప్రత్యర్థి బౌలర్ల వ్యూహాలకు తగ్గట్టుగా బ్యాటింగ్ చేయలేకపోయాం. గత సీజన్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ.. ఈ సీజన్‌లో నిలకడగా ఆడలేకపోయారు. ముఖ్యంగా స్పిన్ విభాగం ఆశించిన స్థాయిలో రాణించలేక పోయింది. పేస్ విభాగం కొన్ని మ్యాచ్‌ల్లో రాణించినప్పటికీ.. నిలకడ కనబర్చలేదు. కొన్ని మ్యాచ్‌ల్లో కీలక క్యాచ్‌లు చేజార్చడం విజయవకాశాలు దెబ్బతీసింది. ఢిల్లీతో కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో వర్షం అడ్డంకిగా మారింది. మా బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ఢిల్లీని 133 పరుగులకే కట్టడి చేసింది. కానీ వర్షం మా ఆశలపై నీళ్లు చల్లింది. మహమ్మద్ షమీకి ఈ సీజన్ చాలా కష్టంగా గడిచింది. కానీ అతను మెరుగైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నించాడు.'అని వెటోరి చెప్పుకొచ్చాడు.






## సిరాజ్‌కు రోహిత్ శర్మ సర్‌ప్రైజ్ గిఫ్ట్

2025 ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ మరో కీలక పోరుకు సిద్ధమైంది. సొంత గడ్డ వాంఖడే స్టేడియంలో మంగళవారం గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. ఈ నేపథ్యంలో ఇరు జట్ల ఆటగాళ్లు ప్రాక్టీస్ సెషన్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయి తే, ఈ మ్యాచ్‌కు ముందు ముంబై స్టార్ ఆటగాడు రోహిత్ శర్మ, గుజరాత్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు ఓ ప్రత్యేక బహుమతిని అందించాడు. రోహిత్, సిరాజ్‌కు వజ్రాల తో అలంకరించిన ఉంగరాన్ని బహుకరించాడు. 2024 టీ20 వరల్డ్ కప్‌లో భారత జట్టు ఛాంపియన్‌గా నిలిచిన సందర్భం గా, జట్టు సభ్యులకు బీసీసీఐ ప్రత్యేక వజ్రపు ఉంగరాలను బహుకరించింది. ఈ ఉంగరాలు నమన్ అవార్డ్స్ ఈవెంట్‌లో అందరికీ అందజేయగా, సిరాజ్ ఆ ఈవెంట్‌కు హాజరు కాలేకపోయాడు. దీం తో అతనికి ఉంగరం అందించే కార్య క్రమం వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా, ముంబై-గుజరాత్ మ్యాచ్‌కు ముందు రోహిత్ శర్మ, టీమ్ ఇండియా కెప్టెన్‌గా సిరాజ్‌కు ఈ ఉంగరాన్ని అందజేశాడు. ఈ హృదయస్పర్శి క్షణాన్ని బీసీసీఐ తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేస్తూ, "టీ20 వరల్డ్ కప్‌లో సిరాజ్ అందించిన సేవలకు గుర్తుగా కెప్టెన్ రోహిత్ నుంచి ప్రత్యేక రింగ్ అందుకున్నాడు," అని పేర్కొంది.

18 క్యారెట్ల బంగారంతో రూపొందించిన ఈ ఉంగరంపై ఆటగాడి పేరు, జెర్సీ నంబర్ చెక్కబడి ఉన్నాయి. 2024 జూన్ 30న బర్బడోస్‌లో జరిగిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో భారత్, సౌతాఫ్రికా పై 7 పరుగుల తేడాతో విజయం సాధించి, 17 ఏళ్ల తర్వాత టీ20 టైటిల్‌ను అందుకుంది. ఈ విజయంలో సిరాజ్ కీలక పాత్ర పోషించాడు. ఈ ఉంగరాలు ఆ విజయానికి గుర్తుగా జట్టు సభ్యులకు అందించబడ్డాయి. ప్రాక్టీస్ సెషన్స్‌లో ఇరు జట్ల ఆటగాళ్లు సరదాగా కనిపించారు. ఈ సందర్భంగా ఫొటోలు, వీడియోలను ఫ్రాంచైజీలు సోషల్ మీడియాలో షేర్ చేశాయి. అయితే, ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉందని వాతావరణ సూచనలు తెలిపాయి. నిన్న సన్‌రైజర్స్ హైదరాబాద్-ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ కూడా వర్షం కారణంగా రద్దైంది.

# ఆర్‌సీబీ అభిమానులకు బ్యాడ్ న్యూస్

### ప్లే ఆఫ్స్‌కు రొమారియో షెపర్డ్ దూరం!



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)అభిమానులకు బ్యాడ్ న్యూస్. ఆ జట్టు విధ్వంసకర బ్యాటర్, వెస్టిండీస్ క్రికెటర్ రొమారియో షెపర్డ్ జట్టుకు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కీలకమైన ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌కు ముందే రొమారియో షెపర్డ్ జట్టును వీడుతాడని వార్తలు వస్తున్నాయి. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో షెపర్డ్ విధ్వంసం సృష్టించాడు. 16 నిమిషాలే క్రీజులో ఉన్న ఈ విండీస్ ఆటగాడు 14 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లతో 53 పరుగులతో భీభత్సం సృష్టించాడు.అతని ధాటికి ఆర్‌సీబీ చివరి 2 ఓవర్లలో 54 పరుగులు చేసింది. రొమారియో షెపర్డ్ విధ్వంసకర బ్యాటింగ్, యశ్ దయాల్ సంచలన బౌలింగ్‌తో ఈ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 2 పరుగుల తేడాతో గెలిచి ప్లే ఆఫ్స్ బెర్త్‌కు చేరువైంది. మరో విజయం సాధిస్తే ఆ జట్టు టాప్-2 ప్లేస్ కూడా ఖరారు అవుతోంది. ఈ మ్యాచ్‌తో రొమారియో షెపర్డ్ ఎంత కీలకమైన ఆటగాడో అందరికి తెలిసొచ్చింది.ఆరంభంలో బెంచ్‌కే పరిమితమైన షెపర్డ్.. లియామ్ లివింగ్ స్టోన్ వైఫల్యంతో తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జట్టుకు కీలక ఆటగాడిగా మారాడు. అయితే ఇంగ్లండ్, ఐర్లాండ్‌తో వన్డే సిరీస్‌ల కోసం వెస్టిండీస్ జట్టు ఆ దేశాల్లో పర్యటించనుంది. ఈ రెండు సిరీస్‌లకు రొమారియో షెపర్డ్ ఎంపికయ్యాడు. అతనితో పాటు గుజరాత్ టైటాన్స్ ప్లేయర్ షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ కూడా ఎంపికయ్యాడు. మే 21-25 మధ్య ఐర్లాండ్‌తో వెస్టిండీస్ మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఎన్నడూ లేని విధంగా సమష్టి ప్రదర్శనతో టైటిల్ దిశగా దూసుకెళ్తోంది. ఇప్పటి వరకు 11 మ్యాచ్‌లు ఆడిన ఆర్‌సీబీ 8 విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆర్‌సీబీలోని ఆటగాళ్లంతా సూపర్ ఫామ్‌లో ఉన్నారు.

# కెప్టెన్సీ ఒత్తిడి బ్యాటింగ్‌పై ప్రభావం చూపింది: విరాట్ కోహ్లీ




టీమ్ ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ క్రికెట్‌లో అనేక రికార్డులు సృష్టించి, అసాధ్యమనుకున్న ఘనతలు సాధించాడు. బ్యాటర్‌గా అద్భుత విజయాలు అందుకున్న కోహ్లీ, కెప్టెన్‌గా కూడా రాణించాడు. గతంలో టీమ్ ఇండియాతో పాటు ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టును నడిపించాడు. అయితే, కొంత కాలానికి అతడు కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. ఈ నిర్ణయం వెనుక కారణాలను కోహ్లీ తాజాగా వెల్లడించాడు. 2021 టీ20 వరల్డ్ కప్ తర్వాత టీ20 కెప్టెన్సీ నుంచి, ఆ తర్వాత సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్ ఓటమి అనంతరం టెస్టు కెప్టెన్సీ నుంచి, అలాగే 2021 ఐపీఎల్ సీజన్ తర్వాత ఆర్సీబీ కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. ఈ నిర్ణయం అప్పట్లో సంచలనం రేపింది. 'ఆర్సీబీ బోల్డ్ డైరీస్' పాడ్‌కాస్ట్‌లో తాజాగా మాట్లాడిన కోహ్లీ, కెప్టెన్సీ వదులుకోవడానికి కారణాలను వివరించాడు.

కెప్టెన్సీ ఒత్తిడి తన బ్యాటింగ్‌పై ప్రభావం చూపిందని, అందుకే బ్యాటింగ్‌లో రాణించడానికి కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు చెప్పాడు. "2016-2019 మధ్య నేను తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాను. టీమ్ ఇండియాకు 7-8 ఏళ్లు, ఆర్సీబీకి 9 ఏళ్లు కెప్టెన్‌గా ఉన్నాను. ప్రతి మ్యాచ్‌లో నాపై భారీ అంచనాలు ఉండేవి, ఇది ఒత్తిడిని తెచ్చింది.


ఈ బాధ్యతలు పక్కనపెట్టి, సంతోషంగా క్రికెట్ ఆడాలనుకున్నాను. అందుకే కెప్టెన్సీ వదులుకున్నాను. ఇప్పుడు స్వేచ్ఛగా ఆడుతూ, ఈ సీజన్‌లో నిలకడగా పరుగులు సాధిస్తున్నాను," అని కోహ్లీ తెలిపాడు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో కోహ్లీ అద్భుతంగా రాణిస్తున్నాడు. 11 మ్యాచ్‌ల్లో 63.13 సగటుతో 505 పరుగులు చేసి, 7 అర్ధ సెంచరీలతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆరెంజ్ క్యాప్ కూడా అతడి సొంతం.

# కోహ్లీ ఓ పెద్ద జోకర్

- అతని ఫ్యాన్స్ అతని కంటే పెద్ద జోకర్లు
- సింగర్ రాహుల్ వైద్య సంచలన వ్యాఖ్యలు



టీమ్ ఇండియా స్టార్ బ్యాటర్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీపై బాలీవుడ్ సింగర్ రాహుల్ వైద్య సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో కోహ్లీని 'జోకర్' అని, అతని అభిమానులను 'అతని కంటే పెద్ద జోకర్లు' అని పేర్కొన్నాడు. కోహ్లీ తనను ఇన్‌స్టాగ్రామ్‌లో బ్లాక్ చేశాడని వెల్లడించాడు. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశమైంది, ఆర్‌సీబీ అభిమానులు రాహుల్ వైద్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తీవ్రంగా ట్రోల్ చేస్తున్నారు. ఇటీవల రాహుల్ వైద్య, కోహ్లీ ఆటతీరుపై సోషల్ మీడియాలో విమర్శలు గుప్పించాడు. ముఖ్యంగా ఐపీఎల్ 2025 సీజన్‌లో కోహ్లీ స్ట్రైక్ రేట్‌ను ప్రస్తావిస్తూ, "విరాట్ కోహ్లీ చాలా నెమ్మదిగా ఆడుతున్నాడు. టీ20 ఫార్మాట్‌కు తగ్గట్టు వేగంగా పరుగులు చేయలేకపోతున్నాడు. అతని నెమ్మదైన బ్యాటింగ్ జట్టుకు నష్టం కలిగిస్తోంది. పవర్‌ప్లే తర్వాత వేగంగా ఆడలేకపోవడం వల్ల ఇతర బ్యాటర్లపై ఒత్తిడి పెరుగుతోంది, ఇది జట్టు విజయావకాశాలను దెబ్బతీస్తోంది. కోహ్లీ వంటి సీనియర్ ఆటగాళ్లు విశ్రాంతి తీసుకొని, యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలి," అని అభిప్రాయపడ్డాడు. అయితే, తాను వ్యక్తిగతంగా కోహ్లీని విమర్శించడం లేదని, జట్టు ప్రయోజనాల దృష్ట్యా మాత్రమే మాట్లాడుతున్నానని స్పష్టం చేశాడు. కోహ్లీ గొప్ప ఆటగాడని, కానీ టీ20 ఫార్మాట్‌కు తగ్గట్టు ఆటను మార్చుకోవాలని సూచించాడు. అంతేకాక, అవనీత్ కౌర్ ఫొటోను లైక్ చేయడంపై కోహ్లీ ఇచ్చిన 'ఇన్‌స్టాగ్రామ్ అల్గరిథమ్ గ్లిచ్' వివరణను రాహుల్ గేలి చేశాడు. రాహుల్ వైద్య వ్యాఖ్యలపై ఆర్‌సీబీ అభిమానులు తీవ్రంగా స్పందించారు. "కోహ్లీకి ఎప్పుడు, ఎలా ఆడాలో బాగా తెలుసు. జట్టు కోసమే అతను నెమ్మదిగా ఆడుతున్నాడు," అని కౌంటర్ ఇచ్చారు. సోషల్ మీడియాలో రాహుల్‌ను ట్రోల్ చేస్తూ, "పాటలు పాడేవాడు క్రికెట్ గురించి మాట్లాడుతున్నాడు," అని సెటైర్లు వేశారు. కొందరు రాహుల్ కుటుంబ సభ్యులపై కూడా విమర్శలు గుప్పించారు. దీంతో ఆగ్రహించిన రాహుల్, "కోహ్లీ కంటే అతని ఫ్యాన్స్ పెద్ద జోకర్లు, రెండు కాసుల జోకర్లు," అని మరో ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ పెట్టాడు. ఈ వ్యవహారం మరింత రెచ్చగొట్టడంతో ఆర్‌సీబీ, కోహ్లీ అభిమానులు మళ్లీ రాహుల్‌పై ట్రోలింగ్‌కు దిగారు. ప్రస్తుతం ఈ వివాదం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.



## ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీలో హైడ్రా కూల్చివేతలు

**రాజేంద్రనగర్, మే 6 (జనం సాక్షి) :** నియోజకవర్గం లోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీలో హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టింది. ప్రజావాణిలో హైడ్రా కు స్థానికులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పెషల్ టీం తో ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీలో కాటేదాన్ నుండి మధుబన్ కాలనీకి వెళ్లే కనెక్టివిటీ రోడ్డు గుండా ప్రహరీ నిర్మాణాల గుండా వెలసిన అక్రమ ఫ్యాక్టరీ నిర్మాణాలను అధికారులు కూల్చి వేశారు. ఈ కూల్చివేతలు జరుగుతున్న సమయంలో సదరు యజమాని మాట్లాడుతూ గత 35 సంవత్సరాల నుంచి ఇక్కడ వ్యాపారం చేసుకుంటూ జీవిస్తూ కరెంటు, టాక్స్, జీఎస్టీ పనులు చెల్లిస్తున్నానని కానీ హైడ్రా అందుకు భిన్నంగా కూల్చివేతలు చేపట్టడం సమంజసం కాదని ఇప్పుడు మా బతుకు లు రోడ్డు మీదికి ఈడ్చింది హైడ్రా నాకు న్యాయం జరగాలని బోరున విలపించారు. మరోవైపు హైడ్రాకు ఫిర్యాదు చేసిన రెండు నెలల్లోపే కాటేదాన్ నుంచి మధుబన్ కు వెళ్లే కనెక్టివిటీ రోడ్డుకు అడ్డంగా ఉన్న ప్రహరీ నిర్మాణాలను కూల్చివేయడంతో కాలనీలోకి అత్యవసర అంబులెన్స్‌లో పాటు రవాణా సౌకర్యంలో ప్రజలకు అవస్థలు తప్పుతాయని ఈ చర్యతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. అలాగే గగన్ పహాడ్ లో పలు అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చి వేసింది.

# మలిన జలశుద్ధి కేంద్రాల అభివృద్ధి ప్రోత్సాహక నిధులు

- కేంద్ర గృహ పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సెక్రటరీ థిల్లాన్
- "జల్ హీ అమృత్" కార్యక్రమంపై డిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్



**వరంగల్ ఎంజీఎం, మే 6(జనంసాక్షి):** మలిన జలశుద్ధి కేంద్రాల అభివృద్ధి ప్రోత్సాహక నిధులు అందజేయనున్నట్లు కేంద్ర గృహ పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సెక్రటరీ థిల్లాన్ అన్నారు. మంగళవారం డిల్లీ నుండి అమృత్ 2.0 లో ఎంపికైన నగరాల కమిషనర్లు ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరె న్స్ నిర్వహించారు.ఇందులో హైదరాబాద్ నుండి సిడిఎంఏ డా.టి. కే శ్రీదేవి ఆస్కి ప్రతి నిధి డా. శ్రీనివాస చారి నగరం నుం డి కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ అమృత్ 2.0 లో భాగంగా చేపట్టిన జల్ హీ అమృత్ కార్యక్రమం కింద కేంద్ర గృహ పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆస్కితో కలిసి నగరంలో మలిన జల శుద్ధి కేంద్రాల యుడబ్ల్యూటిపి అభివృద్ధి ప్రోత్సాహక నిధులను అందజేయడం జరుగుతుందని నగరాల స్థాయినీ బట్టి స్టార్ రేటింగ్ ఇవ్వడం జరుగుతుందని నగరానికి 3 స్టార్ రేటింగ్ దక్కినందున మలిన జల శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు.రూ. 2.1 కోట్లు అందజేయడం జరుగుతుందని ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిడిఏంఏ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి అందజేయాలని ఈ ఫండ్ ద్వారా రాష్ట్ర స్థాయిలో వాటర్ రిసోర్స్ రికవరీ సెల్ లను ఏర్పాటు చేయడం, వినియోగించిన నీరు మరియు బయోసాలిడ్స్ యొక్క సర్క్యులర్ మేనేజ్‌మెంట్‌ను ప్రోత్సహించడంతో పాటు, ప్రోత్సాహక నిధుల వినియోగం కోసం వచ్చిన ప్రతిపాదనలను సమీక్షించడం, యుడబ్ల్యూటిపిల పనితీరును పర్యవేక్షించడం వంటి బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని సెక్రటరీ తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జ్ ఎస్ ఈ శ్రీనివాస్, ఈ ఈలు రవి కుమార్, సంతోష్ బాబు, స్మార్ట్ సిటీ పిఎంసి ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.

> హైదరాబాద్ గండిపేట పరిధిలో కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం గండిపేట మండల పరిధిలోని మంచిరేవుల గ్రామ సర్వే నంబర 281లో ఎకరం భూమిని విద్యుత్ శాఖకు కేటాయించారు. ఇందులో భాగంగా సర్వే చేపట్టి ఎకరం భూమి హద్దురాళ్లను నాటి విద్యుత్ శాఖ ఏడీఈ అంబేడ్కర్ సమక్షంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేశ్ ఆధ్వర్యంలో పంచనామా చేసి పత్రాలు అందజేశారు.





# గాలివాన బీభత్సం

## నేల రాలిన మామిడి కాయలు



- వంద ఎకరాల దెబ్బతిన్న మామిడి తోటలు
- తడిసిన వరి ధాన్యం


**పాలకుర్తి, మే 6 (జనంసాక్షి) :** మండలంలోని మంగళవారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించింది. గాలివాన కారణంగా మండలంలో వంద ఎకరాల మేర మామిడి తోటలు నేలరాలడంతో రైతులు లబోదిబోమంటున్న పరిస్థితి నెలకొంది. పాలకుర్తికి చెందిన మామిడి రైతులు వర్రె ఎల్లయ్య, లోకమ్మ, వెంకన్నల 20 ఎకరాల మామిడి తోటలో మామిడి కాయలు నేలరాలాయి. అంతే కాకుండా విస్నూరు గ్రామ రైతు అడ్డూరి భూపాలరావుకు చెందిన ఆరు ఎకరాల మామిడి తోట, ఐలోని యాకారావుకు చెందిన మూడు ఎకరాల మామిడి తోటలు దెబ్బతిన్నాయి. కోతులబాద్ కు చెందిన ఏనుగు అంజిరెడ్డికి చెందిన నాలుగు ఎకరాల తోటలో కాయలేకుండా నేలరాలడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా పాలకుర్తి, వావిలాల గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలను వెంటనే పంపించాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తో మాట్లాడారు, పాలకుర్తికి చెందిన రాపర్తి లక్ష్మీ రేకుల ఇంటిపై కప్పు గాలివానకు లేచిపోయాయి. దీంతో ఉన్న గూడు కాస్తా దెబ్బతినడంతో బాధితురాలు లక్ష్మీ ఆవేదన చెందుతంది. ఏమ్మెల్యే యశస్వినిరెడ్డి కూలిన ఇంటిని సందర్శించి పరిశీలించారు.అనంతరం ఎమ్మెల్యే స్పందిస్తూ నిత్యవసర సరుకులు అందించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూర్ చేస్తానని బాదితురాలికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి భరోసాను ఇచ్చారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి,ఆ వీరమనేని యాకాంతారావు, పెనుగొండ రమేష్, ఎండి సలీం, ముత్తినేని కర్ణకర్ , నలమాస రమేష్, తదితరులు ఉన్నారు.



# 14 మండలాలకు అసిస్టెంట్ ఇంజినీర్‌ల కేటాయింపు పూర్తి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- హౌజింగ్ శాఖ పరిధిలో నూతనంగా విధుల్లో చేరిన 14 మంది ఏఈలు





**ఖమ్మం, జనంసాక్షి :**
హౌజింగ్ శాఖ బలోపేతం చేస్తూ ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఖమ్మం జిల్లాకు ప్రభుత్వం కేటాయించిన 14 మంది అసిస్టెంట్ ఇంజినీర్ లకు మండలాల కేటాయింపు చేస్తూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మరింత సమర్ధవంతంగా అమలు చేసేందుకు తెలంగాణ స్టేట్ హౌజింగ్ కార్పొరేషన్ లిమిటెడ్, ఖమ్మం విభాగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అసిస్టెంట్ ఇంజనీర్లను కేటాయించిందని కలెక్టర్ తెలిపారు.

మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో నూతన ఏఇ లు కలెక్టర్ ని కలిశారు. ఈ సందర్భంగా కేటాయించిన విధులు సమర్ధవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ అన్నారు.కామేపల్లి మండలానికి డి. నగేష్, నేలకొండపల్లి మండలానికి వి. లింగా, రఘునాధపాలెం మండలానికి జి. పుష్ప, చింతకాని మండలానికి టి. సుప్రియ, తల్లాడ మండలానికి షేక్ అస్మా, ఏన్కూరు మండలానికి బి. స్నేహ, కల్లూరు మండలానికి ఎన్. సాయి పవన్, వేంసూరు మండలానికి ఎం. శ్రీనివాస్, ముదిగొండ మండలానికి బి. సతీష్, ఎర్రుపాలెం మండలానికి పి. గోపి, సత్తుపల్లి మండలానికి వి. పవన్ కళ్యాణ్, పెనుబల్లి మండలానికి వై. కమల్ ప్రసాద్, కూసుమంచి మండలానికి ఏ. రవి, తిరుమలాయపాలెం మండలానికి కే. మిథున్ కుమార్ అసిస్టెంట్ ఇంజనీర్లను కలెక్టర్ కేటాయించారు.

అసిస్టెంట్ ఇంజనీర్లు సంబంధిత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు వెంటనే రిపోర్ట్ చేయాలని, అసిస్టెంట్ ఇంజనీర్లకు ఇందిరమ్మ ఇళ్ల బాధ్యతలు అప్పగించాలని, వారి పనితీరు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా హౌజింగ్ ఇఇ భూక్యా శ్రీనివాస్, డిఇలు పాల్గొన్నారు

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
07 మే 2025

# పిల్లల చేతిలోనే మన దేశ భవిష్యత్తు

- చిన్నపిల్లల భవిష్యత్తు అంగన్వాడీ టీచర్లపై ఆధారపడి ఉంది
- తొలి ఒడి అమ్మ ఒడి- మలిఒడి అంగన్వాడి బడి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**మెదక్ జిల్లా బ్యూరో, మే 6 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడి సెంటర్స్ లలో పోషకాహారం చిన్నపిల్లలకు క్రమశిక్షణ నైతిక విలువలు, కూడిన విద్యా బోధన అంగన్వాడి సెంటర్స్ తోనే సాధ్యపడుతుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ మండలం శుభం ఫంక్షన్ హాల్లో అంగన్వాడీ ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ శర్మని సభలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి, ఇన్చార్జి అదనపు కలెక్టర్ భుజంగరావు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, గ్రంధాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, డి డబ్ల్యుఓ హైమావతి, ఎలక్షన్ రెడ్డి జెడి విశాలాక్షి, సంబంధిత ఐసిడిఎస్ సిడిపివోలు, అంగన్వాడీ టీచర్లతో కలిసి మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అంతకు ముందు అంగన్వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన స్టాలు, చార్టర్లను పరిశీలించారు. అనంతరం టెక్నిప్ ఎఫ్ఎంసీ ఇండియా సంస్థ స్పాన్సర్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్లను, మెమోంటోలను మంత్రి అందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్స్ ఫ్రీ ప్రైమరీ స్కూల్స్ గా మార్చుకొని అంగన్వాడీలను మరింత ప్రోత్సహించాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ అందరికీ స్పాన్సర్షిప్ తో ముందుకు వచ్చిన టెక్ ఎఫ్ఎంసి (ఆయిల్ అండ్ మైనింగ్ కంపెనీ) అభినందనలు తెలిపారు. పిల్లల సృజనాత్మకత, వెలికి తీసి వారి ప్రతిభా పాట వాళ్లకు పదును బెట్టి తయారుచేసిన ఎగ్జిబిషన్ చూపరులను ఆకట్టుకుంది మంత్రి సీతక్క తెలిపారు. పిల్లలకు ఆడుతూ, పాడుతూ పిల్లల విద్యా బోధన పిల్లలు అంతర్ సౌందర్యం బాహ్య సౌందర్యం కలిగి ఉండటం గొప్ప విశేషం మొక్కై వంగనిది మానై వంగునా అనే సామెతను దృష్టిలో పెట్టుకుని పిల్లలకు చిన్నప్పటినుండి క్రమశిక్షణ ఉన్నత విలువలు గలన విద్యాబోధన అందించాలన్నారు. పిల్లలను అంగన్వాడీలలో చేర్పించండని, వారికి కార్పోరేట్ ఫ్రీ స్కూల్లకు దీటుగా తమ ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా చదువు చెప్పించడానికి కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాలలో 57 రకాల ఆట వస్తువులను, గర్భిణీ స్త్రీల కోసం బెంచీలు, అవసరమైన పోషకాహారాన్ని అందిస్తున్నామన్నారు. అంతే కాకుండా చిన్నారులకు అవసరమైన పోషకాహారం కోసం సైంటిస్టు చేత బాలంమృతం తయారు చేయిస్తున్నాం అన్నారు. అంతే కాకుండా వారి ఆరోగ్య సంరక్షణ తదితర వాటిని కల్పిస్తున్నారు. తమ ప్రభుత్వం ప్రజాశ్రేయస్సు కోసం పాటుపడుతుందన్నారు.

అంగన్వాడి సెంటర్స్ లలో పిల్లలను క్రమశిక్షణ నేర్పిస్తూ నాణ్యమైన పోషకాహారం అందిస్తూ అన్ని రంగాలలో వారు అద్భుతంగా రానిస్తుంటే ఆనందం వెలకట్టలేదని చెప్పారు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడీ పాఠశాలలో రూపుదిద్దుకోవడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. అంగన్వాడి టీచర్స్‌కు గతంలో ఎన్నడూ లేని విధంగా నెల రోజులు సెలవులు మంజూరు చేశామని వారికున్న డిమాండ్ల సాధనకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. పిల్లలు శారీరక ఎదుగుదల మానసిక పరివర్తత నైతిక విలువలతో సత్ప్రవర్తన గలిగిన వారీగా తీర్చిదిద్దాలని తెలిపారు. బాలామృతం అధిక పోషక విలువలతో కూడిన వాటిని అందించడానికి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మంత్రివర్యులకు పూల బొకేతో స్వాగతం పలికారు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్స్ లలో పోషకాహారం -గుణాత్మక విద్య, ఫ్రీ ప్రైమరీ యాక్టివిటీ సమర్థవంతంగా అమలు అవ్వాలని అంగన్వాడి సెంటర్స్ లలో మంచి టీచింగ్ చిన్న పిల్లలకు టేబుల్స్ లెర్నింగ్ నెంబర్స్ ఆల్ఫాబెట్స్ ఇవన్నీ విజయవంతంగా అమలవుతున్నాయని చెప్పారు. అంగన్వాడీ టీచర్స్ కు ఒక మంచి కార్యక్రమాన్ని వారికి ఇస్తున్నామని టెన్త్ పాస్ అయిన పిల్లలను ఇంటర్మీడియట్లో జాయిన్ చేసే విధంగా చర్యలు తీసుకునేటట్లు చూడాలన్నారు. పోషకాహార రహిత అంగన్వాడి సెంటర్ల గా రూపుదిద్దుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నందున అంగన్వాడీ టీచర్స్ కు ఎఫ్ఎంసీ టెక్ వాలంటీర్ సంస్థకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# శాంతిచర్చలకు ముందుకు రావాలి



- కేంద్ర ప్రభుత్వం మొండిగా ఉండడం ప్రజాస్వామికం కాదు
- జస్టిస్ చంద్రకుమార్

కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలకు ముందుకు రావాలని, మావోయిస్టు పార్టీ శాంతిచర్చలకు సిద్ధమని ప్రకటించినా కేంద్రం మొండిగా ఉండటం ప్రజాస్వామికం కాదని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. చర్చలకు కేంద్రం ఒప్పించేందుకు దేశ వ్యాప్తంగా ప్రజలు, ప్రజా స్వామిక వాదులు, అన్ని రాజకీయ పార్టీలు, దళిత, ఆదివాసీ, విద్యార్థి, మత మైనార్టీ వివిధ ప్రజా సమూహాలు ప్రజా స్వామిక పద్దతి లో శాంతియుత నిరసనలతో ఒత్తిడి తీసుకు రావాలని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పీస్ డైలాగ్ కమిటీ అధ్యక్షులు జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశం లో కమిటీ సభ్యులు కంది మల్ల ప్రతాప్ రెడ్డి, ప్రొఫెసర్ పి. ఎల్. విష్ వేశ్వర్ రావు, సి. హెచ్ బాలకిషన్ రావు, ఆత్రం భుజంగరావు, రహమాన్ ఎడిటర్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, సోమ రామ మూర్తి, అజయ్ బాల్నే, హరిప్రీత్, అడ్వకెట్ వెంకన్న (ఐ ఏ పి ఎల్ )బండి దుర్గా ప్రసాద్,హాజరైన ఈ సమావేశం లో పలు తీర్మానాలు చేసారు.శాంతి -చర్చల కమిటీ కేంద్ర ప్రభుత్వానికి, మావోయిస్టు పార్టీకి కాల్పుల విరమణ పాటించి శాంతి చర్చలకు రావాలని విజ్ఞప్తి చేసింది. మావోయిస్ట్ పార్టీ శాంతి చర్చలకు సిద్ధం.. అనువైన వాతావరణం ఏర్పాటు చేయాలని వారి కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పత్రికా ముఖంగా ప్రకటన చేసారు.. తదుపరీ మూడు సార్లు అ పార్టీ చర్చలకు సిద్ధం అని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ కర్రే గుట్ట ఆపరేషన్ ను వేలాది బలగాలతో కొనసాగించడం ప్రజా స్వామ్య విధానం కాదని పీస్ డైలాగ్ కమిటీ అభిప్రాయ పడింది. పీస్ డైలాగ్ కమిటీ పిలుపు తరువాత దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు, వివిధ ప్రజా సంఘాలు, పార్టీలు, సామాజిక సమూహాలు స్పందించి శాంతి చర్చలకు కేంద్రం ముందుకు రావాలని ఉద్యమిస్తున్నారు. ఇంకా ఈ ఒత్తిడి పెంచాలని దేశ వ్యాప్తంగా ప్రజా స్వామిక వాదులకు, అన్ని ప్రజా సమూహానికి, రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చింది. కమిటీ కేవలం కేంద్ర ప్రభుత్వం -మావోయిస్టు పార్టీ ఎలాంటి షరతులు లేకుండా చర్చలకు రావాలని కమిటీ పిలుపు ఇచ్చింది. ఈ తీర్మానం కు లోబడే కమిటీ సభ్యులు ఆయా వేదికల మీద, మీడియా ముందు మాట్లాడాలి, వ్యక్తి గత అభిప్రాయాలను కమిటీ అభిప్రాయాలుగా ప్రకటించడానికి కమిటీ వ్యతిరేకమని ప్రకటించింది.

అనంతరం కమిటీ అధ్యక్షులు గా చైర్మన్ జస్టిస్ చంద్ర కుమార్, ఉపాధ్యక్షులు కంది మళ్ళ ప్రతాఫ్ రెడ్డి, కో ఆర్డినేటర్ గా బండి. దుర్గా ప్రసాద్, ముఖ్య సలహాదారులుగా ప్రొఫెసర్ హరగోపాల్‌లను కమిటీ ఎన్నుకుంది. ఇప్పటి దాక వున్నా ఆడహాక్ కమిటీని రద్దు చేసి ఈ కమిటీ ని ఏర్పాటు చేసినట్లు కమిటీ తీర్మానం చేసింది. తదుపరి మీటింగ్ వరకు రాష్టం లో నిర్మాణం, శాంతి సభలు, ర్యాలీలు చేయాలని తీర్మానం చేసారు.

# 8న బాధిత జర్నలిస్టులకు చెక్కుల పంపిణీ

- మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,మే 6 (జనంసాక్షి) :** వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు, అనారోగ్యం, ప్రమాదాల బారినపడి పనిచేయలేక నిస్సహాయ స్థితిలో ఉన్న జర్నలిస్టులకు ఆర్థిక సహాయ కార్యక్రమం మే 9న మీడియా అకాడమీ ఆడిటోరియంలో జరుగనుంది. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా వచ్చి చెక్కులను అందచేస్తారని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి తెలియచేశారు. ఇటీవల మరణించిన 38 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సాయంతో పాటు ఐదు సంవత్సరాల వరకు, ప్రతి కుటుంబానికి నెలకు మూడు వేల రూపాయల పెన్షన్ ఎల్కేజీ నుండి పదవ తరగతి వరకు చదివే ఇద్దరు పిల్లలకు నెలకు రూ 2000 ట్యూషన్ ఫీజు, జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి మంజూరు చేసినట్లు అకాడమీ చైర్మన్ వెల్లడించారు. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న, ప్రమాదానికి గురై భృతిని కోల్పోయిన జర్నలిస్టులు, ఇతర వ్యాధులకు గురైన వారికి లక్ష రూపాయల చొప్పున, మొత్తం ఎనిమిది మందికి ఆర్థిక సాయం మంజూరు చేశామని శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా, మీడియా. అకాడమీ వెబ్‌సైట్‌ను, జర్నలిస్ట్ ల పునశ్చరణ తరగతుల నిర్వహణకు అకాడమీ ప్రచురించిన వివిధ అంశాలతో కూడిన చిరు పుస్తకాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరిస్తారని తెలిపారు.

# సిఎంగా కొనసాగే హక్కు లేదు

- రేవంత్ తక్షణమే తప్పుకోవాలి: జగదీశ్ రెడ్డి



**సూర్యాపేట, మే6 (జనంసాక్షి) :** రేవంత్ రెడ్డి ఒక్క క్షణం కూడా సీఎం గా కొనసాగేందుకు అర్హత లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఆయన తక్షణమే రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ తొలి నుంచీ చెబుతోన్న విషయం నేడు నిజమవుతుందన్నదని స్పష్టమైందన్నారు. ఓనమాలు రాని వాడిలా పదో తరగతి చదివినట్లున్నది రేవంత్ తీరని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితికి ఎటువంటి ముప్పు లేదని, కానీ రేవంత్ పరిపాలనకు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో అప్పులనుంచి తెలంగాణ రాష్ట్రానికి రెండున్నర లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని, కానీ రేవంత్ పాలనలో రాష్ట్ర ఆదాయం తగ్గిపోగా, మంత్రుల ఆదాయం మాత్రం పెరిగిందని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ఆదాయం లూటీ చేస్తూ ఢిల్లీకి మూటలు మోస్తున్నారు. సీఎం పదవి కోసం మంత్రులు పోటీ- పడి సంపాదనలో మునిగిపోతున్నారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి హామీలను తప్పించుకునేందుకు దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. సీఎం మాట్లాడిన ప్రతి అక్షరం అబద్ధమని, ఇది ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమే అని అన్నారు. మాది వందేళ్ళ చరిత్ర, అపార పరిపాలనా అనుభవం. ఒక్క సంవత్సరం మంత్రులు కడుపు కట్టు-కుంటే అన్ని హామీలు అమలయ్యేవని సూచించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ పరువు బజార్లో పెట్టారని ఆరోపిస్తూ, రాష్ట్ర మానాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి తెలంగాణ వాసికి ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో మరింత వేడి పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# మెట్రో ఛార్జీల పెంపునకు రంగం సిద్ధం

- నష్టాల నుంచి అధిగమించేందుకు చర్యలు



**హైదరాబాద్, మే6 (జనంసాక్షి) :** హైదరాబాద్ మెట్రో రైలు ఛార్జీలను పెంచే అవకాశాలపై తాజాగా సంకేతాలు వెలువడ్డాయి. మెట్రో వర్గాల సమాచారం ప్రకారం, మే రెండో వారంలో సవరించిన టికెట్ రేట్లు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎల్ అండ్ టీ- గ్రూప్ ఛైర్మన్ అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆయన భారత్‌కు చేరిన తర్వాతే ఛార్జీల పెంపుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో సంస్థ ఈ టారిఫ్ సవరణలతో వార్షికంగా అదనంగా రూ.150 కోట్ల వరకు ఆదాయం పొందాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఛార్జీలు పెంచే అంశంపై ఇప్పటికే సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖల ద్వారా సమాచారం ఇచ్చింది. ప్రస్తుతం మెట్రోలో కనిష్ఠ టికెట్ ఛార్జీ రూ.10 కాగా, గరిష్ఠ ఛార్జీ రూ.60గా ఉంది. ఈ గరిష్ఠ ధరను రూ.75 వరకు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవలి నివేదికల ప్రకారం, మెట్రో రైలు సేవలతో పాటు ప్రకటనలు, షాపింగ్ మాల్స్ అద్దె లాంటి ఇతర మార్గాల ద్వారా మెట్రో సంస్థ ఏటా సుమారు రూ.1500 కోట్ల ఆదాయాన్ని నమోదు చేస్తోంది. అయితే మెట్రో నిర్వహణ, ఉద్యోగుల జీతాలు, బ్యాంకు రుణాల వడ్డీలు వంటి ఖర్చులతో కలిపి సంస్థకు వార్షికంగా సుమారు రూ.2000 కోట్ల వ్యయం జరుగుతోందని వర్గాలు తెలిపాయి.

# కార్గో ఎయిర్‌పోర్టుతో విధ్వంసం

- ఆందోళనకు దిగిన ప్రజాసంఘాలు




**శ్రీకాకుళం, మే 6 (జనంసాక్షి) :** పచ్చటి ఉద్దానంలో విధ్వంసకర ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలను చేపట్టవద్దని రైతు, మహిళా, విద్యార్థి, యువజన ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు. రాంపురం, భేతాళపురం, చీపురుపల్లి పంచాయతీలోని గ్రామాల రైతులకు సంఘీభావాన్ని ప్రకటించారు. గ్రామాలను పర్యటించి ఆందోళనలో ఉన్న బాధిత ప్రజలకు మద్దతును తెలిపారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి చపర వెంకట రమణ, సీపీఎం కార్యదర్శి డి.గోవిందు, సీపీఐ ఎమ్మెల్ న్యూ డిమాక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, ఉపకార్యదర్శి వంకల మాధవ రావు, వంశధార సాధన కమిటీ- సభ్యులు కొర్ల హేమారావు , నల్ల అడ్డి మాస్టర్, జీడీ రైతాంగ జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్, పిడిఎస్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్ వినోద్ మాట్లాడుతూ ఏ అభివృద్ధి పనులను చేపట్టినా ప్రజలకు ప్రయోజనం, వారి ఆమోదం పరిగణనలోకి తీసుకుని పాలకులు ఆలోచన చేయాలని, ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేసే ఎయిర్ పోర్టు నిర్మాణాన్ని చేపట్టడం సరికాదని ప్రజలు తమ నిరసనలు తెలుపుతున్న వాస్తవాన్ని ప్రభుత్వం గమనించాలని వారు కోరారు. మందస మండలం రాంపురం, గంగువాడ గ్రామాలలో కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ- అధ్యక్షుడు కొమర వాసు పిలుపు మేరకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సోర్ర రామారావు, ప్రజా కళ మండలి జిల్లా అధ్యక్షుడు రాపాక చిరంజీవి, రంగం కళాకారులు కొనారి సూధన్ ఆధ్వర్యంలో కళజాతర కార్యక్రమం నిర్వహించి బాధిత రైతులకు బాసటగా నిలిచారు. శ్రీకాకుళం జిల్లాలోని పలాస అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మందస, వజ్రపుకొత్తూరు మండలాల సముద్రతీర ప్రాంతాలలోని సుమారు 13 గ్రామాల ప్రజల భూభాగంలో గ్రీన్‌ఫీల్డ్ కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలను నిలుపుదల చేయాలని వారు కోరారు. మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని సముద్ర తీరంలోని ఈ ప్రాంతంలో ఎయిర్పోర్ట్ నిర్మాణానికి అవసరమైన స్థలాలను ఎంపిక చేసి సుమారు 14 వందల ఎకరాల ప్రజల జీవనాధార భూముల్ని ప్రజల నుంచి కొనుగోలు చేసే యత్నాలకు పూనుకుంటు-న్నారనే సమాచారాన్ని తెలుసుకున్న ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ప్రజల ఆమోదం లేకుండా ఈ కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణ చర్యలను చేపట్టడం సరైందికాదని వారు విమర్శించారు. ఉద్దానంలోని రైతులు, ప్రజలు తమ జీవనాధారాన్ని ధ్వంసం చేసే ఈ ఎయిర్పోర్ట్ నిర్మాణం వద్దని వ్యతిరేకిస్తూ పోరాట బాటను పట్టారని తెలిపారు . ప్రజల భూములకు నష్టపరిహారాన్ని లెక్కించడానికి బదులు ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేస్తున్నామనే స్పృహతో ప్రభుత్వం వ్యవహరించాలని సూచన చేశారు. ప్రజల ఆమోదంలేని ఇటు-వంటి నిర్మాణాలను ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు-కు ప్రయత్నాలను మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాందోళన ఉధృతం కాకముందే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు కోరారు. ఇప్పటికే సంబంధిత గ్రామాల ప్రజలు ఉద్యమబాట పట్టిన వైనాన్ని గమనించే ప్రజా సంఘాలుగా మేము వచ్చామని వారన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతు నాయకులు జోగి అప్పారావు, చిత్త.గున్నయ్య, ఎన్.పరుశురాం, మర్ల. సంతోష్, డా.వై.యస్.ఆర్.ఉద్యానవన యూనివర్సిటీ- బోర్డు మెంబెర్ బత్తిని లక్ష్మణ్, గుంటు-.లోకనాథం, గుంటు-రామస్వామి, జోగి రాజు, ఎల్.నారాయణతో పాటు- పెద్ద ఎత్తున గ్రామాల రైతులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# 70 రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోరా?

- రోడ్డు పై బైఠాయించిన మొక్క జొన్న రైతులు..
- ఏడువందల మంది రెండు గంటల పాటు రాస్తారోకో..
- నష్టపరిహారం అందకుండా ఆర్గనైజర్లే అడ్డుకుంటున్నారని మండిపాటు..



**నూగూర్ వెంకటాపురంమే 6(జనం సాక్షి):** బహుళజాతి మొక్కజొన్న కంపెనీలు చేసిన మోసానికి కుదేలైన రైతులు నష్టపరిహారం కోసం డెబ్బై రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పూసూరు బ్రిడ్జి వద్ద ఏడువండల మంది మొక్క జొన్న రైతులు జాతీయ రహదారి పైన సుమారు రెండు గంటల పాటు భైఠయించారు.నష్టపోయిన రైతులకు ఇస్తాన్నన్న నష్టపరిహారం ఇవ్వకుండా ఆర్గనైజర్లు, కంపెనీ ఉద్యోగులు అడ్డుపడుతున్నారని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ఆరోపించారు. డెబ్బై రోజుల నుండీ ఏజెన్సీ రైతులు ఆందోళన చేస్తూ ఉంటే నష్టపరిహారం ఇస్తామని తాత్సరం చేస్తున్నారని అన్నారు. వ్యవసాయ కమిషన్ చైర్మన్ కొందండ రెడ్డి ముందు హైటెక్, సింజెంట, మొన్సెంట, బెయర్ కంపెనీల ఆర్గనైజర్లు, కంపెనీల ఉద్యోగులు రైతులకు అణా పైసా కూడా పెట్టుబడి ఇవ్వలేదని చెప్పినరాని అన్నారు. కలెక్టర్ దివాకరా టి ఎస్ ఆర్గనైజర్లకు మనీ ల్యాండరింగ్ నోటీసులు ఇస్తే ఏ ఒక్క రైతుకు అప్పులు ఇవ్వలేదని వివరణ ఇచ్చారని అన్నారు. నష్టపరిహారం చెల్లిస్తానని ఆర్గనైజర్లు, కంపెనీ ప్రొడక్షన్ మేనేజర్లు ఒప్పుకుని కలెక్టర్ ముందు సంతకాలు పెట్టినరాని తెలిపారు. సుమారు పదిహేను కోట్ల రూపాయలు చెల్లించనున్నట్లు కంపెనీలు తెలిపాయని అన్నారు. ఎకరం సాగు చేసిన రైతు పైన డెబ్బై వేల రూపాయలు పెట్టుబడి పెట్టినట్టు హైటెక్ కంపెనీ ప్రొడక్షన్ మేనేజర్ ఒక తప్పుడు నివేదిక కలెక్టర్ కు సమర్పించినట్టు వివరించారు. కానీ వాస్తవానికి బ్యాంక్ ఖాతా నుండీ ఒక్కో ఎకరానికి రైతుకు ఆర్గనైజర్ చెల్లించింది ఇరవై నుండీ ముప్పై వేల రూపాయలని రైతుల బ్యాంక్ ఖాతాలను పరిశీలించడం ద్వారా కలెక్టర్ గుర్తించరాని ఆయన పేర్కొన్నారు. ఆర్గనైజర్లు జిల్లా కలెక్టర్ ని, వ్యవసాయ అధికారులను రాజకీయ ఒత్తిడులకు గురి చేసి వాళ్ళపని వారు చేసుకోకుండా అడ్డు పడుతున్నారని అన్నారు. ఏ బి సి గ్రేడ్లు రద్దు చేసి అందరికి ఒకే గ్రేడ్ ఇచ్చి ఎకరానికి ఎనభై ఐదు వేల రూపాయలు కంపెనీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కంపెనీ ఆర్గనైజర్ల పైన బలమైన కేసులు పెట్టక పోవడం కారణంగానే బయట ఉండి అధికారులను, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి పైన రైతులు నమ్మకం పెట్టుకొని ఉన్నారని అన్నారు. కంపెనీ ఆర్గనైజర్ల దుశ్చర్యల తో రైతుల ఆశలు ఆడిఆశలు అయ్యాయాని రైతులు వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ప్రాజెక్ట్ అధికారిని చిత్త మిశ్రా రావాలని రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రెండు గంటలైనా అధికారులు ఎవరు రాకపోవడం తో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని లేవాలని పోలీస్ అధికారులు సి ఐ బండారి కుమార్, వాజేడు, వెంకటాపురం ఎస్సై లు కొప్పుల తిరుపతి రావు రైతులను బలవంతంగా లేపే ప్రయత్నం చేశారు. రైతులు ఎమ్మెల్యే వచ్చేదాకా లేసేది లేదన్నారు. చివరికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చరవాణి ద్వారా రైతులతో మాట్లాడినారు. వారం రోజుల్లో రైతులకు నష్టపరిహారం చెల్లించక పోతే త్వరలోనే ప్రగతి భవన్ ని ముట్టడి చేస్తాని హెచ్చరించారు.రేపు వెంకటాపురం వస్తానని వచ్చిన తర్వాత రైతులతో అన్ని విషయాలు మాట్లాడి నష్టపరిహారం అందేలాగా చూస్తానని హామీ ఇవ్వడం తో రైతులు ధర్నా విరమించారు. జి ఎస్పీ జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్, గిరిజన సంఘం నాయకులు జెజ్జరీ దామోదర్ మద్దతు ప్రకటించారు. అండగా ఉంటామని తెలిపారు. ఏ ఎన్ ఎస్ నాయకులు మోడెం నాగరాజు, కుంజ మహేష్, రైతు నాయకులు పాయం రాంబాబు, నాగుల ప్రవీణ్, చేలే రాజేష్, జాడి ఈశ్వర్, సాంబ మూర్తి,రైతులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370